

వింత నిర్ణయాలకు విద్యాశాఖ కేంద్రంగా మారింది. మండల విద్యా వనరుల కేంద్రాలకు (ఎమ్మార్సీ), పాఠశాల కాంప్లెక్స్‌లకు గత విద్యా సంవత్సరంలో నయా పైసా కూడా నిధులు విడుదల కాలేదు. తాజాగా పాఠశాల గ్రాంట్లు లేకపోయినా సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయం వాటి ఆడిట్ నిర్వహించేందుకు పూనుకుంది. 2023-24 విద్యా సంవత్సరంలో స్కూళ్లకు విడుదలైన గ్రాంట్లకు సంబంధించి ఈనెల 3, 4 తేదీల్లో ఆడిట్ చేయించుకోవాలని ప్రకటించడంతో హెచ్‌ఎంలు విస్తుపోయారు. అసలు ఇవ్వని గ్రాంట్లకు ఆడిట్ ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఆ పేరుతో తాము ఖాళీ పుస్తకాలు చూపించి వచ్చేందుకు ఖర్చులెవరు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.

- గతేడాది నిధుల విడుదల సున్నా
- ఎమ్మార్సీలకు అందని వైనం
- పాఠశాలలదీ అదే పరిస్థితి
- రాని గ్రాంట్లకు ఇప్పుడు ఆడిట్
- రూ.కోటికి టెండర్
- అయోమయంలో హెచ్‌ఎంలు
- నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం



సమగ్రశిక్ష.. మజాకా!

ఒంగోలు(విద్య), జూలై 2: నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్లుంది సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయ వ్యవహారం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యార్థులను వందశాతం పాఠశాలల్లో నమోదు చేసేందుకు జూన్ 13 నుంచి 'నేను బడికి పోతా' పేరుతో కార్యక్రమాలను నిర్వహించేందుకు జూన్ 14న సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ పేరుతో ఉత్తర్వులు వెలువడ్డాయి. విచిత్రమేయంటే 13వతేదీనే నిర్వహించాల్సిన కార్యక్రమాలను కూడా 14న విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొనడంతో అందరూ విస్తుపోయారు. అదేవిధంగా 2023-24 విద్యా సంవత్సరంలో సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయం నుంచి పాఠశాల కాంపోజిట్ గ్రాంటు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. ఈ ఏడాది ఇంతవరకూ పైసా విడుదల చేయలేదు. అయినా సరే ఆడిట్ అంటూ సమగ్ర శిక్ష కార్యాలయం సిద్ధమైంది. దీంతో ప్రధానోపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నారు.

విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి సమగ్ర శిక్ష ప్రాజెక్టు నుంచి పాఠశాలలకు కాంపోజిట్ గ్రాంటు విడుదలవుతుంది. 1 నుంచి 8వ తరగతులకు పాఠశాలల్లో 30 మంది లోపు ఉంటే రూ.10వేలు, 30 నుంచి 100మందిలోపు పిల్లలు ఉంటే రూ.25వేలు, వంద నుంచి 250మందిలోపు ఉంటే పాఠశాలలకు రూ.50వేలు, 250పైన వెయ్యిమందిలోపు పిల్లలు ఉన్న పాఠశాలలకు రూ.75వేల చొప్పున కాంపోజిట్ గ్రాంటు ఇవ్వాలి. 9 నుంచి 12వ తరగతి వరకు 30 నుంచి 100మందిలోపు పిల్లలు ఉన్న స్కూల్‌కు రూ.25వేలు, 100 నుంచి 250మందిలోపు పిల్లలు ఉన్న పాఠశాలలకు రూ.50వేలు, 250 నుంచి వెయ్యిమందిలోపు పిల్లలు ఉన్న పాఠశాలలకు రూ 75వేలు, వెయ్యి మందిపైన విద్యార్థులు ఉన్న స్కూళ్లకు రూ.లక్ష గ్రాంట్ ఇస్తారు. గతేడాది 1నుంచి 8 తరగతులు ఉన్న 1,995 పాఠశాలలకు రూ.5.10 కోట్లు, 9 నుంచి 12 తరగతులు ఉన్న 363 పాఠశాలలకు రూ.2.24 కోట్లు మంజూరు కాగా పాఠశాలలకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. 2022-23 విద్యా సంవత్సరంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు విడులైన రూ.10.23 కోట్లలో కేవలం రూ.4కోట్లు మాత్రమే రాగా అది రెండు విడతలుగా పాఠశాలలకు విడుదల చేసి చేతులు దులుపుకొన్నారు.

నేటి నుంచి ఆడిట్

జిల్లాలో పాఠశాలల ఆడిట్ బుధవారం నుంచి ప్రారంభంకానుంది. మొత్తం 902 పాఠశాలలకు ఆడిట్ నిర్వహిస్తారు. 3న ఒంగోలు మండల విద్యావనరుల కేంద్రంలో 13 మండలాల్లోని 285 స్కూళ్లకు, పొదిలి ఎమ్మార్సీలో 9 మండలాల్లోని 224 స్కూళ్ల, 4న మార్కాపురంలో ఎమ్మార్సీలో 373 పాఠశాలలకు ఆడిట్ జరుగుతుంది.

హెచ్‌ఎంల జేబుల నుంచే ఖర్చు

పాఠశాలలకు ఇవ్వాల్సిన గ్రాంట్లను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వాటి నిర్వహణకు ప్రధానోపాధ్యాయులు విధిగా తమ జేబుల నుంచి ఖర్చుచేయాల్సి వచ్చింది. ఎక్కువమంది పిల్లలు ఉన్న పాఠశాలల్లో హెచ్‌ఎంలు రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు ఖర్చుచేసి లబోదిబోమంటున్నారు. పాఠశాల విద్యుత్ బిల్లులు, మరమ్మతులు, ఇంటర్నెట్, తాగునీరు తదితరాలకు హెచ్‌ఎంలు తమ సొంత నిధులనే వెచ్చించాల్సి రావడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. కేంద్రప్రభుత్వం ఇచ్చే 60శాతం గ్రాంట్‌కు రాష్ట్రప్రభుత్వం 40శాతం కలిపి మొత్తం 100శాతం పాఠశాలలకు విడుదల చేయాల్సి ఉండగా ఒక్కశాతం నిధులు కూడా ఇవ్వలేదు.

ఆడిట్ పేరుతో రూ.కోటికి టెండర్

ఆడిట్ కోసం గతంలో పాఠశాలకు రూ.150, ఆ తర్వాత రూ.250 చొప్పున చెల్లించే వారు. ప్రస్తుతం విడుదల చేయని నిధులను ఆడిట్ చేసేందుకు సదరు కంపెనీకి కోటి రూపాయలు చెల్లించేందుకు టెండర్ ఖరారు చేశారు. అయితే తెలంగాణలో మాత్రం ఆడిట్‌కు నామమాత్రంగానే చెల్లింపులు జరుగుతున్నట్లు చెప్తున్నారు. పాఠశాలకు విడుదల కాని నిధులకు ఆడిట్ ఏమిటని హెచ్‌ఎంలు తలలు పట్టుకుంటున్నారు. ఆడిట్‌కు మండల విద్యావనరుల కేంద్రాలకు వెళ్లేందుకు ఖర్చులు ఎవరిస్తారని హెచ్‌ఎంలు ప్రశ్నిస్తున్నారు.



రామకృష్ణారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించి సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

ఆర్మీ జేసీవో రామకృష్ణారెడ్డికి కన్నీటి వీడ్కోలు

సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



రామకృష్ణారెడ్డి (ఫైల్)

గిద్దలూరు, జూలై 2 : లడక్ సమీపంలో ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకుపోయి మృతి చెందిన ఆర్మీ జూనియర్ కమీషన్డ్ అధికారి (జేసీవో) ముత్తుముల రామకృష్ణారెడ్డి (47) అంత్యక్రియలు కన్నీటి వీడ్కోలు మధ్య జరిగాయి. రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని సోమవారం రాత్రి ఆయన స్వగ్రామమైన రాచర్ల మండలం కాలువపల్లి గ్రామానికి మిలటరీ అధికారులు ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం నిర్వహించిన ఆయన అంతిమ యాత్రలో గ్రామస్థులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబీకులను ఓదార్చారు. ప్రభుత్వపరంగా రామకృష్ణారెడ్డి కుటుంబానికి రావాల్సిన సహాయం పూర్తిస్థాయిలో అందేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రామకృష్ణారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. 'జనవరిలో రిటైరై కుమారుల పెళ్లి చేద్దామని చెప్పాడు. ఈ లోపే ఈ దుర్ఘటన చోటుచేసుకొంది. ఇప్పుడు మాకు దిక్కెవరు' అంటూ రామకృష్ణారెడ్డి భార్యాపిల్లలు, తల్లిదండ్రులు రోధిస్తున్నారు. సైనిక లాంచనాలతో మిలటరీ అధికారులు రామకృష్ణారెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు.

ఏఎస్సైపై సస్పెన్షన్ వేటు

- యూనిఫాంలోనే మద్యపానం
- వైరల్ అయిన వీడియో
- చర్యలు తీసుకున్న ఎస్పీ గరుడ్ సుమిత్

ఒంగోలు (క్రైం), జూలై 2: యూనిఫాంలోనే మద్యం తాగి ఈల వేస్తూ, పాటలు పాడుతూ క్రమశిక్షణా రాహిత్యంగా వ్యవహరించిన ఏఎస్సై ఎ.వెంకటేశరరావుపై వేటు పడింది. ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ తెలిపారు. ముండ్లమూరు మండలం శంకరాపురంలో రెండు గ్రూపుల మధ్య గొడవల నేపథ్యంలో అక్కడ పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఈక్రమంలో గతనెల 26న డ్యూటీలో ఉన్న ఏఎస్సై వెంకటేశ్వరరావు సాయంత్రం నాలుగు గంటలకు శంకరాపురం పొలాల్లోకి వెళ్లి యూనిఫాంలోనే మద్యం సేవించారు. దీంతో గతనెల 29న వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీచేశామని ఎస్పీ తెలిపారు. దర్శి డీఎస్పీతో విచారణ చేయించిన అనంతరం నివేదికను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీకి అందజేశామన్నారు. ఆయన ఉత్తర్వుల మేరకు ఏఎస్సైని సస్పెండ్ చేశామని ఎస్పీ తెలిపారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు తీవ్ర అన్యాయం

- 10 నుంచి 30 నెలల వరకు బకాయిలు
- ఆర్థిక సంఘం నిధుల నుంచి జీతాలు ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోని గత ప్రభుత్వం
- కరెంటు బిల్లులు, ఇతర రూపాల్లో దారిమళ్లించడం వల్లనే ఈ పరిస్థితి
- జిల్లావ్యాప్తంగా రూ.50లక్షలకుపైగా పెండింగ్
- కొమరోలులో రోడ్డెక్కిన కార్మికులు



కొమరోలు పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 2 : గ్రామపంచాయతీల్లో పనిచేసే స్వచ్ఛభారత్ కార్మికులకు గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది. కేంద్రప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల వ్యయంలో పారిశుద్ధ్యం మెరుగుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. ఆయా పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధులకు అనుగుణంగా కార్మికులను నియమించారు. వారికి ఆర్థిక సంఘం నిధులు వచ్చిన వెంటనే పంచాయతీ పాలకవర్గాలు వేతనాలు చెల్లించాల్సి ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందుకుభిన్నంగా వ్యవహరించడంతో వారంతా రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో 727 మంది స్వచ్ఛభారత్ కార్మికులు పనిచేస్తున్నారు. వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.6వేల చొప్పున పంచాయతీల నుంచి వేతనం చెల్లించాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు వచ్చిన ఆర్థిక సంఘం నిధులను స్వాహా చేసింది. విద్యుత్ బిల్లుల పేరుతో కొంతమేర నిధులను దారిమళ్లించగా, మరికొంత ప్రభుత్వం హాంఫట్ చేసింది. దీంతో పంచాయతీల్లో నిధులు లేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని పంచాయతీల్లో అరకొర ఉండటంతో కొంతమేర కార్మికులకు చెల్లింపులు చేశారు. మిగతా పంచాయతీల్లో నెలల తరబడి కార్మికులకు వేతనాలు చెల్లించని పరిస్థితి ఏర్పడింది.

ఎన్నికలకు ముందు గుర్తుకొచ్చారు

జిల్లాలో పనిచేసే స్వచ్ఛభారత్ కార్మికులకు 10నెలల నుంచి 35 నెలల వరకూ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆర్థిక సంఘం నిధులు మంజూరవడంతో వాటి నుంచి కార్మికులకు వేతనాలు చెల్లించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పంచాయతీ కార్యదర్శులు వేతనాలు ఇచ్చేందుకు ప్రయత్నించడంతో పాలకవర్గాలు అడ్డుపడ్డాయి. ఈనేపథ్యంలో కొన్ని పంచాయతీల్లో కార్మికులకు వేతనాలు ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా లెక్కలు చూపిన ఘటనలు కూడా ఉన్నాయి. అలా కార్మికులకు సుమారు రూ.50లక్షలకు పైగా వేతనాలు బకాయి ఉంది. తాజాగా మంగళవారం కొమరోలు గ్రామపంచాయతీలో కార్మికులు వేతనాల కోసం రోడ్డెక్కారు. తమకు జీతాలు చెల్లిస్తేనే పారిశుధ్య పనులు చేస్తామని ఆందోళన చేపట్టారు. అయితే కొమరోలు గ్రామపంచాయతీలో పనిచేసే కార్మికులకు వేతనాలు చెల్లించినట్లు అధికారిక లెక్కల్లో చూపుతున్నా వారికి మాత్రం ఒక్కపైసా ఇవ్వలేదు. కార్మికులకు వేతనాలు చెల్లించినట్లుగా చూపిన సర్పంచ్‌లు తాము చేసిన పనులకు ఎం.బుక్‌లు నమోదు చేసుకొని ఆ డబ్బులను దారిమళ్లించినట్లు సమాచారం. ఇలా జిల్లావ్యాప్తంగా స్వచ్ఛభారత్ కార్మికులు ఆందోళన బాట పడుతుండటంతో ఇప్పుడు పంచాయతీ కార్యదర్శుల్లో ఆందోళన ప్రారంభమైంది.

టెట్ నోటిఫికేషన్ విడుదల

- నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం
- 4 నుంచి దరఖాస్తుకు అవకాశం

ఒంగోలు (విద్య), జూలై 2 : రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీటెట్) జూలై-24 నోటిఫికేషన్ మంగళవారం విడుదలైంది. రాష్ట్రంలో 16,317 టీచర్ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు అందరికీ అవకాశం కల్పించేందుకు మళ్లీ టెట్ నిర్వహించాలని అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టెట్‌లో అర్హత సాధిస్తేనే డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. అదేవిధంగా టెట్‌లో సాధించిన మార్కుల్లో డీఎస్సీకి 20 శాతం వెయిటేజీ ఇస్తారు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటించారు. టెట్ పరీక్షకు బుధవారం నుంచి ఈనెల 16 వరకు పేమెంట్ గేట్‌వే ద్వారా పరీక్ష రుసుం చెల్లించాలి. ఈనెల 4 నుంచి 17 వరకు పాఠశాల విద్యా కమిషనర్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలి. 16న ఆన్‌లైన్ లో మాక్ టెస్ట్ నిర్వహిస్తారు. 25న హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆగస్టు 5 నుంచి 20 వరకు రెండు సెషన్లలో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. పేపర్-1ఏ, పేపర్1బీ, పేపర్-2బీ, పేపర్-2బీ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరుగుతాయి. ఆగస్టు 10 నుంచి పరీక్ష పూర్తయిన పేపర్ల ప్రాథమిక కీ విడుదల చేస్తారు. 11 నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరించి 25న తుది కీ విడుదల చేస్తారు. టెట్ ఫలితాలను ఆగస్టు 30న ప్రకటించనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

అంతా అడ్డగోలే!

- వైసీపీ ప్రభుత్వంలో రేషన్ కందిపప్పు, చక్కెర తూకంలోనూ కక్కుర్తి
- కూటమి అధికారంలోకి రాగానే గోడౌన్ల తనిఖీ
- బరువులో తేడా ఉండటంతో పంపిణీని నిలిపివేసిన ప్రభుత్వం
- వచ్చేనెల నుంచి కార్డుదారులకు కందిపప్పు, పంచదార పంపిణీకి చర్యలు

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 2: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అన్నింటిలోనూ అడ్డగోలు వ్యవహారాలే చేసింది. రేషన్ సరుకుల్లోనూ కక్కుర్తి చూపింది. పౌరసరఫరాల శాఖ ద్వారా కార్డుదారులకు ఇచ్చే చక్కెర, కందిపప్పు ప్యాకెట్ల తూకంలోనూ అవినీతికి పాల్పడింది. నిబంధనల ప్రకారం చక్కెర ఒక్కో ప్యాకెట్ 500 గ్రాములు (అర కిలో) ఉండాల్సి ఉండగా 10 నుంచి 20 గ్రాముల వరకు తక్కువగా తయారు చేయించి కార్డుదారులకు తీవ్రమోసం చేసిందని తేలిపోయింది. గత వైసీపీ ప్రభుత్వానికి అనుకూలురైన వారికి పంచదార, కందిపప్పు కాంట్రాక్టు ఇవ్వడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందన్న ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఈనేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫ రాల గిడ్డంగుల్లో ఉన్న నిల్వలను ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తోపాటు ఉన్నతాధికారులు కూడా తనిఖీ చేశారు.

జేసీ ఆధ్వర్యంలో తనిఖీలు

జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ నేతృత్వంలో తనిఖీ చేశారు. ఆయా గోడౌన్లలో ఉన్న స్టాకును పరిశీలించడంతోపాటు ప్యాకెట్లను తూకాలు వేసి కూడా చూశారు. స్వయంగా జేసీ చీమకుర్తిలో తనిఖీ చేయగా, జిల్లాలో ఎక్కడికక్కడ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశీలించారు. చక్కెర, కందిపప్పు ప్యాకెట్లను తూకం వేయగా తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. పేదలకు పంపిణీ చేసే వస్తువుల్లో నాణ్యత పరిస్థితి పక్కనపెడితే కనీసం నిబంధనల ప్రకారం కూడా తూకం లేకపోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా నిలుపుదల చేయించారు. సరుకును సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు నోటీసులు కూడా ఇచ్చినట్లు సమాచారం. పేదలకు పంపిణీ చేసే కందిపప్పు, చక్కెరలోనూ కక్కుర్తిపడటంపై పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. పేదలకు నాణ్యమైన వస్తువులతోపాటు తూకం కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అదనుగుణంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో జూలైలో ఇవ్వాల్సిన కందిపప్పు, చక్కెరను సర్కారు నిలుపుదల చేసింది. ఆగస్టు నుంచి పేదలకు పూర్తిస్థాయిలో బియ్యంతోపాటు చక్కెర, కందిపప్పు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.



చీమకుర్తి గోదాములో రికార్డుల్లో తూకాలను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ (ఫైల్)

వెలిగొండ పూర్తికి చర్యలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- నిర్మాణ పనులు, ముంపు గ్రామాలు, పునరావాస కాలనీల సందర్శన

మార్కాపురం/మార్కాపురం రూరల్, జూలై 2: కరవు ప్రాంతమైన పశ్చిమప్రకాశానికి వరప్రదాయిని అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి నిర్మాణ పనులను, ముంపు గ్రామాలు, పునరావాస కాలనీలను మంగళవారం ఆమె సందర్శించారు. తొలుత గొట్టిపడియ గ్రామానికి సంబంధించి వేముల కోటలోని కోమటికుంట వద్ద ఉన్న పునరావాస కాలనీకి వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడకు చేరుకున్న గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామానికి సంబంధించి వ్యక్తిగత పరిహారం త్వరగా అందజేయాలని పలువురు కోరారు. అనం తరం గొట్టిపడియ డ్యాంతోపాటు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు నీటిని అందించేందుకు నిర్మిస్తున్న ఇన్‌టెక్ వెల్ పనులను కలెక్టర్ పరిశీలించారు. పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి ముంపు గ్రామమైన పెద్దారవీడు మండలం కలనూతలకు చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వపరంగా వారికి అందుతున్న సేవలు, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల గురించి తెలుసుకున్నారు. తమకు సహేతుకమైన వ్యక్తిగత పరిహారం అందజేస్తే గ్రామాన్ని ఖాళీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నిర్వాసితులను గుర్తించడానికి కటాఫ్ తేదీని పెంచాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని గ్రామస్థులకు ఆమె హామీ ఇచ్చారు. అక్కడ నుంచి సుంకేసుల డ్యాంను పరిశీలించి మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి అన్సారియా చేరుకున్నారు. మధ్యాహ్నం కలనూతల గ్రామస్థుల కోసం మార్కాపురం మండలంలోని ఇడుపూరులో నిర్మిస్తున్న 1, 2 పునరావాస కాలనీలను సందర్శించారు. అనంతరం పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టులో నిర్మాణంలో ఉన్న గుండంచెర్ల గ్రామస్థుల పునరావాస కాలనీని పరిశీలించారు.



ఇడుపూరు-1 పునరావాస కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

సమస్యలను ఏకరువుపెట్టిన ప్రజలు

గుండచెర్ల గ్రామస్థులు పలు సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా పునరావాస కాలనీ నుంచి సమీపంలోనే ఉన్న జాతీయ రహదారి 565కు నూతన రహదారి ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీలో ప్రార్థనా మందిరాలకు కొంతమేర ఎక్కువ స్థలం ఇవ్వాలని కోరారు. సర్వేలో తప్పులు దొర్లి కొన్ని పేర్లు నమోదుకాలేదని వారిని జాబితాలో చేర్చాలన్నారు. అంతేకాక ముంపు గ్రామాల నుంచి ఖాళీ చేసే తేదీ వరకు నూతనంగా అర్హులైన వారిని వ్యక్తిగత పరిహారం అందించే లబ్ధిదారులుగా గుర్తించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అవసరమైన అన్ని రకాల వసతులను పునరావాస కాలనీల్లో ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాక పరిహారం, లబ్ధిదారుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కలెక్టర్ వెంట మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, ప్రాజెక్టు ఎస్ఈ అబూత్ అలీమ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ ఝాన్సీలక్ష్మి, మార్కాపురం, కంభం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సత్యనారాయణ, డి.నాగజ్యోతి, డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సాయికుమార్, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

కొండపి, జూలై 2 : ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పెంచిన నగదుతోపాటు ఈనెల పింఛన్‌ను 1వ తేదీనే ప్రతి లబ్ధిదారుడికి ఇంటివద్దనే ఇచ్చినందుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాల సెంటర్‌లో చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి స్వామి, టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్యలకు జై కొడుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ కొండపి పట్టణ అధ్యక్షుడు బూదవాటి సోమయ్య, మాజీ సర్పంచ్ యనమద్ని మల్లికార్జున, నాయకులు ఆరికట్ల వెంకటరావు, నేతి రవికుమార్, బూదవాటి కిరణ్‌కుమార్, దేపూరి సుబ్బారావు, ముక్కు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి శ్యాంబాబు

ఒంగోలు(క్రైం), జూలై2: దేశంలో నూతనంగా ప్రవేశపెట్టిన చట్టాలను గురించి జైలు సిబ్బందికి అవగాహన సదస్సు మంగళవారం ఒంగోలులోని జిల్లా జైలులో జరిగింది. జైలు సూపరింటెండెంట్ పోచా వరుణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి కె.శ్యాంబాబు మాట్లాడుతూ సత్వర న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన న్యాయ చట్టాలను రూపొందించిదన్నారు. ఈ చట్టాలలో భారత న్యాయ సహిత, భారతీయ నాగరిక సురక్ష సహిత, భారతీయ సాక్షీ అభియాన్ అనే చట్టాలు ఉన్నట్లు చెప్పారు. నూతల చట్టాలపై జైలు సిబ్బందికి ఉన్న సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కార్యక్రమంలో జైలర్లు వి.రమేష్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెళ్లికానుక ఆర్థికసాయం అందేనా..?

● పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

మద్దిపాడు, జూలై 2: వైసీపీ ప్రభుత్వంలో ఒక్క పథకాన్ని సక్రమంగా అమలు చేసిన దాఖలాలు లేవు. నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ బటన్ నొక్కటమే తప్ప క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల కష్టాలను పట్టించుకోలేదు. చేయూత, ఆసరా, అమ్మఒడి తదితర పథకాల కింద నేటికీ లబ్ధిదారులకు సొమ్ములు అందలేదు. పెళ్లికానుక పథకానిది అదే పరిస్థితి. ఇటీవల ఈ పథకాన్ని చంద్రన్న పెళ్లికానుకగా పేరు మార్చారు. ఈ పథకాన్ని 2014-19 మధ్య కాలంలో నాటి టీడీపీ ప్రభుత్వం సమర్థవంతంగా అమలుచేసింది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో మూడు సంవత్సరాలు ఎటువంటి లబ్ధి చేకూర్చక పోగా రెండు సంవత్సరాలు అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకున్నారు. మద్దిపాడు మండలంలో 23 పంచాయతీలలో 13 సచివాలయాల్లో 92 పెళ్లికానుక దరఖాస్తులు వచ్చాయి. అయితే వారికి ఇప్పటికీ పథకం తాలూకు డబ్బులు అందలేదు. వధూవరులు ఇద్దరు పదో తరగతి పూర్తి చేయాలని, మూడు ఎకరాల మాగాణి, పది ఎకరాల మెట్ట భూమి కంటే తక్కువ ఉన్నవారే అర్హులంటూ 2022 నుంచి ఈ పథకాన్ని పలు నిబంధనలతో అమలు చేశారు. దీంతో అనేకమందికి లబ్ధి చేకూరలేదు. దరఖాస్తు చేసుకున్న అర్హుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉందని మద్దిపాడు ఎంపీడీవో శ్రీహరి మంగళవారం తెలిపారు.

మూణ్ణాళ్ల ముచ్చటగా ఏలూరివారిపాలెం సీసీరోడ్లు

ఎన్నికల ముందు హడావుడిగా నిర్మాణం

పగుళ్లిచ్చి దెబ్బతిన్న వైనం ● వైసీపీ నేతల అవినీతికి పరాకాష్ట



గ్రామంలో దెబ్బతిన్న సీసీ రహదారులు

చీమకుర్తి, జూలై2 : ఎన్నికల కోడ్ వస్తుందన్నగా లబ్ధి పొందాలన్న తాపత్రయంతో హడావుడిగా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం మూణ్ణాళ్ల ముచ్చటగా మారింది. ఏళ్ల తరబడి చెక్కుచెదరకుండా ఉండాల్సిన రోడ్లు ఎక్కడికక్కడ పగిలిపోయి దెబ్బతినిపోవటం గమనార్హం. మండలపరిషత్ నిధులతో మండలంలోని ఏలూరివారిపాలెం గ్రామంలో వైసీపీ నాయకులు నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్ల దుస్థితి అలా మారింది. కోట్ల రూపాయలతో వేసిన రహదారులు నెలలు కాకముందే దెబ్బతినటం ఎంతమేర అవినీతి జరిగిందో తేటతెల్లం చేస్తుంది. రహదారుల దుస్థితి చూసి గ్రామస్థులు ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చినుకుపడితే చిత్తడే..!

● డీఆర్ఆర్ఎం స్కూలులో విద్యార్థుల అవస్థలు



స్కూలు ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరు, బురదలో నడుస్తున్న విద్యార్థులు

నగరంలోని సంతపేటలో గల డీఆర్ఆర్ఎం స్కూలు ఆవరణం బురదమయంగా మారింది. గతంలో నాడు-నేడు కింద పాఠశాల ఆవరణంలో మట్టితోలారు. అయితే పూర్తి స్థాయిలో మట్టిని చదును చేయకపోవడంతో కొద్దిపాటి వర్షం కురిసినా బురదమయంగా మారడంతో స్కూలులో అడుగుపెట్టాలంటే విద్యార్థులు అల్లాడిపోతున్నారు. కొందరు కాలుజారి కిందపడిపోతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. గత రెండు రోజులుగా కురిసిన వానలకు స్కూలు ఆవరణంలో నీరు నిలిచి పోవడంతో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

- ఒంగోలు(కార్పొరేషన్)

ప్రమాదం అంచున ప్రయాణం

చోద్యంచూస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

కలెక్టర్ ఆదేశాలు సైతం బేఖాతర్



మర్రిపూడి చెరవుకట్ట కింద కోనేరు పక్కన కూలిన రక్షణగోడ

మర్రిపూడి, జూలై 2: మండలంలోని టంగుటూరు-పొదిలి ఆర్‌అండ్‌బీ రహదారి ప్రమాదభరితంగా మారింది. మర్రిపూడిలోని గీతాంజలి పాఠశాల నుంచి రేగలగడ్డ బస్టాండ్ వరకూ అడుగడుగునా గోతులు పడ్డాయి. ఆ రెండు కిలోమీటర్లు ప్రయాణించాలంటే 20నిమిషాలకుపైగా సమయం తీసుకుంటోంది. గోతుల కారణంగా వెన్నెముక సంబంధ సమస్యలు తలెత్తుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ వాహనాలకు మరమ్మతులు చేయించాల్సి వస్తుందని వాపోతున్నారు. దీనికితోడు మర్రిపూడి చెరువుకట్ట కింద రెండు వ్యవసాయ దిగుడు బావులు ఉన్నాయి. వాటి వద్ద 40 ఏళ్ల క్రితం రక్షణ గోడలు నిర్మించారు. సంవత్సరం క్రితం రక్షణగోడలు కూలిపోవడంతో ప్రమాదం అంచులో ప్రయాణించాల్సి వస్తోంది. అంతేకాకుండా అక్కడ రోడ్డు కుంచించుకుపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పుకోవడం ఇబ్బందిగా మారింది. ఈరహదారిలో వాహనాల రద్దీ పెరిగిపోవడంతో రాత్రిపూట ప్రయాణం ప్రయాణికులను కలవరానికి గురిచేస్తోంది. ఇటీవల కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు అంచులు కుంగిపోయి వ్యవసాయ బావుల వైపునకు రోడ్డు ఒరిగిపోయింది. ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా వాహనాలు 40అడుగల లోతులో ఉండే వ్యవసాయ బావుల్లో పడిపోయే ప్రమాదం ఉంది. ఇదే జరిగితే అపార ప్రాణనష్టం వాటిల్లే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈరహదారి దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు కథనాలు ప్రచురించింది. అప్పటి కలెక్టర్ దినేష్ కుమార్ రోడ్డు దుస్థితిని స్వయంగా పరిశీలించారు. తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని, లేకపోతే వ్యవసాయ బావులను పూడ్చించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అధికారులు కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేశారు. కంటితుడుపు చర్యగా రక్షణగోడ కూలిన ప్రదేశంలో తేలికపాటి ఇనుప రైలింగ్‌ను ఏర్పాటు చేశారు. బలమైన వాహనాలు తగిలితే రైలింగ్ కూలిపోయే విధంగా ఉంది. మూడేళ్లుగా రహదారికి మరమ్మతులు చేయకపోవడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గత ఏడాది గుంతలను తప్పించబోయి ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. దీనికితోడు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువుకట్ట మట్టి కొట్టుకుపోయి వాహనాలు వ్యవసాయ బావుల్లో పడిపోయే ప్రమాదం కూడా ఉంది. గత టీడీపీ ప్రభుత్వహయాంలో కొండపి శాసనసభ్యులు స్వామి ఈ రహదారి అభివృద్ధికి రూ.39కోట్లు మంజూరు చేయించారు. వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు రావనే భయంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాకపోవడంతో టెండర్లు రద్దయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పుంజుకున్న పొగాకు లోగ్రేడ్ ధరలు

కిలో రూ.340కు చేరిక ● మేలురకంతో పోటాపోటీ ● నేటితో అనుమతించిన మేర అమ్మకాలు పూర్తి



వేలానికి వచ్చిన పొగాకు బేళ్లు

కొండపి, జూలై 2 : కొండపి వేలం కేంద్రంలో రైతులకు అనుమతించిన మేరకు పొగాకు అమ్మకాలు బుధవారంతో ముగియనున్నాయి. ఈదశలో పొగాకు ధరలు ఆశాజనకంగా లభిస్తున్నాయి. మేలురకం కిలో రూ.360కు చేరుకొంది. వారం రోజులుగా లోగ్రేడ్ రకం పొగాకు ధరలు కూడా ఊపందుకున్నాయి. ప్రస్తుతం లోగ్రేడ్ (మాడు) రకం కిలో రూ.340 పలుకుతోంది. బొగులు రకాన్ని వ్యాపారులు కిలో రూ.230 నుంచి రూ.240 వరకూ కొనుగోలు చేస్తున్నారు. దీంతో పొగాకు రైతులు వేలానికి ఈరకం పొగాకును అధికంగా తెస్తున్నారు. వీటితోపాటు చేలో చివరి పొగాకు (ముట్టి పచ్చ రకం) ధర కూడా రూ.215కు చేరింది. ఇప్పటికే వేలం కేంద్రం పరిధిలో అనుమతించిన మేర పొగాకు అమ్మకాలు పూర్తవుతుండగా, అదనంగా పండించిన పంట కొనుగోళ్లు రెండు రోజుల్లో ప్రారంభం కానున్నాయి.

ఇప్పటి వరకూ వేలం కేంద్రంలో దాదాపు 10 మిలియన్ కిలోలు విక్రయించగా, రైతుల వద్ద దాదాపు మరో 8 మిలియన్ కిలోల వరకూ నిల్వ ఉంటుందని వ్యాపారులు, బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు.

డాక్టర్ హృదయనాథ్ సేవలు ఆదర్శనీయం

● జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

● వైద్యసేవారత్న బిరుదుతో సత్కారం



హృదయనాథ్‌ను సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్ వెంకాయమ్మ, డాక్టర్ జవహర్

చీమకుర్తి, జూలై2 : గత ఐదు దశాబ్ధాలుగా గ్రామీణ ప్రాంతంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ హృదయనాథ్ నేటి యువ డాక్టర్లకు ఆదర్శనీయమని జడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ప్రముఖ వైద్యుడు జవహర్ పేర్కొన్నారు. డాక్టర్స్‌డేను పురస్కరించుకొని చీమకుర్తి పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ జవహర్ వైద్యసేవా పురస్కారాన్ని డాక్టర్ హృదయనాథ్‌కు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హృదయనాథ్ మాట్లాడుతూ వైద్యో నారాయణ హరి అనే నానుడిని అక్షరాల నిజం చేసేలా వైద్యులు రోగులకు సేవలు అందించాలని కోరారు. డాక్టర్‌గా సేవలు అందించటం ఎంతో కష్టతరమైనా రోగులు తమ జబ్బు నయమైన తర్వాత వారి కళ్లల్లో కరబరచే ఆనందం చూసి ఎంతటి కష్టమైనా మాయమవుతుందన్నారు. నేటి తరం డాక్టర్లు వ్యాపారత్మకతను విడనాడి సేవా దృక్పథంతో పనిచేయాలని కోరారు. అనంతరం డాక్టర్ జవహర్ మాట్లాడుతూ హృదయనాథ్ అందిస్తున్న సేవలను కొనియాడుతూ నేటితరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. తదుపరి వైద్యసేవలు అందించిన వైద్యులకు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చలువాది బదరినారాయణ, డాక్టర్ రాకేష్, డాక్టర్ శారద, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ విద్యాశంకర్, రాయపాటి ప్రసాదరావు, డాక్టర్ మణిమాల, లయన్స్‌క్లబ్ వైస్ గవర్నర్ లక్ష్మీనారాయణ, విజయ్‌కుమార్‌రెడ్డి, చలువాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి కలెక్టర్‌గా కొమరోలు వాసి !

● మండల ప్రజల హర్షం



తల్లిదండ్రులతో కలెక్టర్ వెంకటేశ్వర్

కొమరోలు, జూలై 2 : రాష్ట్రంలో మంగళవారం జిల్లా కలెక్టర్ల బదిలీల్లో భాగంగా కొమరోలు మండలం ఇడమకల్లు గ్రామానికి చెందిన సలిజామల వెంకటేశ్వర్ తిరుపతి జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. వెంకటేశ్వర్ కొమరోలు మండలంలోని ఇడమకల్లు గ్రామంలోని సలిజామల కాశమ్మ, వెంకటయ్యల కుమారుడు., తల్లి కాశమ్మ కొమరోలు జడ్పీటీసీగా 2001 నుంచి 2006 వరకు చేశారు. అదే సమయంలో తండ్రి సలిజామల వెంకటయ్య సర్పంచ్‌గా ఉన్నారు. ఇరువురు రాజకీయంగా ప్రజలకు సేవచేశారు. వీరి కుమారుడైన సలిజామల వెంకటేశ్వర్ 1 నుంచి 10 వతరగతి వరకు గుంటూరు లయోలా పబ్లిక్ స్కూల్‌లో, ఇంటర్ విశాఖపట్టణంలోని శ్రీచైతన్య కళాశాలలో, ఎంబీబీఎస్‌ను కేజీహెచ్ వైద్యశాలలో పూర్తి చేశారు. తర్వాత వైద్య వృత్తిని వదిలేసి ఐఏఎస్ కోచింగ్ తీసుకుని తొలిసారిగా 2016లో ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. అనంతపురంలో ట్రైనీ ఐఏఎస్‌గా బాధ్యతలు తీసుకున్నారు. తర్వాత పాడేరు సబ్‌కలెక్టర్‌గా తొలిపోస్టింగ్ వచ్చింది. అనంతరం చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గాను పనిచేశారు. ప్రస్తుతం ఏపీ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌గాను విధులు నిర్వహిస్తున్నారు. బదిలీల్లో భాగంగా వెంకటేశ్వర్‌ను తిరుపతి జిల్లా కలెక్టర్‌గా బదిలీచేశారు. దీంతో ఆ గ్రామంలోని ప్రజలు, మండల ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

రీసర్వే చేసి ఆర్‌ఆర్‌ప్యాకేజీ అందించాలి

కలెక్టర్‌కు వెలిగొండ నిర్వాహసితుల వినతి



కలెక్టర్ అన్సారియాకు సమస్యలు వివరిస్తున్న వెంకటరామిరెడ్డి

మార్కాపురం, జూలై 2: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారం భించి 20 సంవత్సరాలు అయినా నేటికీ ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వనందున రీ సర్వే చేసి వెంటనే అం దించాలని ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి మంగళవారం గొట్టిపడియ గ్రామస్థుల నిర్వాసితుల కాలనీ వద్ద కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందించారు. ముఖ్యంగా ప్రాజెక్టు ప్రారంభించిన ప్పటి నుంచి నేటి వరకు నిర్వాసిత గ్రామాల్లో సుమారు 600మంది వరకు చనిపోయారన్నారు. వారంతా పరిహారం కోల్పోయినట్లేన్నారు. అంతేకాక అప్పటి నుంచి ఇప్పటి వరకు 18 సంవత్సరాలు నిండిన యువత వెయ్యి మంది ఉన్నారన్నారు. వారందరినీ అర్హుల జాబితాలో చేర్చాలని కోరారు. రూ.18 లక్షలకు తక్కువ కాకుండా ప్యాకేజీ ఇప్పించాలని కోరారు.

ప్రభుత్వ భూమిని అమ్ముకున్న వైసీపీ నాయకుడు

● లబోదిబోమంటున్న బాధితులు

● వెలుగులోకి తెచ్చిన టీడీపీ నాయకులు



బాధితులతో టీడీపీ నాయకులు

తర్లుపాడు, జూలై 2: తర్లుపాడు మండలం కేతగుడిపి పంచాయతీలో బుడ్డపల్లె గ్రామానికి చెందిన ఒక వైసీపీ నాయకుడు ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా చూపించి ఇళ్ల స్థలాలకు అమ్ముకున్న వైనం వెలుగులోకి వచ్చింది. దీంతో 20మంది బాధితులు లబోదిబోమంటున్నారు. బుడ్డపల్లె ఇలాకాలో సర్వే నెంబర్ 137-6లో 1.31 ఎకరాల ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు తమ్మిశెట్టి ఏడుకొండలు తన సొంత పట్టా భూమిగా చూపించి నమ్మించి 20మంది పేదలకు అమ్ముకున్నాడు. ఇ.నాగేశ్వరరావు, బత్తుల వెంకటరత్తమ్మ, వేముల అంబక్క, బత్తుల ఏడుకొండలు, తమ్మిశెట్టి ఆంజనేయులు, బండారు శ్రీను, తిరుపతి వెంకటస్వామి, తురక అంకారావు, తురక అంకయ్య, వేముల తిరపతమ్మతో పాటు మరో 10మందికి సెంటు రూ.70వేల చొప్పున అమ్ముకుని అగ్రిమెంట్‌లు రాసిచ్చాడు. వైసీపీ నేతకు అండగా వీఆర్‌వో రంగయ్య నిలిచి ఏడుకొండలు పట్టా భూమి అని లబ్ధిదారులకు చెప్పడంతో కొనుగోలు చేశారు. టీడీపీ నాయకులు ఇటీవల ఆక్రమించిన భూమిని సర్వే చేయించగా ప్రభుత్వ భూమిగా గుర్తించారు. దీంతో బాధితులు ఏడుకొండలను నిలదీశారు. ఈ మేరకు ఏడుకొండలు మోసం చేశాడంటూ బాధితులు, గ్రామస్థులు తర్లుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సుధాకర్‌కు, ఎమ్మార్వో ఆజీద్ అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల్లో విచారణ చేపట్టి ఏడుకొండలపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఎమ్మార్వో తెలిపారు. ఈక్రమంలో ఏడుకొండలు గ్రామం నుంచి వెళ్లిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు.

వీఆర్వో సహకారం

గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకులకు కేతగుడిపి వీఆర్వో రంగయ్య తొత్తుగా మారారు. వైసీపీ నాయకులు చేసే అక్రమాలకు అండదండలుగా నిలిచారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేందుకు వైసీపీ నాయకుడికి వీఆర్వో రంగయ్య పాత్ర ఉన్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మార్కాపురం, ఒంగోలు జాతీయ రహదారి పక్కన ఉన్న భూములను కూడా వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని వారి వద్ద రంగయ్య లక్షలాది రూపాయలు తీసుకొని వారికి అండగా నిలిచారని, కేతగుడిపి ఇలాకాలో ఆక్రమణలపై విచారణ చేస్తే వందలాది ఎకరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు.

అవీ..ఇవీ..

అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలపాలి



మంత్రి రవికుమార్‌కు మొక్కను అందజేస్తున్న జేఏసీ నేతలు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 2: అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపి జిల్లా అభివృద్ధికి సహకరించాలని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ కోరారు. మంగళవారం అమరావతిలోని సచివాలయంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో విద్యార్థి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కరుణాకర్, కార్తీక్, కృష్ణ, సాయి, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పోస్టులను భర్తీ చేయాలని వినతి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 2: జిల్లాలో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ముస్లిం జాగరణ్‌మంచ్, ఉర్దూ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు కోరారు. మంగళవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామిని కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఉర్దూ ఎస్‌జీటీ పోస్టులు 28, స్కూలు అసిస్టెంట్ పోస్టులు 8 ఉన్నా డీఎస్సీ నోటిఫికేషన్‌లో చూపించలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి స్వామి ఆయా పోస్టుల భర్తీ కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలవాలని సూచించారు. కార్యక్రమంలో మహ్మద్‌బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మద్దిపాడు, జూలై 2: కారు అదుపుతప్పి మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. మంగళవారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద గుంటూరు వైపు నుంచి వస్తున్న కారు మరో కారును అధిగమించబోయి అదుపుతప్పి మోటార్‌సైకిల్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఒంగోలుకు చెందిన ఆర్.జయరామిరెడ్డికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని అదేకారులో ఒంగోలులోని ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు.

ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 2: రాచర్ల మండలం అనుమలవీడు గ్రామ సచివాలయంలో పనిచేస్తూ మృతి చెందిన జూనియర్ లైన్‌మెన్ సురేష్‌నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రమాదవశాత్తు గత నెల 19వతేదీన విద్యుత్ షాక్‌కు గురై హాస్పటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడన్నారు. మృతుని కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు మృతునికి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన కోరారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ముప్పవరంలో ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

కొండపి, జూలై 2: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక కంభం కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై మండలంలోని ముప్పవరం, చోడవరం గ్రామంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నర్రా శ్రీనివాసరెడ్డి, సభ్యులు చేగిరెడ్డి రామకృష్ణారెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, పి.మస్తాన్, జి.తిరుపతయ్య, కోటయ్య, టి.తిరుపతమ్మ, కె.లక్ష్మి, కె.రామకృష్ణ, కె.శ్రీదేవి, బి.సరస్వతి, బి.నారాయణ, కె.లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

మూగబోయిన అగ్రిగోల్డ్ బాధితుల గొంతుక

● రోడ్డు ప్రమాదంలో జడ్సన్ మృతి

టంగుటూరు, జూలై 2 : అగ్రిగోల్డ్ బాధితుల గొంతుక మూగబోయింది. అగ్రిగోల్డ్ బాధితుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జడ్సన్ సోమవారం రాత్రి జాతీయ రహదారిలో సూరారెడ్డిపాలెం ఫ్లైఓవర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరుకు చెందిన జడ్సన్ అగ్రిగోల్డ్ బాధితుల కోసం నేనున్నానంటూ ముందుకొచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వారి వేదనను ఒంగోలు నుంచి ఢిల్లీ వరకూ తీసుకెళ్లారు. ఎర్రజెండా నీడన జీవితమే పోరాటంగా మలచుకొని ముందుకు సాగిన జడ్సన్ లేని లోటు అగ్రిగోల్డ్ బాధితులకు పూడ్చలేనిది. బాధితులంతా ఏకంగా పనిచేసి ఉద్యమాన్ని ముందుకు నడిపి న్యాయం జరిగే వరకూ పోరాడటమే జడ్సన్‌కు ఇచ్చే ఘన నివాళి.

విద్యాకానుకలు అందజేత



పుస్తకాలను అందజేస్తున్న దేపూరి రత్తమ్మ

కొండపి, జూలై 2 : కొండపిలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో మంజూరైన విద్యాకానుకలను మాజీ ఎంపీపీ దేపూరి రత్తమ్మ మంగళవారం స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్.సుబ్బారావు, టీడీపీ కొండపి పట్టణ అధ్యక్షుడు బూదవాటి సోమయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న మాదిగ ఆత్మగౌరవ దినోత్సవం



నూతన కమిటీ సభ్యులు

మర్రిపూడి, జూలై 2 : మాదిగ ఆత్మగౌరవ దినోత్సవాన్ని ఈనెల 7న ఘనంగా నిర్వహించాలని మాదిగ జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గురిజాల బాబూరావు కోరారు. మంగళవారం వేమవరం, కూచిపూడి గ్రామాలలో ఎమ్మార్పీఎస్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30సంవత్సరాలు పూర్తయినందున ప్రతిపల్లెలో జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. వేమవరంలో ఉచ్చూరి దావీదు, బోడిపోగు మార్క్, యర్రగుంట్ల సిద్దయ్యలను, కూచిపూడిలో బోడిపోగు ఆశీర్వాదం, వాన రాంబాబు, మందా ఆనంద్, చిలక నాగేష్, పెరికె ఆశీర్వాదంలను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సమితి మండల అధ్యక్షుడు మోహిడి బసవయ్య నాయకులు ఉచ్చూరి ఇజ్రాయెల్, గురిజాల పౌలు, గురిజాల ఏసుదాసు, యోహాన్, ఏసు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

మద్దిపాడు,జూలై 2: మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆశాడే సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఆనంద్ మోహన్, శ్రావణ్‌కుమార్, జగదీష్‌బాబు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రజితకుమారి ప్రసంగించారు. స్టాప్ డయేరియా కార్యక్రమం ఈనెల నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు జరుగుతుందన్నారు. అందువల్ల ఆశా కార్యకర్తలు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఒక్కొక్కరికీ రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు ఇస్తారన్నారు.ఈనెల 31 వరకు డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం జరుగుతుంది. ఇందులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ పద్మావతి, కె.బాలకోటయ్య, సీతమ్మ, నాగరాజి పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవితఖైదు

మార్కాపురం, జూలై 2: భార్య హత్య చేసిన కేసులో భర్తకు జీవితఖైదు విధిస్తూ మార్కాపురం ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు మార్కాపురానికి చెందిన పార్వతి, స్థానిక శివాజీనగర్‌కు చెందిన కొసనాల శరభయ్యకు ఇచ్చి 12 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మద్యానికి బానిసైన శరభయ్య బలాదూర్‌గా తిరుగుతుండేవాడు. కుటుంబ పోషణకోసం పార్వతి ఓ ప్రైవేటుస్కూలులో టీచర్‌గా పనిచేస్తుండేది. భార్య పార్వతిపై అనుమానం పెంచుకున్న శరభయ్య నిత్యం గొడవపడుతుండేవాడు. ఈక్రమంలో 2019 జనవరి 16న మధ్యాహ్నం పార్వతి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గొడ్డలితో తలపై దాడి చేయడంతో ఆమె మృతి చెందింది. నేరం రుజువుకావడంతో నిందితునికి జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ దాడులు

ఎక్స్‌కవేటర్, మూడు డంపర్లు స్వాధీనం



మద్దిపాడు స్టేషన్‌లో ఎక్స్‌కవేటర్, డంపర్లు

మద్దిపాడు/మేదరమెట్ల, జూలై 2 : గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఎట్టకేలకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కొరిశపాడు మండలం ఎర్రపాలెం శివారు కొండతోపాటు మద్దిపాడు మండలం బూరేపల్లి కొండలో గత కొద్దిరోజులుగా కొందరు అక్రమార్కులు తవ్వకాలు చేపట్టి మట్టిని అమ్ముకుంటున్నారు. పక్కా సమాచారం మేరకు.. గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ అధికారులు దాడులు చేశారు. సోమవారం రాత్రి మట్టిని తవ్వుతున్న ఎక్స్‌కవేటర్, తరలించేందుకు సిద్ధంగా ఉన్న మూడు డంపర్లను స్వాధీనం చేసుకున్నారు. మైనింగ్ ఏడీ వీరేశ్, సిబ్బంది జగన్నాథ్ తదితరులు దాడులలో పాల్గొన్నారు. కేసు నమోదు చేశామని ఏడీ తెలిపారు. వాహనాలను మద్దిపాడు పోలీసులకు అప్పగించారు.

మాట నిలబెట్టుకున్న లోకేష్

పెరిగిన పింఛన్‌పై దివ్యాంగుడు హర్షం



15 వేల పింఛన్ నగదును చూపిస్తున్న దివ్యాంగుడు మూగయ్య

పామూరు, జులై 2: నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం పెరిగిన పింఛన్ అందుకున్నానని దివ్యాంగుడు మూగయ్య ఆనందం వ్యక్తం చేశారు. పామూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన డబ్బుకొట్టు చినమూగయ్య బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తెలంగాణలో పనుల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు జరిగిన విద్యుత్ ప్రమా దంలో రెండు చేతులు కోల్పోయాడు. అప్పటినుంచి భార్య కూలీ పనలకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నది. మూగయ్యకు కూతురు, కుమారుడు ఉన్నారు. గత ప్రభుత్వంలో దివ్యాంగుడు కింద ఫింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా రూ.3 వేల ఫింఛన్ ఇచ్చారు. పూర్తిస్థాయి అంగవైకల్యం కింద ఫింఛన్ పెరిగేలా చూడమని పలుమార్లు పాలకులను, అధికారులను కోరిన ఫలితం లేకుండా పోయిందని వాపోయాడు. ఈక్రమంలో కనిగిరి ప్రాం తంలో నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేస్తుండగా గ్రామ టీడీపీ శ్రేణులతో కలిసి తన పరిస్థితిని వివరించినట్టు మూగయ్య తెలిపారు. దీనిపై స్పందించిన లోకేష్ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకంలో పేర్కొనట్టు రూ.15 వేలు ఫింఛన్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. లోకేష్ పాద యాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా తనకు పింఛన్ రూ.15 వేలు మంజూ రు చేయడం పట్ల మూగయ్య కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తంచేశారు. ఇచ్చిన మాట ప్రకారం లోకేష్ పింఛన్ పెంచడం పట్ల టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, యారవ శ్రీనువాసులు, పారా వెంకటేశ్వర్లు, జి.శ్రీను రావి నాగార్జున, తెలుగు యువత గ్రామ అధ్యక్షుడు ప్రసాదు, నాగా శేషు హర్షం వ్యక్తం చేశారు.

'కార్పొరేట్'కు దీటుగా జడ్పీ ఉన్నత పాఠశాల

దొనకొండలో ఏటికేడు పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

ఈ ఏడాది కొత్తగా 350 అడ్మిషన్లు



మవనరాలిని పాఠశాలలో చేర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాశం సతీమణి గ్రేసమ్మ

దొనకొండ, జూన్ 29: దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాల కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వెలుగొందుతోంది. ఏటికేడు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది జూన్ 13 నుంచి 28వ తేదీ నాటికి కొత్తగా 350 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. అందులో దర్శి మాజీ ఎమ్మెల్యే బీజీ ప్రకాశం సతీమణి మాజీ జడ్పీ చైర్ పర్సన్ గ్రేసమ్మ తన మనవరాలిని జడ్పీ పాఠశాలలో చేర్పించారు. విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది 1100కు చేరుకుంది. 1950 సంవత్సరంలో ప్రారంభమైన దొనకొండ జడ్పీ పాఠశాల అప్పట్లో ఎంతో వైభోగంగా వెలుగొందింది. ప్రపంచస్థాయిలో వెయిట్‌లిఫ్టర్‌గా గుర్తింపుపొందిన కరణం మల్లేశ్వరి ఈ పాఠశాలకు చెందిన పూర్వపు విద్యార్థిని. ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు దాతల సహకారంతో పాఠశాలలో కరణం మల్లేశ్వరి క్రీడాప్రాంగణం ఏర్పాటుచేయించారు. మూడేళ్ల క్రితం పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన వీవీ రామాంజనేయులు పాఠశాలకు అలనాటి ఖ్యాతిని తెచ్చేందుకు ఉపాధ్యాయుల సంపూర్ణ సహకారంతో సఫలీకృతులయ్యారు. అప్పటి రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఓడరేవు చి న్నవీరభద్రుడు, ఇతర ఉన్నత స్థాయి అధికారులు పాఠశాల ను సందర్శించి ప్రశంసిం చారు.

పాఠశాలలో ప్రత్యేకతలు

విశాలమైన తరగతి గదు లు, సైన్స్ ల్యాబ్‌లు, డిజిటల్ విద్యాబోధన, 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో వి ద్యాబోధన జరుగుతుంది. విశాలమైన క్రీడామైదానం, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వాహణ, 34 బీఎన్ ఒంగోలు ఆంధ్ర బెటాలిన్ ఎన్ సీసీలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. నూతనంగా పీఎంశ్రీ ఉన్నత పాఠశాలగా ఎంపికైనందున ఒకేషనల్ కోర్సు ల్లో బాగంగా టైలరింగ్, బిజినెస్ ట్రేడ్ కోర్సులు అందు బాటులోకి వచ్చాయి. రూ.15 లక్షల జడ్పీ నిధులతో వి ద్యార్థులకు స్టడీ ప్లాట్‌ఫారమ్ ఏర్పాటుచేశారు.

అందరి సహకారంతో ముందుకు సాగుతున్నాం

- రామాంజనేయులు, హెచ్‌ఎం

అందరి సంపూర్ణ సహకారంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కొనసాగేలా ముందుకు సాగుతున్నాం. పాఠశాలలో మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు పూర్వపు విద్యార్థుల సంపూర్ణ సహకారం మరువలేనిది. ఉపాధ్యాయులు అంకితభావంతో అందిస్తున్న విద్యాబోధన కారణంగానే ప్రజల్లో గుర్తింపు పొంది విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా దోహదపడుతుంది.

తైక్వాండోలో సోహెల్‌కు బంగారు పతకం

ఈపూరుపాలెం (చీరాలటౌన్), జూలై 2 : బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ పురుగులపేటకు చెందిన షేక్ మొహమ్మద్ సోహెల్ (సోను) అంతర్జాతీయ తైక్వాండో సబ్ జూనియర్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. గత నెల 28-30 తేదీలలో యూత్ అండ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ నేపాల్ వారి ఆధ్వర్యంలో ఖాట్మండ్‌లో జరిగిన ఈ పోటీల్లో సో హెల్ ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. సోహెల్ చీరాలలోని ఓ ప్రయివేట్ స్కూల్ లో 6వ తరగతి చదువుతున్నాడు. సయ్యద్ సలావుద్దీన్, ప్రశాంత్‌బాబు కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు. చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ సోహెల్ ఉత్తమంగా రాణిస్తుంటాడని పలువురు అభినందిస్తున్నారు.



బంగారు పతకం అందుకుంటున్న సోహెల్

సా..గుతున్న నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను

దర్శిలో అర్ధంతరంగా ఆగిన స్టేషన్ భవన నిర్మాణం

ఇప్పట్లో రైళ్లు తిరిగే అవకాశాలు లేనట్లే

అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు

దర్శి, జూలై 2: అదిగో రైలు వచ్చేసింది.. ఏప్రిల్ నుంచి రాకపోకలు కొనసాగిస్తాం.. ఇకనుంచి రైళ్ల ద్వారా సురక్షిత ప్రయాణం చేయవచ్చని అధికారులు చెప్పిన మాటలు నీటిమూటలవుతున్నాయి. ఇప్పటివరకు రైల్వే లైను నిర్మాణం కూడా పూర్తికాలేదు. భవన నిర్మాణం మధ్యలో ఉంది. మిగిలిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పట్లో రైళ్లు తిరిగే పరిస్థితి కనిపించటం లేదు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైను నిర్మాణ పనులు చేపట్టి పది సంవత్సరాలు కావస్తుంది. ఈ పథకాన్ని ప్రధానమంత్రి ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో కూడా చేర్చారు. 2014 నుంచి 2019 వరకు కొంతమేరకు చురుగ్గా జరిగాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పూర్తి సహకారం అందించలేదు. రైతులకు చెల్లించాల్సిన నష్ట పరిహారం విషయంలో కొంతమంది పేచీలు పెట్టి కోర్టుకు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ సమస్యలను తీర్చకుండా ఇవ్వాల్సిన వాటా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో పనులు తీవ్ర జాప్యం అయ్యాయి. ఇటీవల జరిగిన ఎన్నికల ముందు రైల్వే శాఖ అధికారులు నానా హడావుడి చేశారు. నడికుడి నుంచి దర్శి వరకు రోజుకు రెండు రైళ్లు ముందుగా నడుపుతారు.. గత ఏప్రిల్ నుంచి రాకపోకలు కొనగుతాయన్నారు. రైల్వే లైను పరిశీలన చేసేందుకు ట్రైలర్‌గా ఒక రైలు, ఒక గూడ్స్‌ను రెండు నెలల క్రితం ఇక్కడకు పంపారు. ఆ రైళ్లు చూసిన ప్రజలు ఇక రాకపోకలు కొనసాగుతాయని ఆనందం వ్యక్తం చేశారు. వచ్చిన రైళ్లను చూసేందుకు ప్రజలు గుంపులు గుంపులుగా వెళ్లారు. ఎన్నికల తర్వాత పనులు మరింత మందగించాయి. రైళ్లు నడిపే విషయం గురించి అధికారులు పట్టించుకోలేదు. కనీసం రైల్వేస్టేషన్ భవనం కూడా నిర్మాణం మధ్యలో ఉండటంతో ఇప్పట్లో రైళ్లు తిరిగే పరిస్థితి కనిపించటం లేదు. అధికారులు వ్యవహరిస్తున్న తీరుపట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అధికారంలోకి రావటంతో ఇక నుంచి అయినా పనులు వేగవంతం అవుతాయని ఆశిస్తున్నారు.



దర్శి ప్రాంతంలో ఒకవైపు మాత్రమే పూర్తయిన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైను



నిలిచిపోయిన దర్శి నుండి శ్రీకాళహస్తి వైపు వెళ్లే లైను పనులు

రైతు జీవితాలతో చెలగాటమాడొద్దు!

రెవెన్యూ సిబ్బందిపై జేసీ ఆగ్రహం



కోవిలంపాడు హైవే బాధితులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

సీఎస్‌పురం(పామూరు) జూలై 2 : భూములు కోల్పోతున్న రైతుల జీవితాలతో చెలగాటమాడొద్దని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీవీకే. గ్రీన్‌ఫీల్డ్ హైవే 167-బి జాతీయ రహదారులకు సంబంధించిన అధికారులు, రెవెన్యూ సిబ్బందితో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. రహదారుల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం అందని వివరాలను తెలపాలని వీఆర్వోలను అడుగగా వారి నుంచి సరైన సమాధానం లేక పోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏ.కొత్తపల్లి, రేగులచిలుక, ఉప్పలపాడు, గుంతచెన్నంపల్లి, సీఎస్‌పురం, పెదగోగులపల్లి, ముసునురు, డీటీపల్లి గ్రామాలకు సంబంధించిన అనేక మంది రైతులకు నష్ట పరిహారం అందించడంలో రికార్డులు సక్రమంగా లేకపోవడంపై రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో అన్ని మండలాల కంటే సీఎస్‌పురం మండల వీఆర్వోలు రైతులను జలగల్లా పీల్చి పిప్పిచేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. రికార్డులను పరిశీలించి వారం రోజుల్లో నష్టపరిహారం అందేల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతివారం జాతీయ రహదారిపై సమీక్ష సమావేశం ఉంటుందన్నారు.

మండలంలో జరిగిన భూవిక్రయాలు, ప్రభుత్వ భూముల విషయంలో అక్రమాలు జరిగాయని జేసీ గాపాలకృష్ణ పేర్కొన్నారు. దీనిపై ప్రత్యేక అధికారి నియమిస్తామని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈసందర్భంగా సర్పంచ్ శ్రీరామ్‌పద్మావతి పలు సమస్యలపై వినతి పత్రం అందచేశారు. పశువుల బీడులో పలు అక్రమాలు చోటు చేసుకొన్నాయని , అనేక మంది దొంగ పట్టాలు సృష్టించి ఇల్లు నిర్మించుకొన్నారన్నారు. అర్హులకు న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. రేగులచిలుక గ్రామంలో రెవెన్యూ వెబ్ ల్యాండ్‌ను పునరుద్ధరించాలని ఆదినారాయణ అనే రైతు వినతిపత్రం అందజేశారు. సింగరాయకొండ - మైదుకూరు జాతీయ రహదారి భూసేకరణలో మండలంలోని కోవిలంపాడు గ్రామంలో అంకాలమ్మతల్లి దేవస్థానం, ఇళ్లు కోల్పోతున్న గ్రామస్థులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సర్పంచ్ బుజ్జి సోదరులు జేసీని కోరారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 2 : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య వైద్యులకు సూచించారు. ఐఎంఏ హాలులో డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు కనిపించే దైవాలన్నారు. వారు అంకితభావంతో పనిచేస్తేనే ప్రజల రుగ్మతలు తీరుతాయన్నారు. వైద్యులకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని చెప్పారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఐఎంఏ శాఖ బాధ్యులు డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ పేట శ్రీకాంత్ ఇతర వైద్యులు పాల్గొన్నారు.

మృత్యు కుంటలు

- 15 రోజుల్లో దర్శిలో నలుగురు మృత్యువాత

- విషాదంలో బాధిత కుటుంబాలు

- ఆందోళన చెందుతున్న ప్రజలు



కుంటలో పడి మృతిచెందిన విద్యార్థులు (ఫైల్)

దర్శి, జూలై 2: ఇటీవలకాలంలో నీటి కుంటల్లో పడి విద్యార్థులు మృతి చెందుతున్న సంఘటనలు అధికమవుతున్నాయి. దర్శిలో 15 రోజుల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో నలుగురు విగతజీవులయ్యారు. ఎంతో భవిష్యత్తు ఉన్న చిన్నారులు అకారణంగా నీటిలో పడి మృతిచెందటంతో ఆ కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. మూడు రోజుల క్రితం మండలంలోని తూర్పువీరాయపాలెం వాగులో తవ్విన గుంతలో పడి ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఆంజనేయస్వామి నెలపొంగళ్ల ఉత్సవాలకు ఇక్కడకు వచ్చి ప్రమాదవశాత్తు కుంటలో పడి చనిపోయారు. పొదిలి మండలం ఏలూరుకు చెందిన ధర్నాసి వీరకంత, అద్దంకి మండలం వేలమూరిపాడు గ్రామంకు చెందిన పులి రాఘవేంద్ర బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతిచెందారు. వారిద్దరు అక్కాచెల్లెళ్ల కుమారులు. ఆంజనేయస్వామి నెలపొంగళ్ల ఉత్సవాల్లో పాల్గొనేందుకు తాతగారి ఇంటికి వచ్చి విధి వక్రించటంతో మృత్యువాత పడ్డారు.

అంతకుముందు జూన్ 13న దర్శి మండలం లాధగిరి కాలనీకి చెందిన బొందల నవీన్, కొనకనమిట్ల మండలం వాగుమడుగు గ్రామానికి చెందిన వి.చందు దర్శి ఎన్‌ఏపీ చెరువులో పడి మృతిచెందారు. వీరిద్దరు దర్శి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివారు. నవీన్ పుట్టినరోజు సందర్భంగా స్నేహితులను విందుకు పిలిచాడు. ఎన్‌ఏపీ చెరువు వద్ద భోజనాలు పూర్తి చేసుకొని సరదాగా చెరువులోకి ఈతకు దిగి మృతి చెందారు. ఈ సంఘటనలతో ఆ నాలుగు కుటుంబాలు కుమారులను కోల్పోయి విషాదంలో మునిగిపోయాయి. 15 రోజుల వ్యవధిలో నలుగురు విద్యార్థులు నీటిలో పడి మృతిచెందటం దర్శి ప్రాంతంలో ఆందోళన కలిగిస్తుంది. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

పరువు పోతుందని.. కూల్చారు...!

కుంటలో మూడంతస్తుల భవన నిర్మాణం

భవన యజమానికి మున్సిపల్ అధికారులు నోటీసులు

ఈ క్రమంలో భవనం ముందుభాగం స్వయంగా

కూల్చేస్తుండగా సీజ్ చేసిన యంత్రాంగం



భవనాన్ని కూల్చి వేస్తున్న దృశ్యం

గిద్దలూరు టౌన్, జూలై 2: పరువు పోతుందన్న ఆలోచనతో వైసీపీ సానుభూతిపరుడు, కాంట్రాక్టర్ తన అక్రమ కట్టడాన్ని కూల్చేందుకు ప్రయత్నించారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా గిద్దలూరులో సంచలనం సృష్టించింది. పట్టణంలోని కాశినాయనకుంటలో అక్రమంగా కాంట్రాక్టర్ మీనిగ శివరంగారెడ్డి గత ప్రభుత్వ హయాంలో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. కుంట ప్రాంతంలో మున్సిపల్‌శాఖ అనుమతులు లేకుండా భవనం నిర్మించడంతో పట్టణానికి చెందిన పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. అప్పట్లోనే మున్సిపల్ అధికారులు విచారించి కాశినాయనకుంట మున్సిపాలిటీ భూమి అని తేల్చారు. శివరంగారెడ్డి నిర్మించిన మూడు అంతస్తుల భవనానికి సరైన పత్రాలు లేని కారణంగా మున్సిపల్‌శాఖ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. అంతేకాక మూడు అంతస్తుల భవనం నిర్మించుటకు మున్సిపల్ అధికారుల నుంచి ఎటువంటి ప్లాన్ అప్రూవల్స్, పర్మిషన్లు తీసుకోలేదు. శివరంగారెడ్డి నుంచి ఇటువంటి పత్రాలు లేని కారణంగా ఆ ఇంటిపన్నును, కొలాయి పన్నును రద్దుచేశారు. ఇటీవల రెవెన్యూ అధికారుల సమక్షంలో మున్సిపల్ అధికారులు ఆ బిల్డింగ్‌ను సీజ్ చేశారు. ఇదిలావుండగా విషయం తెలుసుకున్న శివరంగారెడ్డి గతరాత్రి సీజ్ చేసిన మూడు అంతస్తుల భవనాన్ని ఎక్స్‌కవేటర్ ద్వారా పగులగొట్టే ప్రయత్నం చేశారు. కొంత భాగాన్ని ధ్వంసం చేయగా విషయం తెలుసుకున్న మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. అంతేకాక శివరంగారెడ్డిపై గిద్దలూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఫిర్యాదుమేరకు కూల్చివేసే ప్రయత్నం చేసిన శివరంగారెడ్డి, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న చిన్నారులు

కరాటేలో ప్రతిభచూపిన చిన్నారులు

కనిగిరి, జూలై 2: కరాటే బెల్ట్ గ్రేడింగ్‌లో కనిగిరి చిన్నారులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. చాంపియన్ కరాటేడో స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో 49 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలు కరాటే మాస్టర్ వహీద్ ఆధ్వర్యంలో జరుగగా, చిన్నారులు ప్రతిభచూపి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కరాటే మెగా మాస్టర్ యాసిన్ మాట్లాడుతూ కరాటే తోటి వారికి, తనకు రక్షణ కోసం మాత్రమే ఉపయోగించాలని అప్పుడే కరాటే విద్య సార్థకతమవుతుందన్నారు. అనంతరం గ్రేడింగ్‌లో గెలుపొందిన విజేతలైన చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

అద్దంకిని ప్రకాశంలో కలపాలి

మంత్రి గొట్టిపాటికి విద్యార్థి జేఏసీ నాయకుల విజ్ఞప్తి

అద్దంకి, జూలై 2 : అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని విద్యార్థి జేఏసీ నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. అమరావతిలోని సచివాలయంలో మంగళవారం విద్యార్థి జేఏసీ నాయకులు రాయపాటి జగదీష్, కరుణాకర్, కార్తీక్, కృష్ణ, సాయి, తేజ తదితరులు మంత్రి గొట్టిపాటిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రకాశం జిల్లా అభివృద్ధి పథంలో నడిచే విధంగా చేయాలని, పరిశ్రలను ఏర్పాటుకు కృషి చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.



మంత్రికి శుభాకాంక్షలు చెప్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

మార్కాపురానికి పొంచి ఉన్న తాగునీటి ముప్పు



మార్కాపురం పట్టణం వ్యూ

- పాలకుల నిర్లక్ష్యంతో అడుగంటిన దూపాడు ఎస్ఎస్ ట్యాంకు
- నీటి కష్టాలు తీరాలంటే ట్యాంకర్ల ద్వారా సరఫరానే దిక్కు

మార్కాపురం, జూలై 2 : ప్రజాప్రతినిధుల పర్యవేక్షణా లోపం, అధికారుల నిర్లక్ష్యం వెరసి మార్కాపురం పట్టణ వాసులకు నీటికష్టాలు ప్రారంభంకానున్నాయి. పట్టణానికి ప్రధాన తాగునీటి వనరులైన త్రిపురాంతకం మండలం దూపాడులోని ఎస్ఎస్ ట్యాంక్, స్థానిక గుండ్లకమ్మ చెక్‌డ్యామ్‌లు ప్రస్తుతం పూర్తిగా నిండుకున్నాయి. వాటిల్లో ఉన్న కొద్దిపాటి నీటిని మరో పది రోజులు మాత్రమే సరఫరా చేసేందుకు వీలుంది. జూలై రెండోవారం నుంచి సాగర్ నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోనుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో తాగునీటి కోసం జలవనరులశాఖ ఉన్నతాధికారులు సాగర్ ప్రధాన కాలువ వదిలినా స్థానిక మున్సిపల్ యంత్రాంగం సక్రమంగా స్పందించలేదు. ఎస్ఎస్ ట్యాంకులోకి పంపింగ్ చేసుకోవడంలో విఫలమయ్యారు. దీంతో వారి నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారనుంది. ఇక మార్కాపురం చెరువు, గుండ్లకమ్మ పంప్‌హౌస్ వద్ద ఉన్న 14 పవర్ బోర్ల ద్వారా మాత్రమే నీటి సరఫరాకు అవకాశం ఉంది. వాటి ద్వారా 20 శాతం పట్టణానికి మాత్రమే నీటిని అందించే వీలుంది. మిగిలిన 80 శాతం పట్టణానికి ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నిర్లక్ష్యదోరణితోనే నీటి కష్టాలు

మార్కాపురం పట్టణానికి తాగునీటి వనరులు దూపాడులోని ఎస్ఎస్ ట్యాంకు, గుండ్లకమ్మలు. వాటిల్లో ప్రధానమైనది దూపాడు ఎస్ఎస్ ట్యాంకు. ఒక్కసారి ఆ ట్యాంకును నింపితే ఆరు నెలలపాటు పట్టణానికి నీటి ఇబ్బందులు ఉండవు. ట్యాంకు సామర్థ్యం 2,200 ఎంఎల్‌డీలు. అప్పటి డిజైన్ ప్రకారం 90 రోజుల పాటు రోజుకు 30 ఎంఎల్‌డీల నీటిని సాగర్ ప్రధాన కాలువ నుంచి ఎస్ఎస్ ట్యాంకులోకి పంపింగ్ చేసుకుంటే నిండుతుంది. వర్షాకాలంలో సాధారణంగానే నీటిని నింపుకోవచ్చు. వేసవికి ముందు మాత్రం తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం సాగర్ కాలువను వదిలినప్పుడు జాగ్రత్తగా పంపింగ్ చేసుకొని ఎస్ఎస్ ట్యాంకును నింపుకోవాలి. ఈ సంవత్సరం రెండు పర్యాయాలు జలవనరుల శాఖ అధికారులు 30 రోజులపాటు నీటిని వదిలారు. జనవరిలో 15 రోజులు, ఏప్రిల్‌లో 15 రోజులు సాగర్ కాలువ పారింది. ఇతర ప్రాంతాల్లోని చెరువులను ఈ సమయంలో సక్రమంగా నింపుకున్నారు. కానీ మార్కాపురం మున్సిపాలిటీ మాత్రం ఎస్ఎస్ ట్యాంకుకు నీటిని పంపింగ్ చేసే ప్రక్రియపై సక్రమంగా దృష్టిపెట్టలేదు. ఒక్క ప్రజాప్రతినిధి కానీ, అధికారి కానీ అటువైపు కన్నెత్తి చూసిందిలేదు. దీంతో ఎస్ఎస్ ట్యాంకు ప్రస్తుతం పూర్తిగా అడుగంటింది. దీంతో ఆ సమయంలో చుక్కనీరు కూడా ఆ ట్యాంకులోనికి చేరలేదు. ప్రస్తుతం కేవలం 50 ఎంఎల్‌డీ నీరు మాత్రమే ట్యాంకులో ఉంది. మరో వారం మాత్రమే ఆ నీరు పుర ప్రజల అవసరాలు తీర్చనుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు దగ్గరుండి మరీ నీటిని ఎస్ఎస్ ట్యాంకులోకి పంపింగ్ చేసుకునేవారు. లక్షమంది పట్టణ జనాభాకు సంబంధించిన కీలకమైన విషయమైనా వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు ఆ విషయంపై దృష్టిపెట్టిందిలేదు. వారి నిర్లక్ష్యధోరణే నేడు పట్టణ ప్రజలకు శాపంగా పరిణమించనుంది. గుండ్లకమ్మ విషయానికి వస్తే వర్షాకాలంలో వచ్చే అరొకర నీటిని కొద్దిరోజులపాటు వినియోగించుకొనే అవకాశం ఉంది. పట్టణ ప్రజల అవసరాలను 5 శాతంలోపు మాత్రమే గుండ్లకమ్మ తీరుస్తోంది.



ఎస్ఎస్.ట్యాంకులో తగ్గిన తాగునీటి మట్టం

ట్యాంకర్ల ద్వారా సరఫరానే ప్రత్యామ్నాయం

పట్టణ జనాభా ప్రస్తుతం సుమారు లక్షకు చేరువైంది. పట్టణమంతా సరఫరా చేయాలంటే రోజుకు 8.5 ఎమ్ఎల్‌డీ నీరు అవసరం. దూపాడు ఎస్ఎస్ ట్యాంకు నుంచి పంపింగ్ చేసుకుంటే 28 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ద్వారా రోజుకు 10 ఎమ్ఎల్‌డీ నీటిని తరలించవచ్చు. ముందుగా నీరు పట్టణంలోని తర్లుపాడు రోడ్డులోని పెద్ద ట్యాంకుకు చేరుతుంది. అక్కడ నీటిని శుద్ధి చేసిన అనంతరం పీఎస్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, జెడ్పీ హైస్కూల్, జవహర్‌నగర్ కాలనీల్లోని ఈఎల్ఎస్ఆర్‌లకు పంపించి అక్కడ నుంచి అంతర్గత పైప్‌లైన్‌ల ద్వారా ఇళ్లకు సరఫరా చేస్తారు. ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో పది రోజులకు ఒకసారి సాగర్ నీటిని అందిస్తున్నారు. మధ్యలో ఇబ్బందులు ఏర్పడితే 35 వార్డుల పరిధిలో ఉన్న 180 బోర్ల ద్వారా నీటిని కొద్దిమేర అందిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ ప్రకారం మరో పర్యాయం మాత్రమే సాగర్ నీరు ప్రజలకు అందించే వీలుంది. తర్వాత నీటి ఇబ్బందులను అధిగమించాలంటే ట్యాంకర్ల ద్వారా సరఫరానే ఏకైక మార్గం. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రోజుకు 300కు పైగా ట్రిప్పుల నీటిని తోలితేనే కష్టాలు తీరతాయి. ఈ లెక్కన చూస్తే మున్సిపాలిటీకి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు రోజుకు రూ.1.5 లక్షల మేర భారం పడనుంది. అంతేకాక మార్కాపురం చెరువులో, గుండ్లకమ్మల వద్ద ఉన్న 14 పవర్ బోర్ల ద్వారా కూడా కొంతమేర నీటిని అందించే వీలుంది. ప్రణాళికాబద్ధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేసి నీటి కష్టాలు తీర్చాల్సిన అవసరం ఉంది.

అవీ..ఇవీ..

రీసర్వే చేసి ఆర్ఆర్‌ప్యాకేజీ అందించాలి



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సమస్యలు వివరిస్తున్న వెంకటరామిరెడ్డి

మార్కాపురం, జూలై 2: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభించి 20 సంవత్సరాలు అయినా నేటికీ ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వనందున రీసర్వే చేసి వెంటనే అందించాలని ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి మంగళవారం గొట్టిపడియ గ్రామస్థుల నిర్వాసితుల కాలనీ వద్ద కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందించారు. ముఖ్యంగా ప్రాజెక్టు ప్రారంభించిన ప్పటి నుంచి నేటి వరకు నిర్వాసిత గ్రామాల్లో సుమారు 600 మంది వరకు చనిపోయారన్నారు. వారంతా పరిహారం కోల్పోయినట్లేన్నారు. అంతేకాక అప్పటి నుంచి ఇప్పటి వరకు 18 సంవత్సరాలు నిండిన యువత వెయ్యి మంది ఉన్నార న్నారు. వారందరినీ అర్హుల జాబితాలో చేర్చాలని కోరారు. రూ.18 లక్షలకు తక్కు వ కాకుండా ప్యాకేజీ ఇప్పించాలని కోరారు. ఆయన వెంట నిర్వాసిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పలు సమస్యలపై బీజేపీ నాయకుల వినతి

మార్కాపురం, జూలై 2: స్థానిక బీజేపీ నాయకులు మంగళవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా జిల్లాలో ఇసుక విధానం ఖరారుకాక సర ఫరా నిలిచిపోయి భవన నిర్మాణ కార్మికులు అవస్థలు పడుతున్నారన్నారు. పట్టణంలోని చెరువుకట్ట గుంతలమయంగా ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అదేవిధంగా పేరుకు డివిజన్ కేంద్రమే అయినా ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ, కళాశాలలు లేకపోవడంతో పేద విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. బీసీ వసతిగృహ విద్యార్థులకు సొంత భవనంలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పీవీ కృష్ణారావు, కోకన్వీనర్ డి.చంద్రశేఖర్, జీవీ రెడ్డి, బొంతల కృష్ణ, ఎం.వాసవిప్రియ, వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

వర్షం కోసం పూజలు

గిద్దలూరు, జూలై 2 : బురుజుపల్లి గ్రామస్తులు ముఖ్యంగా యువకులు వర్షం కోసం పూజలు చేశారు. గ్రామసమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో పలుపులవీడు దేవస్థానంలో ఉన్న శ్రీభైరవేశ్వరస్వామికి 1001 బిందెలతో జలాభిషేకం చేశారు. వర్షాలు కురిపించి ఆదుకోవాలని దేవునికి మొక్కుకున్నారు.

విద్యతోనే సమాజ అభివృద్ధి

- ఎంఈవో రాజశేఖరరెడ్డి

త్రిపురాంతకం, జూలై 2: విద్యతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని మండల విద్యాశాఖాధికారి-2 టి.రాజశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నేను బడికి పోతా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ బడిబయట పిల్లల్ని బడిలో చేర్పించాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 ఏళ్ల నుండి 18 ఏళ్లు వయసున్న పిల్లలు ఉండాల్సింది పనిలోకాదని బడిలో అని, ప్రతి ఒక్కరూ చదువుకుంటేనే ఆయా కుటుంబాలతోపాటు గ్రామం అన్ని రంగాలలో ముందుంటాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మోక్షగుండంలో వైద్యాధికారులకు సన్మానం



జ్ఞాపికలు అందజేస్తున్న నారాయణరెడ్డి

బేస్తవారపేట, జూలై 2: డాక్టర్స్ డే సందర్భంగా బేస్తవారపేట మండలంలోని మోక్షగుండం ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులను ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ గురువు బి.ఎస్.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. డాక్టర్ కడప వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ వికాస్‌లను ఘనంగా సన్మానించి, చిత్రపటాలను అందజేశారు. రోగులకు వైద్యసేవలు అందించడంలో వేణుగోల్‌రెడ్డి ముందుంటా డని నారాయణరెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో మోక్షగుండం ముక్తేశ్వరదేవస్థాన కమిటి చైర్మన్ ఆవుల కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ నంబరు అనుసంధానం చేసుకోవాలి

పొదిలి, జూలై 2 : గ్యాస్ వినియోగదారులు ప్రతి ఒక్కరూ గ్యాస్ నంబరుకు మొబైల్ నెంబరు అనుసంధానం చేసుకోవాలని కరుణా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఇకపై అనుసందానం చేసిన మొబైల్ నంబరు ద్వారానే గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అలా బుక్ చేసిన తరువాత ఆ మొబైల్‌కు ఓటీపీ వస్తుందని దాన్ని డెలివరీ చేయడానికి వచ్చే వ్యక్తికి చూపించి సిలిండరు పొందాలని సూచించారు. అదే విధంగా ఉచిత గ్యాస్ సిలిండరు పొందడానికి ఈకేవైసీ, బేసిక్‌సేఫ్టీ చెక్ తనిఖీ తప్పనిసరి అన్నారు.

డ్రైనేజ్ సమస్యను పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న కిషోర్

పొదిలి, జూలై 2 : పట్టణంలో డ్రైనేజ్ వ్యవస్థ అధ్వానంగా ఉందని దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మార్కాపురం మానవ హక్కుల సంఘం అధ్యక్షులు కిషోర్ కోరారు. చిన్నపాటి వర్షం కురిసినా పట్టణం మొత్తం మురుగునీటితో నిండిపోతుందని గత అధికారులు, పాలకులు పట్టించుకోలేదన్నారు. మంగళవారం నగరపంచాయతీ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధాన రహదారుల వెంబడి సైడుకాలువలు లేకపోవడం ఉన్న కాలువల్లో రెండు, మూడురోజులకు ఒకసారైనా కాలవలు శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలేకాలం కావడం వల్ల పారిశుధ్యంపై కూడా ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. స్పందించిన కమీషనర్ రానున్న రోజుల్లో పట్టణంలో ఉన్న సమస్యలను కనుక్కోని సమస్యలు పరిష్కరిస్తూ డ్రైనేజ్‌పై ప్రత్యేక దృషి పెడతానని చెప్పారు.

తిరుపతి కలెక్టర్‌గా కొమరోలు వాసి

- మండల ప్రజలు హర్షం



తల్లిదండ్రులతో వెంకటేశ్వర్

కొమరోలు, జూలై 2 : రాష్ట్రంలో మంగళవారం జిల్లా కలెక్టర్ల బదిలీల్లో భాగంగా కొమరోలు మండలం ఇడమకల్లు గ్రామానికి చెందిన సలిజాముల వెంకటేశ్వర్ తిరుపతి జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. వెంకటేశ్వర్ కొమరోలు మండలంలోని ఇడమకల్లు గ్రామంలోని సలిజామల కాశమ్మ, వెంకటయ్యల కుమారుడు., తల్లి కాశమ్మ కొమరోలు జెడ్పీటీసీగా 2001 నుంచి 2006 వరకు చేశారు. అదే సమయంలో తండ్రి సలిజామల వెంకటయ్య సర్పంచ్‌గా ఉన్నారు. ఇరువురు రాజకీయంగా ప్రజలకు సేవచేశారు. వీరి కుమారుడైన సలిజామల వెంకటేశ్వర్ 1 నుంచి 10 వతరగతి వరకు గుంటూరు లయోలా పబ్లిక్ స్కూల్‌లో, ఇంటర్ విశాఖపట్టణంలోని శ్రీ చైతన్య కళాశాలలో, ఎంబీబీఎస్‌ను కేజీహెచ్ వైద్యశాలలో పూర్తి చేశారు. తర్వాత వైద్య వృత్తిని వదిలేసి ఐఏఎస్ కోచింగ్ తీసుకుని తొలిసారిగా 2016లో ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. అనంతపురంలో ట్రైనీ ఐఎఎస్‌గా బాధ్యతలు తీసుకున్నారు. తర్వాత పాడేరు సబ్‌కలెక్టరుగా తొలిపోస్టింగ్ వచ్చింది. అనంతరం చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గాను పనిచేశారు. ప్రస్తుతం ఏపీ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ గాను విధులు నిర్వహిస్తున్నారు. బదిలీల్లో భాగంగా వెంకటేశ్వర్‌ను తిరుపతి జిల్లా కలెక్టర్‌గా బదిలీచేశారు. దీంతో ఆ గ్రామంలోని ప్రజలు, మండల ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

భార్యను హత్యచేసిన భర్తకు జీవిత ఖైదు

మార్కాపురం, జూలై 2: భార్య హత్య చేసిన కేసులో భర్తకు జీవితఖైదు విధిస్తూ మార్కాపురం ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు మార్కాపురం పట్టణానికి చెందిన బలభద్రుని రంగయ్య తన కుమార్తె పార్వతిని స్థానిక శివాజీనగర్‌కు చెందిన కొసనాల వెంకటేశ్వర్లు కుమారుడు శరభయ్యకు ఇచ్చి 12 ఏళ్ల క్రితం వివాహం చేశాడు. శరభయ్య, పార్వతి దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మద్యానికి బానిసైన శరభయ్య ఎలాంటి బలాదూర్‌గా తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణకోసం పార్వతి ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తుండేది. భార్య పార్వతిపై అనుమానం పెంచుకున్న శరభయ్య నిత్యం గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో 2019 జనవరి 16న మధ్యాహ్నం పార్వతి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో భర్త శరభయ్య గొడ్డలితో తలపై దాడి చేశాడు. దీంతో పార్వతి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తండ్రి బలభద్రుని రంగయ్య ఫిర్యాదు మేరకు అప్పట్లో పట్టణ పోలీసులు హత్యకేసు నమోదు చేసుకున్నారు. ఈ కేసులో సాక్షులను విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో నిందితునికి జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. జరిమానా కట్టకుంటే మరో నెలపాటు జైలుశిక్ష విధించనున్నట్లు తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.బాలునాయక్ వాదించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గిద్దలూరు, జూలై 2 : రాచర్ల మండలం అనుమలవీడు సచివాలయ జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తూ విద్యుత్ షాక్‌కుగురైన సురేష్‌నాయక్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. జూన్ 19న పాలకవీడు సమీపంలో విద్యుత్‌లైన్ సరి చేసే సమయంలో షిఫ్ట్ ఆపరేటర్ చేసిన తప్పుకు విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం సురేష్‌నాయక్‌కు కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు.

జీతాలు లేకుండా ఎలా బతకాలి

- సర్పంచ్ వచ్చే వరకు నిరసన కార్యక్రమాలు
- కొమరోలులో నిలిచిపోయిన పారిశుధ్య పనులు

కొమరోలు, జూలై 2 : తమకు ముప్పై నెలలుగా జీతాలు అందడం లేదని తాము ఎలా బతకాలని స్వచ్ఛభారత్ కార్మికులు మంగళవారం కొమరోలు పంచాయతీ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కొమరోలు గ్రామ పంచాయతీ పరిధిలో 8మంది స్వచ్ఛ భారత్ కార్మికులున్నారు. వీరికి 2019 వరకు కేంద్రప్రభుత్వం నుంచి నిధులు వచ్చాయి, ఆ తరువాత 15వ ఆర్థిక సంఘం నిదుల నుంచి వీరికి జీతాలు ఇవ్వాలని ప్రభుత్వం తెలిపినా జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నిధుల అందుబాటులో ఉన్నదాన్నిబట్టి చెల్లించారు. కానీ కొమరోలు గ్రామ పంచాయతీలో మాత్రం ఇంతవరకు ఇవ్వలేదని కార్మికులు పేర్కొన్నారు. దీనిపై కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ.. వీరికి త్వరలోనే చెల్లింపులు చేస్తామన్నారు. సర్పంచ్ దండు శశికళ వచ్చి తమకు హామీ ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తూ సాయంత్రం వరకు నిరసన కొనసాగిస్తూ పారిశుధ్య పనులు నిలిపేశారు.

కౌలు కార్డులకు అవకాశం

గిద్దలూరు, జూలై 2 : కౌలు రైతులు కౌలుకార్డులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులను, గ్రామ రెవెన్యూ అధికారులను కలిసి తాము కౌలుకు తీసుకునే రైతుల ఆధార్, పొలం పాసుపుస్తకం, కౌలు రైతు ఆధార్‌కార్డు, కౌలు అగ్రిమెంటు, కౌలు రైతు ఫోటో అందచేస్తే కౌలుకార్డులు ఇస్తామని పేర్కొన్నారు కౌలుకార్డు పొందడం వలన పంట నమోదు, పంటకు బీమా, పంట నష్టపోతే నష్టపరిహారం, పంట కొనుగోలు వంటివి హక్కులు ఉంటాయన్నారు. మండలంలో సుమారు 2500 మంది కౌలు రైతులు ఉన్న దృష్ట్యా వారందరూ కౌలు కార్డులు పొందాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కౌలు రైతుకార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

కొమరోలు, జూలై 2 : మండలంలో కౌలుకు భూములు తీసుకుని సాగు చేస్తున్న రైతులు కౌలు రైతు కార్డులను దరఖాస్తుచేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జయశ్రీ తెలిపారు. ఈ సంవత్సరం కౌలుకు తీసుకున్న భూములకు సంబంధించిన అగ్రిమెంటు, కౌలుకు ఇచ్చివారి ఆధార్ కార్డు, ఫోటో, పట్టాదారు పాసుపుస్తకం, కౌలుకు తీసుకునే వారి ఆధార్‌కార్డు, ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కావున మీ సమీపంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్‌నుగానీ, మీ గ్రామ రెవెన్యూ అధికారినిగాని సంప్రదించాలని తెలిపారు.

పరువు పోతుందని.. కూల్చబోయారు

- కుంటలో మూడంతస్తుల భవన నిర్మాణం
- సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు
- రాత్రివేళ ఎక్స్‌కవేటర్‌తో పడగొట్టబోయన వైసీపీ సానుభూతి పరుడు



భవనాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సకవేటర్

గిద్దలూరు టౌన్, జూలై 2: పరువు పోతుందన్న ఆలోచనతో వైసీపీ సానుభూతిపరుడు, కాంట్రాక్టర్ తన అక్రమ కట్టడాన్ని కూల్చేందుకు ప్రయత్నించారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా గిద్దలూరులో సంచలనం సృష్టించింది. పట్టణంలోని కాశినాయనకుంటలో అక్రమంగా కాంట్రాక్టర్ మీనిగ శివరంగారెడ్డి గత ప్రభుత్వ హయాంలో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. కుంట ప్రాంతంలో మున్సిపల్ శాఖ అనుమతులు లేకుండా భవనం నిర్మించడంతో పట్టణానికి చెందిన పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. అప్పట్లోనే మున్సిపల్ అధికారులు విచారించి కాశినాయన కుంట మున్సిపాలిటీ భూమి అని తేల్చారు. శివరంగారెడ్డి నిర్మించిన మూడు అంతస్తుల భవనానికి సరైన పత్రాలు లేని కారణంగా మున్సిపల్‌శాఖ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. అంతేకాక మూడు అంతస్తుల భవనం నిర్మించుటకు మున్సిపల్ అధికారుల నుంచి ఎటువంటి ప్లాన్ అప్రూ వల్స్ పర్మిషన్లు తీసుకోలేదు. శివరంగారెడ్డి నుంచి ఇటువంటి పత్రాలు లేని కారణంగా ఆ ఇంటి పన్నును, కొలాయి పన్నును రద్దుచేశారు. ఇటీవల రెవెన్యూ అధికారుల సమక్షంలో మున్సిపల్ అధికారులు ఆ బిల్డింగ్‌ను సీజ్ చేశారు. ఇదిలావుండగా విషయం తెలుసుకున్న శివరంగారెడ్డి గతరాత్రి సీజ్ చేసిన మూడు అంతస్తుల భవనాన్ని ఎక్స్‌కవేటర్ ద్వారా పగులగొట్టే ప్రయత్నం చేశారు. కొంత భాగాన్ని ధ్వంసం చేయగా విషయం తెలుసుకున్న మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. అనంతరం శివరంగారెడ్డిపై గిద్దలూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఫిర్యాదుమేరకు శివరంగారెడ్డి, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

తాగునీటి సమస్యను తక్షణం పరిష్కరించండి

కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి



కలెక్టర్, సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, జూలై 2: నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కోరారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు సందర్శనకు మంగళవారం మార్కాపురం వచ్చిన కలెక్టర్‌ను స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ఆమెకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యలను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వివరించారు. ప్రధానంగా మార్కాపురం పట్టణానికి ప్రధాన తాగునీటి వనరైన సాగర్‌జలాలు పూర్తిగా నిండుకున్నందున ట్యాంకర్ల ద్వారా సరఫరాకు అనుమతులు ఇవ్వాలని కోరారు. రోజుకు సుమారు 300 ట్రిప్పుల మేర నీటిని అందిస్తేనే ప్రజలకు నీటి అవసరాలు తీరతాయన్నారు. అదేవిధంగా పొదిలి పట్టణంలో కూడా నీటి ఎద్దడి నెలకొన్నందున పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. నియోజకవర్గంలోని గ్రామాల పరిధిలో ప్రస్తుతం సరఫరా చేస్తున్న ట్రిప్పుల సంఖ్యను పెంచాల్సిన అవశ్యకతను వివరించారు. పూర్తిస్థాయిలో వర్షాలు కురిసి బోర్లు రీచార్జ్ అయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని తప్పక అందించాల్సి ఉందన్నారు. బోరుబావుల్లో నీరు అడుగంటడంతో పశువులకు నీటిని అందించలేదని దుస్థితి ఉందన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులతో సమీక్షించి సాధ్యమైనంత త్వరగా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

వెలిగొండపై దృష్టిసారించాలని వినతి

పశ్చిమ ప్రకాశంతోపాటు కడప, నెల్లూరు జిల్లాల్లోని పలు మండలాలకు వరప్రదాయిని అయిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కందుల కోరారు. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పూర్తిగా నిరాదరణకు గురైన విషయాన్ని వివరించారు. కాంట్రాక్టర్ల లబ్ధికోసం మాత్రమే గత ప్రభుత్వం పనిచేసిందని తెలిపారు. పూర్తయిన మొదటి టన్నెల్ ద్వారా నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నా ఆ దిశగా పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉందన్నారు. సాధ్యమైన మేరకు 5 నుంచి 10 టీఎంసీల నీటినైనా సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టు జలాశయంలోకి నింపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతేకాక ముంపు గ్రామా ల నిర్వాసిత ప్రజలకు పరిహారం, పునరావాసం సమస్యను త్వరగా పరిష్కరించాల్సి ఉందన్నారు. ప్రాజెక్టులో నెలకొన్న సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇచ్చిందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. అందులో భాగంగానే తొలుత ప్రాజెక్టు పరిస్థితి గురించి పరిశీలిస్తున్నా మన్నారు. ప్రాజెక్టు గురించి వెంటనే పూర్తి స్థాయిలో నివేదికను ప్రభుత్వానికి అందజేస్తా మన్నారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ఉన్నారు.

హేమలతకు ఎమ్మెల్యే అభినందన



హేమలతను అభినందిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 2 : కరాటేలో బంగారు పతకం, బ్లాక్ బెల్టు సాధించిన హేమలతను స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అభినందించారు. మంగళవారం హేమలతతో పాటు కోచ్ బూతరాజు శ్రీనివాసులు ఇటీవల సాధించిన పతకాలతో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి హేమలతను శాలువతో సత్కరించి అభినందించారు. పట్టణంలోని సాయిచైతన్య డిగ్రీ కళాశాలలో హేమలత బీఎస్సీ రెండవ సంవత్సరం చదువుతున్నారు. కరాటేలో 22వ ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ కర్నాటకలో జరిగింది. ఆ పోటీల్లో 19 సంవత్సరాల విభాగంలో ఫైట్ స్పారింగ్‌లో బంగారు పతకం సాధించింది. అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో బ్లాక్‌బెల్టు గ్రేడింగ్ టెస్టులో పాసై బ్లాక్‌బెల్ట్ సాధించింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యల్లా ఉదయ్‌కిరణ్, యల్లా రఘు, శివపురం మురళీకృష్ణ, పందిళ్లపల్లి శ్రీనివాసులు, టింబర్ డిపో శ్రీనివాసులు, భాషా, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని సొంత భూమిగా చూపి..!

- పేదలను మోసం చేసిన వైసీపీ నేత
- అక్రమాలకు అండగా నిలిచిన వీఆర్‌వో

తర్లుపాడు, జూలై 2: మండలంలోని కేతగుడిపి పంచాయతీలో బుడ్డపల్లె గ్రామానికి చెందిన ఒక వైసీపీ నాయకుడు ప్రభుత్వ భూమిని పట్టాభూమిగా చూపించి ఇళ్ల స్థలాలకు అమ్ముకున్న వైనం వెలుగులోకి వచ్చింది.



పట్టా భూమిగా చూపించిన ప్రభుత్వ భూమి

దీంతో 20మంది బాధితులు లబోదిబోమంటున్నారు. బుడ్డపల్లె ఇలాకాలో సర్వేనంబర్ 137-6లో 1.31సెంట్ల ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు తమ్మిశెట్టి ఏడు కొండలు తన సొంత పట్టా భూమిగా చూపించి నమ్మించి 20మంది పేదలకు అమ్ముకున్నాడు. ఈ.నాగేశ్వరరావు, బత్తుల వెంకటరత్తమ్మ, వేముల అంబక్క, బత్తుల ఏడుకొండలు, తమ్మిశెట్టి ఆంజనేయులు, బండారు శీను, తిరుపతి వెంకటస్వామి, తురక అంకారావు, తురక అంకయ్య, వేముల తిరపతమ్మతో పాటు మరో 10మందికి సెంటు రూ.70వేల చొప్పున అమ్ముకున్నాడు. వారికి అగ్రిమెంట్‌లు రాసిచ్చాడు. వైసీపీ నేతకు అండగా వీఆర్‌వో రంగయ్య నిలిచి ఏడుకొండలు పట్టా భూమి అని లబ్దిదారులకు చెప్పడంతో కొనుగోలు చేశారు. ఆక్రమించిన భూమిని ఇటీవల టీడీపీ నాయకులు సర్వే చేయించగా ప్రభుత్వ భూమిగా గుర్తించారు. దీంతో బాధితులు ఏడుకొండలను నిలదీశారు. ఈ మేరకు ఏడుకొండలు మోసం చేశాడంటూ.. 20మంది బాధితులు, గ్రామస్థులు తర్లుపాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సుధాకర్‌కు, తహసీల్దార్ అజీద్ అహ్మద్‌కు ఫిర్యాదు చేశాడు. రెండురోజుల్లో విచారించి ఏడుకొండలపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఎమ్మార్వో తెలిపారు. పేదలను మోసం చేసిన తమ్మిశెట్టి ఏడుకొండలు బాధితులు నిలదీయటంతో ఇటీవల గ్రామం నుంచి వెళ్లిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు.

వైసీపీ నేతల తొత్తుగా మారిన వీఆర్‌వో

గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకులకు కేతగుడిపి వీఆర్‌వో రంగయ్య తొత్తుగా మారాడు. వైసీపీ నాయకులు చేసే అక్రమాలకు అండ దండలుగా నిలిచాడు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేందుకు వైసీపీ నాయకుడికి వీఆర్‌వో రంగయ్య పాత్ర ఉన్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మార్కాపురం, ఒంగోలు జాతీయ రహదారి పక్కన ఉన్న భూములను కూడా వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని వారి వద్ద వీఆర్‌వో రంగయ్య లక్షలాది రూపాయలు తీసుకొని వారికి అండగా నిలిచారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కేతగుడిపి ఇలాకాలో భూ ఆక్రమణలపై విచారిస్తే వందలాది ఎకరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు.



బాధితులతో టీడీపీ నాయకులు



రాజంపల్లిలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

దర్శి, జూలై 2: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ కిసాన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని రాజంపల్లిలో జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు అమ్మకు ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ జనతాపార్టీ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని గత వారంరోజులుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పణిదపు చిన్న వెంకటరామయ్య ఉపసర్పంచ్ వజ్జా నాగమణి, బీజేపీ నాయకులు కాకర్ల నాగసాయి, జె.అంజనేయులు, పణిదపు కోటేశ్వరరావు, తానికొండ ఓబయ్య, పణిదపు వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: అమ్మకోసం ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా సీఎస్‌పురంలోని ఎస్సీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇండ్ల వెంకటసత్యం ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బొబ్బూరి రమేష్, పాలకొల్లు వెంకటరెడ్డి, ఏసు, రేనాటి వెంకటేశ్వర్లు, దాసరి మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో లబ్ధిదారుడికి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి

దర్శి, జూలై 2: మండలంలోని సామంతపూడికి చెందిన ఒక లబ్ధిదారుడు ఒంగోలులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా సచివాలయ ఉద్యోగి అక్కడకు వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన దామా వెంకటేశ్వర్లు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో సంఘమిత్రలో చికిత్స పొందుతున్నాడు. ఈనేపథ్యంలో మంగళవారం సిబ్బంది అక్కడకు వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్ అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు రోజుల్లో నూరుశాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని ఆదేశాలు ఇవ్వటంతో అధికారులు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని గుర్తించి పింఛన్లు అందజేస్తున్నారు.

పీసీపల్లి: అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్స పొందుతున్న వితంతువుకు సచివాలయ ఉద్యోగి వైద్యశాలకు వెళ్లి మంగళవారం పెన్షన్ అందజేశారు. మండలంలోని పెదఅలవలపాడుకు చెందిన పువ్వాడి లక్ష్మమ్మ అనారోగ్యంతో ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈక్రమంలో సచివాలయ ఉద్యోగి ఒంగోలులో వైద్యశాలలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ వద్దకు వెళ్లి పెన్షన్ అందజేశారు.

కనిగిరి: హెచ్‌ఎంపాడు మండలం నందనవనం గ్రామానికి చెందిన షేక్ చినఖాశీంకు ఎన్టీయార్ భరోసా పింఛన్‌ను ఒంగోలులో రిమ్స్ ఆసుపత్రిలో మంగళవారం అందచేశారు. కిడ్నీ సమస్యతో ఒంగోలులోని రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడి తొలి పింఛన్ తీసుకునే పరిస్థితిలో అతను లేకపోవటంతో సచివాలయ ఉద్యోగి ఆస్పత్రికి వెళ్లి రూ.7 వేలు నగదు అందజేశారు.

'దొనకొండ'లో 99 శాతం పింఛన్లు పంపిణీ

దొనకొండ, జూలై 2: మండలంలోని 14 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు రెండవరోజైన మంగళవారంతో 98.94 శాతం పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 5740 పింఛన్లకుగాను 5679 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దొనకొండ సచివాలయంలో సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, దేవానంద్ పలువురు వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామాల్లో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛన్లు పొందేందుకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఇంటివద్దే పింఛన్లు పొందేలా ప్రభుత్వ చేపట్టిన చర్యలను ఆమె అభినందించారు.

అతిసార నిర్మూలనపై అవగాహన

దొనకొండ, జూలై 2: అతిసార నిర్మూలనపై దొనకొండలోని బేతేల్‌పురం అంగన్‌వాడీ-11 పాఠశాలలో ఆరోగ్యకేంద్రం ఏఎన్ఎం లీలాబాయి మంగళవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీరు, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి ఓఆర్ఎస్, జింక్ ట్యాబ్‌లెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఏ.జయమణి, ఆశ కార్యకర్తలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా జనార్దన్

ముండ్లమూరు, జూలై 2: ముండ్లమూరు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా రావూరి జనార్దన్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కొనకనమిట్ల ఈవోపీఆర్‌డీగా పనిచేస్తూ ముండ్లమూరు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా కొనసాగిన బత్తుల శంకరరావు ఈనెల 30న పదవీ విరమణ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జ్ ఎంపీడీవో జనార్దన్ మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ పేదలకు చేరేవిధంగా అన్ని శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జనార్దన్‌ను కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎస్. సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ టి.కరుణాకర్, కంప్యూటర్ ఆపరేటర్లు కోటేశ్వరరావు, అరుణలు అభినందించారు.

లోవోల్టేజీ సమస్య నివారణకు కృషి

ముండ్లమూరు, జూలై 2: మండలంలో లోవోల్టేజీ సమస్య ఉన్న గ్రామాలను తక్షణమే గుర్తించి తన దృష్టికి తీసుకు రావాలని దర్శి ట్రాన్స్ ఏడీఈ కె.పిచ్చయ్య అన్నారు. మంగళవారం స్థానిక సబ్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ లైన్‌మెన్‌ల ద్వారా మొదటి ప్రాధాన్యతగా లోవోల్టేజీ సమస్య ఉన్న గ్రామాలను గుర్తించాలన్నారు. వెంటనే ఆగ్రామాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటుచేస్తామన్నారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. పెండింగ్ విద్యుత్ బకాయిలు స్పెషల్ డ్రైవ్ ద్వారా వసూలు చేయాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కువగా బకాయిలు పేరుకుపోయాయన్నారు. వరుసగా మూడు నెలలు విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే కనెక్షన్‌లను తొలగిస్తామని చెప్పారు. సమావేశంలో లైన్‌మెన్‌లు పీఎస్ ఆంజనేయులు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

తాళ్లూరు, జూలై 2: పశుగ్రాసం సాగుపై యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలుజాతి గ్రాసం ఉత్పత్తి చెందుతుందని మండల పశువైద్యాధికారి వి.ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని దారంవారిపాలెం రైతు భరోసా కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పశువులకు మేతగా ఉప యోగపడే ధాన్యపు జాతి, గడ్డి జాతి, పప్పుజాతి పంటలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, గ్రామ వెటర్నరీ అసిస్టెంట్ సీహెచ్ బ్రహ్మయ్య, పశుపోషకులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్

పామూరు, జూలై 2: పామూరు పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను తహసీల్దార్ షాకీర్‌పాష మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో మౌలిక సమస్యల గురించి ఆరా తీశారు. ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సీఎస్‌పురం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా రామచంద్రరావు

పామూరు, జూలై 2: సీఎస్‌పురం ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీహెచ్ రామచంద్రరావు నియమితులయ్యారు. ఆయన వెలిగండ్లలో పనిచేస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న గంజికుంట కృష్ణయ్య ఉద్యోగ విరమణ చేశారు. ఇన్‌చార్జ్‌గా రామచంద్రరావును నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు ఇవ్వడంతో బాధ్యతలు స్వీకరించారు.

సా..గుతున్న నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైను

- దర్శిలో ఆగిన స్టేషన్ భవన నిర్మాణం
- ఇప్పట్లో రైళ్లు తిరిగే అవకాశాలు లేనట్లే!
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు



నిలిచిపోయిన దర్శి నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్లే లైను పనులు

దర్శి, జూలై 2: అదిగో రైలు వచ్చేసింది.. ఏప్రిల్ నుంచి రాకపోకలు కొనసాగిస్తాం.. ఇకనుంచి రైళ్ల ద్వారా సురక్షిత ప్రయాణం చేయవచ్చని అధికారులు చెప్పిన మాటలు నీటిమూటలవుతున్నాయి. ఇప్పటివరకు రైల్వే లైను నిర్మాణం కూడా పూర్తికాలేదు. భవన నిర్మాణం మధ్యలో ఉంది. మిగిలిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పట్లో రైళ్లు తిరిగే పరిస్థితి కనిపించటం లేదు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైను నిర్మాణ పనులు చేపట్టి పది సంవత్సరాలు కావస్తుంది. ఈ పథకాన్ని ప్రధానమంత్రి ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో కూడా చేర్చారు. 2014 నుంచి 2019 వరకు కొంత మేరకు చురుగ్గా జరిగాయి. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పూర్తి సహకారం అందించలేదు. రైతులకు చెల్లించాల్సిన నష్ట పరిహారం విషయంలో కొంతమంది పేచీలు పెట్టి కోర్టుకు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ సమస్యలను తీర్చకుండా ఇవ్వాల్సిన వాటా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో పనులు తీవ్ర జాప్యం అయ్యాయి. ఇటీవల జరిగిన ఎన్నికల ముందు రైల్వే శాఖ అధికారులు నానా హడావుడి చేశారు. నడికుడి నుంచి దర్శి వరకు రోజుకు రెండు రైళ్లు ముందుగా నడుపుతారు.. గత ఏప్రిల్ నుంచి రాకపోకలు కొనగుతాయన్నారు. రైల్వే లైను పరిశీలన చేసేందుకు ట్రైలర్‌గా ఒక రైలు, ఒక గూడ్స్‌ను రెండు నెలల క్రితం ఇక్కడకు పంపారు. ఆ రైళ్లు చూసిన ప్రజలు ఇక రాకపోకలు కొనసాగుతాయని ఆనందం వ్యక్తం చేశారు. వచ్చిన రైళ్లను చూసేందుకు ప్రజలు గుంపులు గుంపులుగా వెళ్లారు. ఎన్నికల తర్వాత పనులు మరింత మందగించాయి. రైళ్లు నడిపే విషయం గురించి అధికారులు పట్టించుకోలేదు. కనీసం రైల్వే స్టేషన్ భవనం కూడా నిర్మాణం మధ్యలో ఉండటంతో ఇప్పట్లో రైళ్లు తిరిగే పరిస్థితి కనిపించటం లేదు. అధికారులు వ్యవహరిస్తున్న తీరుపట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అధికారంలోకి రావటంతో ఇకనుంచి అయినా పనులు వేగవంతం అవుతాయని ఆశిస్తున్నారు.



నిర్మాణంలో ఉన్న రైల్వే స్టేషన్ భవనం



దర్శిలో ఒకవైపు మాత్రమే పూర్తయిన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైను

రైతుల జీవితాలతో చెలగాటమాడొద్దు!

- రెవెన్యూ సిబ్బందిపై జేసీ ఆగ్రహం

సీఎస్‌పురం(పామూరు) జూలై 2: భూములు కోల్పోతున్న రైతుల జీవితాలతో చెలగాటమాడొద్దని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీవీకే గ్రీన్‌ఫీల్డ్ హైవే 167-బి జాతీయ రహదారులకు సంబంధించిన అధికారులు, రెవెన్యూ సిబ్బందితో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. రహదారుల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం అందని వివరాలను తెలపాలని వీఆర్వోలను అడుగగా వారినుంచి సరైన సమాధానం లేక పోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏ.కొత్తపల్లి, రేగులచిలుక, ఉప్పలపాడు, గుంతచెన్నంపల్లి, సీఎస్‌పురం, పెదగోగులపల్లి, ముసునూరు, డీటీపల్లి గ్రామాలకు సంబంధించిన అనేక మంది రైతులకు నష్ట పరిహారం అందించడంలో రికార్డులు సక్రమంగా లేకపోవడంపై రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో అన్ని మండలాల కంటే సీఎస్‌పురం మండల వీఆర్వోలు రైతులను జలగల్లా పీల్చి పిప్పిచేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. రికార్డులను పరిశీలించి వారం రోజుల్లో నష్టపరిహారం అందేల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతివారం జాతీయ రహదారిపై సమీక్ష సమావేశం ఉంటుందన్నారు.

మండలంలో జరిగిన భూవిక్రయాలు, ప్రభుత్వ భూముల విషయంలో అక్రమాలు జరిగాయని జేసీ గాపాలకృష్ణ పేర్కొన్నారు. దీనిపై ప్రత్యేక అధికారి నియమిస్తామని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈసందర్భంగా సర్పంచ్ శ్రీరామ్‌పద్మావతి పలు సమస్యలపై వినతి పత్రం అందచేశారు. పశువుల బీడులో పలు ఆక్రమాలు చోటు చేసుకొన్నాయని, అనేక మంది దొంగ పట్టాలు సృష్టించి ఇల్లు నిర్మించుకొన్నారన్నారు. అర్హులకు న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. రేగులచిలుక గ్రామంలో రెవెన్యూ వెబ్ ల్యాండ్‌ను పునరుద్ధరించాలని ఆదినారాయణ అనే రైతు వినతిపత్రం అందజేశారు. సింగరాయకొండ - మైదుకూరు జాతీయ రహదారి భూసేకరణలో మండలంలోని కోవిలంపాడు గ్రామంలో అంకాలమ్మతల్లి దేవస్థానం, ఇళ్లు కోల్పోతున్న గ్రామస్థులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సర్పంచ్ బుజ్జి సోదరులు జేసీని కోరారు.



కోవిలంపాడు హైవే భాదితులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

'కార్పొరేట్'కు దీటుగా జడ్పీ ఉన్నత పాఠశాల

- దొనకొండలో ఏటికేడు పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
- ఈ ఏడాది కొత్తగా 350 అడ్మిషన్లు



దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాల

దొనకొండ, జూలై 2: దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాల కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వెలుగొందుతోంది. ఏటికేడు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది జూన్ 13 నుంచి 28వ తే ది నాటికి కొత్తగా 350 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. అందులో దర్శి మాజీ ఎమ్మెల్యే బీజీ ప్రకాశం సతీమణి మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గ్రేసమ్మ తన మనవరాలిని జడ్పీ పాఠశాలలో చేర్పించారు. విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది 1100కు చేరుకుంది.



మవనరాలిని పాఠశాలలో చేర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాశం సతీమణి గ్రేసమ్మ

1950 సంవత్సరంలో ప్రారంభమైన దొనకొండ జడ్పీ పాఠశాల అప్పట్లో ఎంతో వైభోగంగా వెలుగొందింది. ప్రపంచస్థాయిలో వెయిట్‌లిఫ్టర్‌గా గుర్తింపుపొందిన కరణం మల్లేశ్వరి ఈ పాఠశాలకు చెందిన పూర్వపు విద్యార్థిని. ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు దాతల సహకారంతో పాఠశాలలో కరణం మల్లేశ్వరి క్రీడాప్రాంగణం ఏర్పాటుచేయించారు. మూడేళ్ళ క్రితం పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన వీవీ రామాంజనేయులు పాఠశాలకు అలనాటి ఖ్యాతిని తెచ్చేందుకు ఉపాధ్యాయుల సంపూర్ణ సహకారంతో సఫలీకృతులయ్యారు. అప్పటి రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ ఓడరేవు చిన్నవీరభద్రుడు, ఇతర ఉన్నత స్థాయి అధికారులు పాఠశాలను సందర్శించి ప్రశంసించారు.

పాఠశాలలో ప్రత్యేకతలు

విశాలమైన తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, డిజిటల్ విద్యాబోధన, 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో విద్యాబో ధన జరుగుతుంది. విశాలమైన క్రీడామైదానం, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వాహణ, 34 బీఎన్ ఒంగోలు ఆంధ్ర బెటాలిన్ ఎన్‌సీసీలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. నూతనంగా పీఎంశ్రీ ఉన్నత పాఠశాలగా ఎంపికైనందున ఒకేషనల్ కోర్సుల్లో బాగంగా టైలరింగ్, బిజినెస్ ట్రేడ్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. రూ.15 లక్షల జడ్పీ నిధులతో విద్యార్థులకు స్టడీ ప్లాట్‌ఫారమ్ ఏర్పాటుచేశారు.

అందరి సహకారంతో ముందుకు సాగుతున్నాం - రామాంజనేయులు, హెచ్ఎం

అందరి సంపూర్ణ సహకారంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కొనసాగేలా ముందుకు సాగుతున్నాం. పాఠశాలలో మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు పూర్వపు విద్యార్థుల సంపూర్ణ సహకారం మరువలేనిది. ఉపాధ్యాయులు అంకితభావంతో అందిస్తున్న విద్యాబోధన కారణంగానే ప్రజల్లో గుర్తింపు పొంది విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా దోహదపడుతుంది.

మృత్యు కుంటలు

- 15 రోజుల్లో దర్శిలో నలుగురు మృత్యువాత
- విషాదంలో బాధిత కుటుంబాలు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

దర్శి, జూలై 2: ఇటీవలకాలంలో నీటి కుంటల్లో పడి విద్యార్థులు మృతి చెందుతున్న సంఘటనలు అధికమవుతున్నాయి. దర్శిలో 15 రోజుల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో నలుగురు విగతజీవులయ్యారు. ఎంతో భవిష్యత్తు ఉన్న చిన్నారులు అకారణంగా నీటిలో పడి మృతిచెందటంతో ఆ కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. మూడు రోజుల క్రితం మండలంలోని తూర్పువీరాయపాలెం వాగులో తవ్విన గుంతలో పడి ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఆంజనేయస్వామి నెలపొంగళ్ల ఉత్సవాలకు ఇక్కడకు వచ్చి ప్రమాదవశాత్తు కుంటలో పడి చనిపోయారు. పొదిలి మండలం ఏలూరుకు చెందిన ధర్నాసి వీరకంత, అద్దంకి మండలం వేలమూరిపాడు గ్రామంకు చెందిన పులి రాఘవేంద్ర బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతిచెందారు. వారిద్దరు అక్కాచెల్లెళ్ల కుమారులు. ఆంజనేయస్వామి నెలపొంగళ్ల ఉత్సవాల్లో పాల్గొనేందుకు తాతగారి ఇంటికి వచ్చి విధి వక్రించటంతో మృత్యువాత పడ్డారు.

అంతకుముందు జూన్ 13న దర్శి మండలం లూధగిరి కాలనీకి చెందిన బొందల నవీన్, కొనకనమిట్ల మండలం వాగుమడుగు గ్రామానికి చెందిన వి.చందు దర్శి ఎన్ఎపీ చెరువులో పడి మృతిచెందారు. వీరిద్దరు దర్శి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివారు. నవీన్ పుట్టినరోజు సందర్భంగా స్నేహితులను విందుకు పిలిచాడు. ఎన్ఎపీ చెరువు వద్ద భోజనాలు పూర్తి చేసుకొని సరదాగా చెరువులోకి ఈతకు దిగి మృతిచెందారు. ఈ సంఘటనలతో ఆ నాలుగు కుటుంబాలు కుమారులను కోల్పోయి విషాదంలో మునిగిపోయాయి. 15 రోజుల వ్యవధిలో నలుగురు విద్యార్థులు నీటిలో పడి మృతిచెందటం దర్శి ప్రాంతంలో ఆందోళన కలిగిస్తుంది. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

మాట నిలబెట్టుకున్న లోకేష్

- పెరిగిన పింఛన్‌పై దివ్యాంగుడు హర్షం

పామూరు, జూలై 2: నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం పెరిగిన పింఛన్ అందుకున్నానని దివ్యాంగుడు మూగయ్య ఆనందం వ్యక్తం చేశారు. పామూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన డబ్బుకొట్టు చిన మూగయ్య బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తెలంగాణలో పనుల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు జరిగిన విద్యుత్ ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయాడు. అప్పటినుంచి భార్య కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నది. మూగయ్యకు కూతురు, కుమారుడు ఉన్నారు. గత ప్రభుత్వంలో దివ్యాంగుడు కింద పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా రూ.3 వేల పింఛన్ ఇచ్చారు. పూర్తిస్థాయి అంగవైకల్యం కింద పింఛన్ పెరిగేలా చూడమని పలుమార్లు పాలకులను, అధికారులను కోరినా ఫలితం లేకుండా పోయిందని వాపోయాడు.

ఈక్రమంలో కనిగిరి ప్రాంతంలో నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేస్తుండగా గ్రామ టీడీపీ శ్రేణులతో కలిసి తన పరిస్థితిని వివరించినట్టు మూగయ్య తెలిపారు. దీనిపై స్పందించిన లోకేష్ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకంలో పేర్కొనట్టు రూ.15 వేలు పింఛన్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా తనకు పింఛన్ రూ.15 వేలు మంజూరు చేయడం పట్ల మూగయ్య కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తంచేశారు. ఇచ్చిన మాట ప్రకారం లోకేష్ పింఛన్ పెంచడం పట్ల టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, యారవ శ్రీనువాసులు, పారా వెంకటేశ్వర్లు, జి.శ్రీను రావి నాగార్జున, నాగా శేషు హర్షం వ్యక్తం చేశారు.



పింఛన్ నగదును చూపిస్తున్న మూగయ్య

కరాటేలో ప్రతిభచూపిన చిన్నారులు



ప్రశంసా పత్రాలు అందుకున్న చిన్నారులు

కనిగిరి, జూలై 2: కరాటే బెల్ట్ గ్రేడింగ్‌లో కనిగిరి చిన్నారులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. చాంపియన్ కరాటేడో స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో 49 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలు కరాటే మాస్టర్ వహీద్ ఆధ్వర్యంలో జరుగగా, చిన్నారులు ప్రతిభచూపి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కరాటే మెగా మాస్టర్ యాసిన్ మాట్లాడుతూ కరాటే తోటి వారికి, తనకు రక్షణ కోసం మాత్రమే ఉపయోగించాలని అప్పుడే కరాటే విద్య సార్థకతమవుతుందన్నారు. అనంతరం గ్రేడింగ్‌లో గెలుపొందిన విజేతలైన చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

రేషన్ బియ్యాన్ని దారిమళ్లిస్తే చర్యలు

పామూరు, జులై 2: రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులు పక్కదారి పట్టిస్తున్నారని, అలాంటి వ్యక్తులపై నిఘా ఉంచి చర్యలు తీసుకొంటామని ఆర్డీవో పాలపర్తి జాన్‌ఇర్విన్ పేర్కొన్నారు. పామూరులోని ఓ ప్రయివేట్ గోదాంలో వైసీపీ నాయకుడు అక్రమంగా నిల్వ ఉంచిన రేసన్ బియ్యం 220 టిక్కీలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పంచనామా నిర్వహించి ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో గోడౌన్‌లోని సరుకును ఆర్డీవో మంగళవారం లెక్కించారు. తూకాల్లో తేడాలుంటే సరిచేయాలని గోడౌన్ సిబ్బందికి ఆర్డీవో ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాకీర్‌పాష, డీటీ మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

99 శాతం పెన్షన్ పంపిణీ

పీసీపల్లి, జూలై 2: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో జిల్లాలో పీసీపల్లి మండలం ఐదో స్థానంలో నిలిచింది. 99.07శాతం పింఛన్ పంపిణీ పూర్తిచేసినట్టు ఎంపీడీవో సుబ్బారావు తెలిపారు. మండలంలో 4823మంది లబ్ధిదారులుండగా సోమ, మంగళవారాల్లో 4778 మందికి అందజేసినట్టు చెప్పారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 3 జూలై 2024





పీ అరుణ్‌బాబు



వెంకటమురళి



రాజకుమారి



శ్యాంప్రసాద్



సీహెచ్ శ్రీధర్

కొత్త కలెక్టర్లు

- పల్నాడుకు అరుణ్‌బాబు
- బాపట్ల జిల్లాకు వెంకటమురళి
- గుంటూరు, పల్నాడు, బాపట్ల జేసీలకు ఉద్యోగోన్నతి
- గుంటూరు జేసీ రాజకుమారి నంద్యాల కలెక్టర్‌గా బదిలీ
- పల్నాడు జేసీ శ్యాంప్రసాద్ పార్వతీపురం మన్యం జిల్లాకు..
- బాపట్ల జేసీ శ్రీధర్ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా నియామకం

గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, జూలై 2: కూటమి ప్రభుత్వం మంగళవారం చేపట్టిన ఐఏఎస్‌ల బదిలీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలువురుకి స్థానచలనం కలిగింది. ఇటీవలే గుంటూరు, బాపట్ల కలెక్టర్లను మార్చగా తాజాగా పల్నాడు కలెక్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వం మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మూడు జిల్లాల జాయింట్ కలెక్టర్లకు ఉద్యోగోన్నతి కల్పించింది. పల్నాడు జిల్లాకు పీ అరుణ్‌బాబు, బాపట్ల జిల్లాకు వెంకటమురళిలను కలెక్టర్లుగా ప్రభుత్వం నియమించింది. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న పీ అరుణ్ బాబును పల్నాడు జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసింది. పల్నాడు జిల్లాకు మూడో కలెక్టర్‌గా అరుణ్‌బాబు బాధ్యతలు స్వీకరించనున్నారు. 2014 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అరుణ్‌బాబు గతంలో నరసరావుపేట, గురజాల ఆర్డీవోగా పని చేశారు. జిల్లాలో పోలింగ్ రోజు, ఆ తర్వాత చెలరేగిన హింస నేపథ్యంలో అప్పటి కలెక్టర్ శివశంకర్‌ని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో రెండో కలెక్టర్‌గా శ్రీకేష్ బాలాజీలత్కర్ గత నెల 19న బాధ్యతలు చేపట్టారు. పోస్టింగ్ కోసం వేచి ఉన్న కలెక్టర్ శివశంకర్‌ను వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇక గుంటూరు పూర్వ కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి పోస్టింగ్ ఇవ్వ లేదు. ఇటీవల బదిలీల్లో ఆయనను ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే.

ట్రైబల్ వెల్ఫేర్ నుంచి బాపట్లకు..

ట్రైబల్ వెల్ఫేర్ విభాగంలో డైరెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటమురళిని బాపట్ల జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. 2015 బ్యాచ్‌కు చెందిన ఆయన 2020-22లో ఉమ్మడి ప్రకాశం, 2022-23 వరకు పశ్చిమ గోదావరి జేసీగా సేవలందించారు. అంతకుముందు 2010-13 మధ్య కర్నూలు, 2013 నుంచి 2015 వరకు విశాఖపట్నం, 2017 నుంచి 2019 వరకు విజయనగరం ఆర్డీవోగా పని చేశారు. ఆ తర్వాత ఏడాది పాటు ప్రొటోకాల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈయన స్వస్థలం అనంతపూర్ కాగా కడప జిల్లా మైదుకూరులో స్థిరపడ్డారు. కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ ఇదే కావడం గమనార్హం. ప్రభుత్వ ప్రాథమ్యాలకు అనుగుణంగా పనిచేస్తానని వెంకటమురళి తెలిపారు. నిర్లక్ష్యానికి తావులేకుండా, అవినీతి రహిత పాలన అందిస్తానని తెలిపారు. మంచి రోజు చూసుకుని బాధ్యతలు చేపడతానని ఆంధ్రజ్యోతికి తెలిపారు.

జేసీల నుంచి కలెక్టర్లుగా..

గుంటూరు, బాపట్ల, పల్నాడు జాయింట్ కలెక్టర్లుగా విధులు నిర్వహించిన రాజకుమారి గణియా, చామకూరి శ్రీధర్, ఏ శ్యాంప్రసాద్‌లకు తాజా బదిలీల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ఇంతకాలం జేసీలుగా ఉన్న వీరిని కలెక్టర్లుగా వేర్వేరు జిల్లాలకు బదిలీ చేసింది. గుంటూరు జేసీ రాజకుమారిని నంద్యాల జిల్లా కలెక్టర్‌గా నియమించింది. రాజకుమారి 2021లో తూర్పు గోదావరి నుంచి బదిలీపై గుంటూరుకి వచ్చారు. 2022లో జిల్లా పునర్విభజన జరిగినప్పుడు ఆమెను ఇక్కడే కొనసాగిస్తూ అప్పటి ప్రభుత్వం జేసీగా నియమించింది. ఇంచుమించు మూడేళ్ల పాటు జిల్లాలో కొనసాగారు.

- పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ పార్వతీపురంమన్యం జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శ్యాంప్రసాద్ పల్నాడు జిల్లాకు తొలి జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.
- బాపట్ల జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఏడాదికి పైగానే ఇక్కడ పనిచేసిన ఆయనకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ఇటీవల బాపట్ల కలెక్టర్ రంజిత్‌బాషా బదిలీ కాగా ఇంతకాలం ఇన్‌చార్జి కలెక్టర్‌గా శ్రీధర్ ఉన్నారు. వెంకటమురళిని ప్రభుత్వం కలెక్టర్‌గా నియమించడంతో కలెక్టర్‌గా అదనపు బాధ్యతల నుంచి కూడా జేసీ రిలీవ్ అవనున్నారు.

సచివాలయం సందిగ్ధం



- దిగజారిన పంచాయతీరాజ్ వ్యవస్థ
- ఉత్సవ విగ్రహాలుగా సర్పంచులు, స్థానిక ప్రతినిధులు
- ఉద్యోగులను ఆయా శాఖలకు బదిలీ చేస్తారంటూ ఊహాగానాలు
- తద్వారానే మానవ వనరుల సద్వినియోగం సాధ్యమంటున్న నిపుణులు

సచివాలయం.. పాలనను ప్రజల దరికి చేర్చేందుకు అని వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే స్థానిక స్వపరిపాలన లక్ష్యంతో రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ వ్యవస్థ అత్యంత దయనీయంగా మారింది. జగన్ మానసపుత్రికగా భావించి.. ఉద్యోగ నియామకాలను పెద్ద ఎత్తున చేపట్టి సర్వాధికారాలను అప్పగించారు. ప్రజలచే ఎన్నుకోబడిన స్థానిక సంస్థల ప్రతినిధులు ఉత్సవ విగ్రహాలుగా మారగా.. పంచాయతీరాజ్‌కు అధికారాలు, విధులు లేకుండా పోయింది. సచివాలయ వ్యవస్థ ప్రమాదకరమని మేధావులు ఆరోపించగా.. సర్పంచ్‌లు, స్థానిక సంస్థల ప్రతినిధులు ఆగ్రహించారు. అయితే తాజా ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడటంతో ఈ సచివాలయ వ్యవస్థ ప్రస్తుతం సందిగ్ధంలో పడింది. ఉద్యోగుల మధ్య గత నెలరోజులుగా ఇదే చర్చ సాగుతోంది. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థ ఎక్కడా కనిపించకపోవడంతో సచివాలయ వ్యవస్థలో కూడా మార్పులు అనివార్యమన్న భావన ఇటు ఉద్యోగుల్లోను, అటు నిపుణుల్లోనూ వ్యక్తమవుతోంది.

గుంటూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో.. రాష్ట్రంలో గతంలో ఏ ప్రభుత్వం ఉన్నా పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రయత్నించింది. విధులు, హక్కులు, నిధులు స్థానిక ప్రభుత్వాలకే ఇవ్వాలన్న పోరాటం ఎప్పటి నుంచి ఉంది. అయితే దీనికిభిన్నంగా 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన జగన్ సచివాలయ వ్యవస్థను రాష్ట్రంలో ప్రవేశపెట్టారు. జగన్ తన కోసం ప్రత్యేకంగా రూపొందించుకున్న వ్యవస్థగా ముద్రపడిన సచివాలయ వ్యవస్థ ఉనికి ప్రస్తుతం సందిగ్ధంలో పడింది. వైసీపీ ఘోర పరాభవం, ఎన్డీఏ కూటమి విజయంతో ఈ వ్యవస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులను ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీలకు కేటాయించడంతో ఆ భావనకు మరింత బలం చేకూరుతోంది. వైసీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన సచివాలయ వ్యవస్థ అన్ని వ్యవస్థలపై తన ప్రభావాన్ని చూపింది. గత ప్రభుత్వ నిర్వాకంతో ఏర్పాటైన సచివాలయ వ్యవస్థ అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖ, రిజిస్ట్రేషన్, వ్యవసాయ శాఖలు మొదలు అన్ని శాఖల పనులకు కేంద్రమైంది. మొత్తం ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అన్ని పనులూ అక్కడే చేయించుకోవాల్సిన పరిస్థితి వచ్చిపడింది. దీంతో ఐదేళ్లకాలంలో సచివాలయ వ్యవస్థ ప్రభుత్వరంగానికి ప్రత్యామ్నాయమైన ఒక బలమైన సమాంతర వ్యవస్థగా మారింది. ప్రభుత్వ శాఖలన్నీ నామమాత్రంగా మారిపోయాయి. దీంతో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంబంధం దాదాపుగా తెగిపోయింది. ప్రజల వద్దకు పరిపాలన, సదుపాయాలు తెస్తున్నామని చెబుతూనే ప్రజలతో ప్రభుత్వానికి ఉన్న అనుబంధాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా గత ప్రభుత్వం తెగడెంపులు చేసింది. ఈ నేపథ్యంలో సమాజంలో తీవ్ర ఆందోళన నెలకొంది.

ఈ- సేవ, మీ- సేవలకు చెల్లు చీటీ

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో మొత్తం 13 వేల గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అనేక రకాల విధులు నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా ఆధార్ కార్డులు మొదలు పాన్ కార్డులు, ఓటర్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల నమోదు, జారీ జరుగుతోంది. కొత్తగా రేషన్ కార్డులు కావాలన్నా, ఉన్న రేషన్ కార్డును రెండుగా చేయాలన్నా సచివాలయమే దిక్కయింది. డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీబుక్కుల జారీ, నవదంపతుల వివాహ ధ్రువీకరణ, స్థలాలు, పొలాల రిజిస్ట్రేషన్, ఈసీ, అడంగల్ నకళ్లు, పట్టాదార్ పాసు పుస్తకాల జారీ విద్యుత్ మీటర్ల దరఖాస్తు, జారీ వంటి 543 రకాల సేవలు అందిస్తున్నారు. ఈ సేవలన్నీ గతంలో ఆయా ప్రభుత్వ శాఖలు నేరుగా అందేవి. ఇప్పుడు కూడా ఆ శాఖలే ఆ సేవలను అందిస్తున్నా, వాటిని సచివాలయాల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారు. గతంలో ఈ సేవలన్నీ మీ- సేవ, ఈ- సేవ, సీఎస్‌సీ కేంద్రాల ద్వారా జరిగేది. వాటి ద్వారా రాష్ట్రంలో కొన్ని లక్షల మంది నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు పొందారు. తద్వారా అది ఒక స్వయం ఉపాధిరంగంగా ఉంది. సచివాలయ వ్యవస్థ కారణంగా ఇప్పుడు వారందరూ ఉపాధి కోల్పోయి వీధినపడ్డారు. వారంతా తిరిగి పాత పద్ధతిలో మీ- సేవ, ఈ- సేవలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

అంగన్వాడీలపై సచివాలయాల పెత్తనం

స్త్రీ, శిశు సంక్షేమ పరిధిలో ఉండే అంగన్వాడీ కేంద్రాలపై సచివాలయాలకు అజమాయిషీ ఇవ్వడం సర్వత్రా విమర్శలకు దారి తీసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రాయోజిత స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నిర్వహించే అంగన్వాడీ కేంద్రాలపై సచివాలయాల పెత్తనం పెరిగింది. దీంతో అంగన్వాడీ ఉద్యోగులు సొంత శాఖ పరిధిలో కాకుండా సచివాలయ ఉద్యోగుల పరిధిలో పనిచేయాల్సి వచ్చింది. కిందటేడాది తమ వేతనాలు, అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళన చేసినప్పుడు ఆ ఆందోళనను నీరుగార్చేందుకు గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులనే అస్త్రాలుగా వాడుకుంది. దీంతో సచివాలయ ఉద్యోగులపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమైంది.

అడ్డుగోడలా..

సచివాలయ వ్యవస్థ ప్రజలకు, ప్రభుత్వ శాఖలకు మధ్య అడ్డుగోడలా మారింది. రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు కావాలన్నా సచివాలయాన్ని సంప్రదించాలి. ప్రజలకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలన్నా, రేషన్ కార్డులు కావాలన్నా సచివాలయ సిబ్బంది వద్దకు వెళ్లాలి. ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలన్నా సచివాలయం గడపతొక్కాలి. పింఛన్లు మంజూరు చేయాలన్నా సచివాలయమే దిక్కు. పెళ్లి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలన్నా, చివరికి లైసెన్సులు, పాన్ కార్డులు, విద్యుత్ మీటర్లు కావాలన్నా అన్నింటికీ సచివాలయమే దిక్కయింది.. ఇలా ప్రతీ విషయంలోనూ సచివాలయం కేంద్రంగా వైసీపీ పాలన సాగింది. అయితే ఇక్కడ ఆయా సేవలు సులువుగా అందేవా అంటే ఆ పరిస్థితి అక్కడ ఉండేది కాదు. దీంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వచ్చేది.

అధికారాలకు కత్తెర



సచివాలయ వ్యవస్థ ప్రజా ప్రతినిధుల అధికారాలకు కత్తెర వేసిన సమాంతర వ్యవస్థగా మారింది. ముఖ్యమంత్రికి కూడా లేని చెక్ పవర్ ఉన్న సర్పంచులు నేడు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసే సర్పంచులు, వార్డు మెంబర్లు, గ్రామ సభలను ఎందుకూ కొరగానివిగా మార్చి గత ప్రభుత్వం స్థానిక స్వపరిపాలనను అపహాస్యం చేసింది. సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిన గ్రామ సభ, గ్రామ పంచాయతీలు పక్కకుపోయి, ఆ బాధ్యత వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి దక్కింది. దీంతో ప్రజలు ఎన్నుకున్న సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా వస్తుండడంతో స్థానిక ప్రజా ప్రతినిధులు, సర్పంచుల ముఖాలు చూసేవారు కూడా లేకుండా పోయారు. తాము ఎందుకు ప్రజా ప్రతినిధులుగా ఎంపిక య్యామో కూడా తెలియని అయోమయస్థితి వారికి దాపురించింది. రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాప్రాతినిధ్య చట్టం, 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలను తెచ్చారు. అయితే వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. సమాంతర వ్యవస్థగా మారిన సచివాలయ వ్యవస్థ మొత్తంగా పరిపాలనా వ్యవస్థకు ఆటంకంగా మారుతుందని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్పు అనివార్యమన్న వాతావరణం కనిపిస్తోంది. ఉద్యోగులందరినీ సంబంధిత శాఖల్లో వున్న ఖాళీల్లోకి బదిలీ చేస్తే ఆయా శాఖలు బలోపేతం అవడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని చెబుతున్నారు.

కుల ధ్రువీకరణకు.. కష్టాలు



- ఈఏపీసెట్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల ఇక్కట్లు
- మార్చి, ఏప్రిల్ మాసాల్లో తీసుకున్నవి చెల్లుబాటు కావు
- 2024-25 సర్టిఫికెట్లకు మాత్రమే ఆన్‌లైన్ అనుమతి
- చెల్లుబాటు కాని శాశ్వత కులధ్రువీకరణ పత్రాలు
- మీ సేవా, సచివాలయాల చుట్టూ విద్యార్థుల ప్రదక్షిణ
- రిజర్వేషన్ కోల్పోతామని అభ్యర్థుల ఆందోళన

గుంటూరు(విద్య), జూలై 2: ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే కుల ధ్రువీకరణ పత్రాల విషయంలో నెలకొన్న సందిగ్ధత విద్యార్థుల్ని తీవ్ర కలవరానికి గురిచేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఏపీఈఏపీసెట్‌కు అర్హత సాధించన వారు దాదాపు 16 వేల మందికిపైగానే ఉన్నారు. కౌన్సెలింగ్ కోసం ఈ ఏడాది ఇంటర్ పరీక్షలు పూర్తికాగానే మార్చి, ఏప్రిల్ మాసాల్లో అనేక మంది విద్యార్థులు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు తీసుకున్నారు. అయితే సదరు సర్టిఫికెట్లు 2023-24 విద్యాసంవత్సరానికి జారీ చేశారు. తాజాగా ఈ సర్టిఫికెట్లు కౌన్సెలింగ్‌కు ఉపయోగ పడటం లేదని విద్యార్థులు వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. రెండు మూడు నెలల క్రితం తీసుకున్న సర్టిఫికెట్లు ఉపయోగపడక పోవడంతో రిజర్వేషన్ కోల్పోయి తాము తీవ్రంగా నష్టపోతామని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తర్వులు పట్టించుకోకుంటే ఎలా?

కులధ్రువీకరణ పత్రాలు ఒకసారి తీసుకుంటే అవి శాశ్వతంగా ఉపయోగపడతాయని గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పుడు కౌన్సెలింగ్‌లో ఇటువంటి ఉత్తర్వులు అమలు చేయడం లేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 7లోగా ఆన్‌లైన్‌లో ఈఏపీసెట్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందులో తాజాగా తీసుకున్న సర్టిఫికెట్లు(2024-2025) మాత్రమే అప్‌లోడు అవుతున్నాయి. వాస్తవంగా కుల ధ్రువీకరణపత్రాలు తీసుకోవాలంటే దాదాపు నెల రోజులపైనే సమయం పడుతుంది. జిల్లాలో ఉన్న సచివాలయాల్లో పూర్తి స్థాయిలో వీఆర్‌వోలు అందుబాటులో లేరు. దీంతో కులధ్రువీకరణ పత్రాల దరఖాస్తు కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లో తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రాలు ఈఏపీసెట్‌కు అనుమతించాలని, గతంలో తీసుకున్న సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

షెడ్యూల్ ఇదే..

- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజుచెల్లింపు, రిజిస్ట్రేషన్ : ఈనెల 7 వరకూ.
- ధ్రువపత్రాల పరిశీలన : ఈనెల 4నుంచి 10 వరకూ
- వెబ్ ఆప్షన్ల నమోదు :ఈనెల 8నుంచి 12వరకూ.
- ఆప్షన్ల మార్పు : ఈనెల 13
- సీట్ల కేటాయింపు : ఈనెల 16
- కళాశాలల్లో రిపోర్టింగ్ : ఈనెల 17నుంచి 22 వరకూ.
- తరగతుల ప్రారంభం : 19 నుంచి
- విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి : ర్యాంకు కార్డు, మార్కులజాబితా, హాల్‌టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలను విద్యార్థులు సిద్ధంచేసుకోవాలి.
- పీహెచ్, క్యాప్, ఎన్‌సీసీ, స్కౌట్స్, గైడ్స్, స్పోర్ట్స్, గేమ్స్, ఆంగ్లో ఇండియన్ కేటగిరీ అభ్యర్థులకు మాత్రం ఈనెల 6 నుంచి విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నారు.

ప్రారంభమైన రిజిస్ట్రేషన్

ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశం కోసం ఏపీ ఈఏపీసెట్ విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 7వ తేదీలోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగించుకుని జూలై 4 నుంచి ధ్రువీకరణపత్రాల పరిశీలన ప్రారంభం కానుంది.

ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ

వివిధ ప్రాంతాల నుంచి భారీగా వచ్చిన అర్జీదారులు

తాడేపల్లి, జూలై 2: తాడేపల్లి నివాసంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ చేపట్టిన ప్రజా దర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు ప్రజాదర్బార్‌కు విచ్చేసి తమ సమస్యలు పరిష్కారం కోరుతూ లోకేశ్‌కు వినతిపత్రాలు అందిస్తున్నారు. దివ్యాంగులు పలు శాఖల ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు, యువత, వివిధ సంఘాల వారు తమ సమస్యల పరిష్కారం కోరుతూ లోకేశ్‌ను కలిసి అర్జీలను అందించడానికి బారులు తీరుతున్నారు. దీంతో ఉండవల్లి కరకట్ట తెల్లవారుజాము నుంచే అర్జీదారులతో కిటకిటలాడుతోంది. ఆయా సమస్యలపై లోకేశ్ అర్జీదారులకు భరోసా ఇస్తూ సంబంధిత సిబ్బందికి అక్కడికక్కడే ఆదేశాలు ఇస్తున్నారు. దీంతో సమస్యల పరిష్కార వేదికగా ప్రజాదర్బార్ నిలిచిందని అర్జీదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఉత్తర్వులు పొంది ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన బదిలీలకు అవకాశం కల్పించాలని పలువురు ఉపాధ్యాయులు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో 117 జీవో కారణంగా దూరప్రాంతాలకు బదిలీ అయి అనేక ఇబ్బందులు పడుతున్నామని వారు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ గత ప్రభుత్వంలో ఉపాధ్యాయ బదిలీల్లో భారీ అవినీతి జరిగిందని, నిబంధనల ప్రకారం ఉపాధ్యాయ బదిలీలు చేపడతామని స్పష్టం చేశారు. కాగా తన కుమార్తె దివ్యాంగ పెన్షన్‌ను కారణం లేకుండా గత ప్రభుత్వం తొలగించిందని, తిరిగి పునరుద్ధరించాలని ఉండవల్లికి చెందిన సుజాత లోకేశ్‌ను కోరారు. విద్యుత్ బిల్లు ఎక్కువ వచ్చిందనే కారణంతో గత ప్రభుత్వం తొలగించిన దివ్యాంగ పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఉండవల్లికి చెందిన ఇందిర కోరారు. భర్తలేని తనకు ఒంటరి మహిళ పెన్షన్ను మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన ధనలక్ష్మి విన్నవించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని సీతానగరానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు కోరారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న తన కుమారుడి వైద్యానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ఉండవల్లికి చెందిన రమేష్ విజ్ఞప్తి చేశారు. నిరుపేద అయిన తాను నర్సింగ్ చదివానని, తనకు స్టాఫ్ నర్సుగా ఉద్యోగం కల్పించాలని ఉండవల్లికి చెందిన పద్మావతి కోరారు. తాడేపల్లి ఐవోసీకి ఎదురుగా ఉన్న ఇండస్ట్రియల్ ఏరియాలో రోడ్లు, డ్రెయినేజి వీధి దీపాలు మంచినీటి వసతి కల్పించాలని తాడేపల్లి ఎంఎస్‌ఎంఈ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కోరారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తానని లోకేశ్ అర్జీదారులకు హామీ ఇచ్చారు.



దివ్యాంగురాలి అర్జీ అందుకుంటున్న మంత్రి లోకేశ్



బారులు తీరిన అర్జీ దారులు

సైబర్ స్టాకింగ్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బాపట్ల, జూలై 2 : సైబర్ స్టాకింగ్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈవిషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఫొటోలు, వీడియోలు, ఇతర అభ్యంతకర సందేశాలను పంపి బెదిరింపులకు గురిచేయటమే సైబర్ స్టాకింగ్ అన్నారు. సోషల్ మీడియా వేదికల ద్వారా ఆన్‌లైన్‌లో పరిచయమయ్యే స్నేహితులను నమ్మి మోసపోవద్దని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఒక వ్యక్తిని లేదా వ్యక్తుల సమూహాన్ని వేధించటానికి ఫొటోలు, వీడియోలు, ఇతర అభ్యంతరకర సందేశాలను ఈమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్ వంటి ఇతర సోషల్ మీడియా ద్వారా పంపించటం, పంపిస్తామని బెదిరించటం వంటివి సైబర్ స్టాకింగ్ నేరాల కిందకు వస్తాయన్నారు. ముఖ్యంగా మహిళలపై ఇవి తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. చాలా మంది మహిళలు వారి కీర్తిప్రతిష్ఠలను, పరువును పోగొట్టుకుంటున్నారన్నారు. సోషల్ మీడియా ఖాతాలను యాక్సెస్ చేయటం ద్వారా ఆన్‌లైన్ కార్యకలాపాలు, వ్యక్తిగత సమాచారాన్ని నేరగాళ్ళు తెలుసుకుంటున్నారన్నారు. జీపీఎస్, కొన్ని స్పైవేర్‌లను ఉపయోగించి లోకేషన్ ట్రాక్ చేస్తున్నారన్నారు. దీనికి గురికాకుండా సురక్షితంగా ఉండటానికి తగుసూచనలు పాటించాలన్నారు.

- ఏదైనా సోషల్‌మీడియాలో ఉపయోగిస్తున్నప్పుడు ప్రైవసి సెట్టింగ్‌ను సెట్ చేసుకోవటం మంచిది.
- అవసరమైనప్పుడు మాత్రమే మొబైల్‌లోని జీపీఎస్‌ను వినియోగించాలి. మిగిలిన సందర్భాలలో జీపీఎస్‌ను ఆఫ్‌వేయటం వల్ల స్టాకర్ మీ లోకేషన్ కనుగొనలేరు.
- ఆన్‌లైన్‌లో పరిచయమైన స్నేహితులు మీఫొటోలు, వ్యక్తిగత సమాచారం ఇవ్వవల్సిందిగా డిమాండ్ చేసిన మీ ఫొటోలు, వీడియోలు, ఇతర సమాచారం వారితో పంచుకోవద్దు.
- మీ కార్యకలాపాలను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేస్తున్నప్పుడు మీ లోకేషన్‌ను ఎవరికి షేర్‌చేయవద్దు.
- ఎవరైన సైబర్ స్టాకింగ్ నేరాలకు పాల్పడుతున్న, పాల్పడుతారని అనుమానం వచ్చిన ఆలస్యం చేయకుండా వెంటనే మీ దగ్గరలో ఉన్న పోలీసుస్టేషన్‌కు వెళ్ళి పిర్యాదు చేయాలని లేదా 1930కు కాల్ చేయాలని లేదా నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.



ఎస్పీ వకుల్ జిందాల్

టెట్ నోటిఫికేషన్ విడుదల

నేటి నుంచి ప్రక్రియ మొదలు.. 4 నుంచి దరఖాస్తుకు అవకాశం

ఒంగోలు(విద్య), జూలై 2: రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్) జూలై-24 నోటిఫికేషన్ మంగళవారం విడుదలైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 16,317 టీచర్ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు అందరికీ అవకాశం కల్పించేందుకు మళ్లీ టెట్ నిర్వహించమని అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టెట్‌లో అర్హత సాధిస్తేనే డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. అదేవిధంగా టెట్‌లో సాధించిన మార్కుల్లో డీఎస్సీకి 20 శాతం వెయిటేజి ఇస్తారు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటించారు. టెట్ పరీక్షకు బుధవారం నుంచి ఈనెల 16 వరకు పేమెంట్ గేట్‌వే ద్వారా పరీక్ష రుసుం చెల్లించాలి. ఈనెల 4 నుంచి 17 వరకు పాఠశాల విద్యా కమిషనర్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలి. 16న ఆన్‌లైన్ మాక్ టెస్ట్ నిర్వహిస్తారు. 25న పరీక్ష హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆగస్టు 5 నుంచి 20 వరకు రెండు సెషన్లలో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. పేపర్-1ఏ, పేపర్1బీ, పేపర్-2బీ, పేపర-2బీ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఆగస్టు 10 నుంచి పరీక్ష పూర్తయిన పేపర్ల ప్రాథమిక కీ విడుదల చేస్తారు. 11 నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరించి 25న తుదికీ విడుదల చేస్తారు. టెట్ ఫలితాలను ఆగస్టు 30న ప్రకటిస్తారని షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

ఏఎస్సైపై సస్పెన్షన్ వేటు

యూనిఫాంలోనే మద్యపానం చేస్తున్న వీడియో వైరల్

కఠినచర్యలు తీసుకున్న ఎస్పీ

ఒంగోలు(క్రైం), జూలై 2: యూనిఫాంలోనే మద్యం తాగి ఈల వేస్తు పాటలు పాడుతూ క్రమశిక్షణ రాహిత్యంగా వ్యవహరించిన ఏఎస్సై ఏ.వెంకటేశరరావును సస్పెండ్ చేస్తున్నట్లు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ తెలిపారు. ముండ్లమూరు మండలం శంకరాపురంలో రెండు గ్రూపుల మధ్య గొడవల నేపథ్యంలో అక్కడ పోలీసు పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ఈక్రమంలో గతనెల 26న డ్యూటీలో ఉన్న ఏఎస్సై వెంకటేశ్వరరావు సాయంత్రం నాలుగు గంటలకు శంకరాపురం పొలాల్లోకి వెళ్లి యూనిఫాంలోనే మద్యం సేవించారు. దీంతో గతనెల 29న వీఆర్‌కు పంపుతు ఆదేశాలు జారీచేశామని ఎస్పీ తెలిపారు. దర్శి డీఎస్పీని విచారణాధికారిగా నియమించి విచారణ చేయించిన అనంతరం నివేదికను గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి అందజేశామన్నారు. ఆయన ఉత్తర్వుల మేరకు ఏఎస్సైని సస్పెండ్ చేశామని తెలిపారు.

మార్టూరులో చోరీ.. రూ.70వేల అపహరణ

సీసీ ఫుటేజీ బాక్సులను ఎత్తుకెళ్లిన దొంగలు

మార్టూరు, జూలై 2 : మార్టూరులో నాగరాజుపల్లిరోడ్‌లో సాయిమల్లికార్జున అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న వీధిలో దండా నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇంటిలో సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఇంటి తలుపులకు ఉన్న ఇనుప బోల్టులను పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంటిలో ఉన్న రూ.70వేల నగదును ఎత్తుకుపోయారు. దొంగతనం జరిగిన సమయానికి ఇంట్లో ఎవరూ లేరు. అందిన సమాచారం మేరకు.. నాగేశ్వరరావు కర్ణాటకలో వ్యవసాయం చేస్తూ కుటుంబంతో అక్కడే ఉంటున్నారు. ఇంటి వద్ద లోపలాబయటా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 15 రోజుల కింట కుటుంబం కర్ణాటకకు వెళ్లారు. ఇంటిలో మిరప విత్తనాలు కొనుగోలుకు బీరువాలో రూ.70 వేల ఉంచారు. దొంగలు ప్రధాన డోరుకు ఉన్న ఇత్తడి, ఇనుప బోల్టులను తొలగించి ఇంటిలోకి ప్రవేశించారు. ఇంటిలోని అన్ని గదులును పరిశీలించిన తర్వాత మొదటి అంతస్తులో పైగదిలోకి ప్రవేశించి బీరువా తాళం పగలగొట్టి అందులోని నగదుతో ఉడాయించారు. సీసీ కెమెరాలు ఉన్న విషయం గుర్తించిన దొంగలు సీసీ ఫుటేజీ బాక్సులను ఎత్తుకుపోయారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాత్రి మార్టూరుకు బయలుదేరారు. వారు బస్సులో ఉండగానే రాత్రి 11 గంటలకు, అర్ధరాత్రి, వేకువ జామున సెల్‌ఫోన్‌లో ఇంటిలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఫుటేజీలు కనిపించకపోవడంతో మరమ్మతు అయిందా, లేక నెట్‌వర్క్ సమస్య అయి ఉంటుందని భావించారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చాక దొంగతనం జరిగిందని గ్రహించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ఇంటిని పరిశీలించారు.

బైకును ఢీకొన్న లారీ.. ఒకరు మృతి

మరొకరికి గాయాలు



ఏసుబాబు మృతదేహం

అద్దంకి, జూలై 2 : మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి లారీ క్రాస్ చేస్తూ ఢీ కొనడంతో బండా రు ఏసుబాబు(40) అక్కడికక్కడే మృతి చెంద గా, మరొకరు తాళ్లూరి అశోక్‌కు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మార్టూరు మండలం కోనంకికి చెందిన బండారు ఏసుబా బు, తాళ్లూరి అశోక్ మోటార్ సైకిల్ పై అద్దంకి వస్తుండగా మంగళవారం సాయంత్రం పట్టణం సమీపంలో కలవకూరు రోడ్డులో ఇటుక బట్టీలు, అపార్ట్‌మెంట్ మధ్యలో వెనుక నుంచి వచ్చిన లారీ ముందు వెళ్తున్న మోటార్ సైకిల్‌ను క్రాస్ చేస్తూ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏసుబాబు అక్కడికక్కడే మృతి చెందగా, అశోక్‌కు గాయాలు కావడంతో 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏసుబాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



ఏసుబాబు(ఫైల్)

చికెన్ దుకాణానికి నోటీసులు

సంతమాగులూరు, జూలై 2: మండలంలోని చవిటిపాలెం గ్రామంలో చికెన్‌దుకాణం నిర్వహిస్తున్న గూళ్ల హనుమంతరావు తండ్రి చెన్నయ్యకు మంగళవారం గ్రామ పంచాయతీ నుంచి నోటీసులు అందాయి. చికెన్ వ్యర్థాలతో కంపు కొడుతోందని, వ్యర్థాలు తిన్న కుక్కలు ప్రజలపై దాడి చేస్తున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. పంచాయతీ అనుమతితో గ్రామ శివారులో దుకాణాన్ని నిర్వహించుకోవాలని ఆ నోటీసులో తెలిపారు. వెంటనే దుకాణాన్ని తొలగించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ దాడులు

ఎక్స్‌కవేటర్, మూడు డంపర్లు స్వాధీనం

మద్దిపాడు/మేదరమెట్ల, జూలై 2 : గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఎట్టకేలకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కొరిశపాడు మండలం ఎర్రపాలెం శివారు కొండతోపాటు మద్దిపాడు మండలం బూరేపల్లి కొండలో గత కొద్దిరోజులుగా కొందరు అక్రమార్కులు తవ్వకాలు చేపట్టి మట్టిని అమ్ముకుంటున్నారు. పక్కా సమాచారం మేరకు.. గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ అధికారులు దాడులు చేశారు. సోమవారం రాత్రి మట్టిని తవ్వుతున్న ఎక్స్‌కవేటర్, తరలించేందుకు సిద్ధంగా ఉన్న మూడు డంపర్లను స్వాధీనం చేసుకున్నారు. మైనింగ్ ఏడీ వీరేశ్, సిబ్బంది జగన్నథ్ తదితరులు దాడులలో పాల్గొన్నారు. కేసు నమోదు చేశామని ఏడీ తెలిపారు. వాహనాలను మద్దిపాడు పోలీసులకు అప్పగించారు.



మద్దిపాడు స్టేషన్‌లో ఎక్స్‌కవేటర్, డంపర్లు

సమగ్రశిక్ష.. మజాకా!

గతేడాది నిధులు విడుదల సున్నా ఎమ్మార్సీలకు అందని వైనం

పాఠశాలలదీ అదే పరిస్థితి

రాని గ్రాంట్లకు ఇప్పుడు ఆడిట్.. రూ.కోటికి టెండర్

అయోమయంలో హెచ్‌ఎంలు

నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం

వింత నిర్ణయాలకు విద్యాశాఖ కేంద్రంగా మారింది. మండల విద్యా వనరుల కేంద్రాలకు(ఎమ్మార్సీ), పాఠశాల కాంప్లెక్స్‌లకు గత విద్యా సంవత్సరంలో నయాపైసా కూడా విడుదల కాలేదు. తాజాగా పాఠశాల గ్రాంట్లు లేకపోయినా సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయం ఆ నిధుల ఆడిట్ నిర్వహించేందుకు పూనుకుంది. 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాలకు విడుదలైన గ్రాంట్లకు సంబంధించి ఈనెల 3, 4 తేదీల్లో ఆడిట్ చేయించుకోవాలని ప్రకటించడంతో హెచ్‌ఎంలు విస్తుపోయారు. పాఠశాలకు విడుదల కాని గ్రాంట్లకు ఆడిట్ ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఆ పేరుతో తాము ఖాళీ పుస్తకాలు చూపించి వచ్చేందుకు తమకు ఖర్చులెవ్వరు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఒంగోలు(విద్య), జూలై 2: నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్లుంది సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయ వ్యవహారం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యార్థులను వందశాతం పాఠశాలల్లో నమోదు చేసేందుకు జూన్ 13 నుంచి 'నేను బడికి పోతా' పేరుతో కార్యక్రమాలను నిర్వహించేందుకు జూన్ 14న సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ పేరుతో ఉత్తర్వులు వెలువడ్డాయి. విచిత్రమేమింటే 13వతేదీనే నిర్వహించాల్సిన కార్యక్రమాలను కూడా 14న విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొనడంతో అందరూ విస్తుపోయారు. అదేవిధంగా 2023-24 విద్యా సంవత్సరంలో సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయం నుంచి పాఠశాల కాంపోజిట్ గ్రాంటు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. ఈ ఏడాది ఇంతవరకు నిధులు విడుదల చేయలేదు. అయినా సరే ఆడిట్ అంటూ సమగ్రశిక్ష కార్యాలయం సిద్ధమైంది. దీంతో ప్రధానోపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నారు.

హెచ్‌ఎంల జేబుల నుంచే ఖర్చు

పాఠశాలలకు ఇవ్వాల్సిన గ్రాంట్లను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వాటి నిర్వహణకు ప్రధానోపాధ్యాయులు విధిగా తమ జేబుల నుంచి ఖర్చుచేయాల్సి వచ్చింది. ఎక్కువమంది పిల్లలు ఉన్న పాఠశాలల్లో హెచ్‌ఎంలు రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు ఖర్చుచేసి లబోదిబోమంటున్నారు. పాఠశాల విద్యుత్ బిల్లులు, మరమ్మతులు, ఇంటర్నెట్, తాగునీరు తదితరాలకు హెచ్‌ఎంలు తమ సొంత నిధులనే వెచ్చించాల్సి రావడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. కేంద్రప్రభుత్వం ఇచ్చే 60శాతం గ్రాంట్‌కు రాష్ట్రప్రభుత్వం 40శాతం కలిపి మొత్తం 100శాతం పాఠశాలలకు విడుదల చేయాల్సి ఉండగా ఒక్కశాతం నిధులు కూడా విడుదల కాలేదు.

ఆడిట్ పేరుతో రూ.కోటికి టెండర్

పాఠశాలల ఆడిట్ గతంలో పాఠశాలకు రూ.150 ఆ తర్వాత రూ.250 చొప్పున చెల్లించేవారు. ప్రస్తుతం విడుదల చేయని నిధులను ఆడిట్ చేసేందుకు సదరు కంపెనీకి కోటి రూపాయలు చెల్లించేందుకు టెండర్ ఖరారు చేశారు. అయితే తెలంగాణలో మాత్రం ఆడిట్‌కు నామమాత్రంగానే చెల్లింపులు జరుగుతున్నట్లు చెప్తున్నారు. పాఠశాలకు విడుదల కాని నిధులకు ఆడిట్ ఏమిటని హెచ్‌ఎంలు తలలు పట్టుకుంటున్నారు. ఆడిట్‌కు మండల విద్యావనరుల కేంద్రాలకు వెళ్లేందుకు ఖర్చులు ఎవరిస్తారని హెచ్‌ఎంలు ప్రశ్నిస్తున్నారు.

నేటి నుంచి ఆడిట్

జిల్లాలో పాఠశాలల ఆడిట్ బుధవారం నుంచి ప్రారంభంకానుంది. జిల్లాలో మొత్తం 902 పాఠశాలలకు ఆడిట్ నిర్వహిస్తారు. 3న ఒంగోలు మండల విద్యావనరుల కేంద్రంలో 13 మండలాల్లోని 285 స్కూళ్లకు పొదిలి ఎమ్మార్సీలో 9 మండలాల్లోని 224 స్కూళ్ల, 4న మార్కాపురంలో ఎమ్మార్సీలో 373 పాఠశాలలకు ఆడిట్ నిర్వహిస్తారు.



సమగ్ర శిక్ష కార్యాలయం

విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి సమగ్ర శిక్ష ప్రాజెక్టు నుంచి పాఠశాలలకు కాంపోజిట్ గ్రాంటు విడుదల అవుతుంది. 1 నుంచి 8వ తరగతులకు పాఠశాలల్లో 30 మంది లోపు ఉంటే రూ.10వేలు, 30 నుంచి 100మందిలోపు పిల్లలు ఉంటే రూ.25వేలు, వంద నుంచి 250మందిలోపు ఉంటే పాఠశాలలకు రూ.50వేలు, 250పైన వెయ్యిమందిలోపు పిల్లలు ఉన్న పాఠశాలలకు రూ.75వేలు చొప్పున కాంపొజిట్ గ్రాంటు విడుదల కావాలి. 9 నుంచి 12వ తరగతుల వరకు 30 నుంచి 100మందిలోపు పిల్లలు ఉన్న స్కూల్‌కు రూ.25వేలు, 100 నుంచి 250మందిలోపు పిల్లలు ఉన్న పాఠశాలలకు రూ.50వేలు, 250 నుంచి వెయ్యిమందిలోపు పిల్లలు ఉన్న పాఠశాలలకు రూ 75వేలు, వెయ్యి మందిపైన విద్యార్థులు ఉన్న పాఠశాలలకు రూ.లక్ష గ్రాంట్ ఇస్తారు. గతేడాది 1నుంచి 8 తరగతులు ఉన్న 1,995 పాఠశాలలకు రూ.5.10 కోట్లు, 9 నుంచి 12 తరగతులు ఉన్న 363 పాఠశాలలకు రూ.2.24 కోట్లు మంజూరు కాగా పాఠశాలలకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. 2022-23 విద్యా సంవత్సరంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు విడులైన రూ.10.23 కోట్లలో కేవలం రూ.4కోట్లు మాత్రమే రాగా అది రెండు విడతలుగా పాఠశాలలకు విడుదల చేసి చేతులు దులుపుకొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి చర్యలు

కలెక్టర్ తమీమ్ అన్సారియా

నిర్మాణ పనులు, ముంపు గ్రామాలు, పునరావాస కాలనీలు సందర్శన



ఇడుపూరు-1 పునరావాస కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మార్కాపురం/మార్కాపురం రూరల్, జూలై 2: కరవు ప్రాంతమైన పశ్చిమప్రకాశానికి వరప్రదాయిని అయిన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రభుత్వ అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు సంబందించి నిర్మాణ పనులు, ముంపు గ్రామాలు, పునరావాస కాలనీలను మంగళవారం ఆమె సందర్శించారు. తొలుత గొట్టిపడియ గ్రామానికి సంబందించి వేములకోటలోని కోమటికుంట వద్ద ఉన్న పునరావాస కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడకు చేరుకున్న గ్రామస్థులతో ఆమె మాట్లాడారు. గ్రామానికి సంబందించి వ్యక్తిగత పరిహారం త్వరగా అందజేయాలని పలువురు కోరారు. అనంతరం గొట్టిపడియ డ్యామ్‌తోపాటు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు నీటిని అందించేందుకు నిర్మిస్తున్న ఇన్‌టెక్ వెల్ పనులను పరిశీలించారు. ఆయా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి ముంపు గ్రామమైన పెద్దారవీడు మండలం కలనూతలకు వెళ్లారు. అక్కడ గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వపరంగా వారికి అందుతున్న సేవలు, తాగునీటి సరపరా, మౌలిక వసతుల గురించి తెలుసుకున్నారు. తమకు సహేతుకమైన వ్యక్తిగత పరిహారం అందజేస్తే గ్రామాన్ని ఖాళీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నిర్వాసితులను గుర్తించడానికి కటాఫ్ తేదీని పెంచాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని గ్రామస్థులకు ఆమె హామీ ఇచ్చారు. అక్కడ నుంచి సుంకేసుల డ్యామ్‌ను పరిశీలించి మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం కలనూతల గ్రామస్థుల కోసం మార్కాపురం మండలం లోని ఇడుపూరులో నిర్మిస్తున్న 1, 2 పునరావాస కాలనీలను సందర్శించారు. అక్కడ నుంచి పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టులో నిర్మాణంలోవున్న గుండంచెర్ల గ్రామస్థుల పునరావాస కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా పునరావాస కాలనీ నుంచి సమీపంలోనే ఉన్న జాతీయ రహదారి 565కు నూతన రహదారి ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీలో ప్రార్థనా మందిరాలకు కొంతమేర ఎక్కువ స్థలం ఇవ్వాలని కోరారు. సర్వేలో తప్పులు దొర్లి కొన్ని పేర్లు నమోదుకాలేదని వారిని జాబితాలో చేర్చాలన్నారు. అంతేకాక ముంపు గ్రామాల నుంచి ఖాళీ చేసే తేదీ వరకు నూతనంగా అర్హులైన వారిని వ్యక్తిగత పరిహారం అందించే లబ్ధిదారులుగా గుర్తించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అవసరమైన అన్ని రకాల వసతులను పునరావాస కాలనీల్లో ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాక పరిహారం, లబ్ధిదారుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, ప్రాజెక్టు ఎస్ఈ అబూత్ అలీమ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ ఝాన్సీలక్ష్మి, మార్కాపురం, కంభం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సత్యనారాయణ, డి.నాగజ్యోతి, డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సాయికుమార్, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

7న సాహిత్య పురస్కార సభ

అద్దంకిటౌన్, జూలై 2 : అద్దంకిలోని శ్రీనివాస ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్టు, అద్దంకి, సాహితీ మిత్రమండలి, అద్దంకి ఆధ్వర్యంలో సాహిత్య పురస్కార సభ జరుగుతుందని సభ్యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మంగళవారం ప్రకటన ద్వారా తెలిపారు. సమావేశంలో రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్‌కు పురస్కారం అందించే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కావున సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా కారంచేడు విద్యార్థికి ఉచిత విద్య

కారంచేడు(పర్చూరు), జూలై 2 : ఎన్టీఆర్ ట్రస్ట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ చల్లపల్లి పాఠశాలలో ఉచిత విద్యను అభ్యసించేందుకు కారంచేడు విద్యార్థి ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థి సీహెచ్.రాజేష్ 7వ తరగతిలో చేరేందుకు ఉత్తర్వులు అందినట్లు తండ్రి కోటయ్య తెలిపారు. నిరుపేదనైన తన కుమారుడి విద్యకు సహకారమందించి, ఉచిత విద్యను పొందేందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ హృదయనాథ్ సేవలు ఆదర్శనీయం

- జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ
- వైద్యసేవారత్న బిరుదుతో సత్కారం



హృదయనాథ్‌ను సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, డాక్టర్ జవహర్

చీమకుర్తి, జూలై 2 : ఐదు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ హృదయనాథ్ నేటి యువ డాక్టర్లకు ఆదర్శనీయమని జడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ, వైద్యుడు జవహర్ పేర్కొన్నారు. డాక్టర్స్‌డేను పురస్కరించుకొని చీమకుర్తి పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ జవహర్ వైద్య సేవా పురస్కారాన్ని డాక్టర్ హృదయనాథ్‌కు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా హృదయనాథ్ మాట్లాడుతూ వైద్యో నారాయణ హరి అనే నానుడిని అక్షరాల నిజం చేసేలా వైద్యులు రోగులకు సేవలు అందించాలని కోరారు. డాక్టర్‌గా సేవలు అందించటం ఎంతో కష్టతరమైనా రోగు లు తమ జబ్బునయమైన తర్వాత వారి కళ్లల్లో కరబరచే ఆనందం చూసి ఎంతటి కష్టమైనా మాయమవుతుందన్నారు. నేటి తరం డాక్టర్లు వ్యాపారత్మకతను విడనాడి సేవా దృక్పథంతో పనిచేయాలని కోరారు. అనంతరం డాక్టర్ జవహర్ మాట్లాడుతూ హృదయనాథ్ అందిస్తున్న సేవలను కొనియాడుతూ నేటితరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. తదుపరి వైద్యసేవలు అందించిన వైద్యులకు, సిబ్బందిని సత్కరించారు. చలువాది బదరినారాయణ, డాక్టర్ రాకేష్, డాక్టర్ శారద, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ విద్యాశంకర్, రాయపాటి ప్రసాదరావు, డాక్టర్ మణిమాల పాల్గొన్నారు.

ఉసురుతీసిన లోన్‌యాప్

అప్పుల ఊబితో తాడేపల్లి గూడెంవాసి బలవన్మరణం

గత మూడేళ్లుగా చీరాలలో చిరుద్యోగం

చీరాల్లోనే అంత్యక్రియలు



అయ్యప్ప కుమార్(ఫైల్)

చీరాలటౌన్, జూలై 2 : లోన్ యాప్‌లు తాడేపల్లి గూడెంకు చెందిన చిరుద్యోగి ఉసురును తీశాయి. వేధింపులు తాళలేకే అతను బలవన్మరణం చెందా రు. వివరాల్లోకివెళితే తాడేపల్లిగూడెంకు చెందిన కోరాడ అయ్యప్ప కుమార్(40) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఫైనాన్స్ బ్యాంకులో చిరుద్యోగిగా విధులు నిర్వహించేందుకు 2021లో భార్య జ్యోతి, మూడేళ్ల కుమారుడితో చీరాలకు వచ్చారు. ఈక్రమంలోనే కొత్తపేటలో అద్దెకు ఇల్లు తీసుకుని ఉద్యోగం చేస్తున్నారు. కుమారుడిని ప్రైవేటు పాఠశాలలో చేర్పించి చదివిస్తున్నారు. చాలీచాలని జీతాలు కారణంగా 20 రోజులుగా చీరాల్లోనే మరో ప్రైవేటు ఫైనాన్స్ బ్యాంకులో చేరారు. ఈ క్రమంలోనే ఇతను లోన్‌యాప్‌ల వలలో పడ్డారు. వారు వడ్డీపై వడ్డీలు వేశారు. అవి కట్టేందుకు మళ్లీ అప్పు చేశారు. అయినా పరిస్థితులు సర్దుబాటు కాకపోవడంతో భార్యకు విషయం తెలియకుండా ఉండేందుకు అప్పుడప్పుడు పట్టణంలోని ఓ లాడ్జికు వెళ్లి రూం అద్దెకు తీసుకుని మద్యం తాగడం అలవాటుగా మార్చుకున్నారు. ఈక్రమంలో పలుమార్లు ఇంటికి ఆలస్యంగా వెళ్తుండడంతో ఆందోళనతో భార్య అయ్యప్ప మిత్రులకు సమాచారం ఇచ్చేది. దీంతో వారు లాడ్జిలో ఉన్న అతడిని ఇంటికి చేర్చేవారు. ఇలా పలుమార్లు జరిగినట్లు సహోద్యోగులు చెప్తున్నారు. చివరకు బాకీలు తీర్చే పరిస్థితి లేకపోవడం, యాప్ నిర్వాహకుల వేధింపులు తట్టుకోలేక సోమవారం మధ్యాహ్నం లాడ్జిలో మద్యం బాగా సేవించి కుడి ముంజేతిని బ్లేడుతో పలుచోట్ల కోసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. రాత్రి వరకు గది తెరవకపోవడంతో లాడ్జి నిర్వాహకులు తలుపు తెరిచి చూశారు. అయితే అప్పటికే నరాలను బ్లేడుతో కోసుకుని రక్తపు మడుగులో అయ్యప్ప విగతజీవిగా పడివున్నారు. దీంతో వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వేమన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి, మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయ్యప్ప తల్లిదండ్రులు గతంలోనే మృతిచెందిన కారణంగా అంత్యక్రియలు కూడా చీరాల్లోనే ముగించారు. కట్టుకున్న భర్త కానరాని లోకాలు చేరడంతో భార్య జ్యోతి, కుమారుడు బంధువులతో కలిసి విలపిస్తూనే చీరాలను విడిచి వెళ్లారు. లోన్‌యాప్‌ల మాయలో పడ్డ అనేక కుటుంబాలలో విషాదాలుగానే మిగులుతున్నాయి. ఇప్పటికైనా వీటికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

రేషన్ బియ్యాన్ని దారిమళ్లిస్తే చర్యలు

పామూరు, జూలై 2: రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులపై చర్యలు తీసుకొంటామని ఆర్డీవో పాలపర్తి జాన్‌ఇర్విన్ పేర్కొన్నారు. పామూరులోని ఓ ప్రయివేట్ గోదాంలో వైసీపీ నాయకుడు అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం 220 టిక్కీలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పంచనామా నిర్వహించి ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలించారు. గోడౌన్‌లోని సరుకును ఆర్డీవో మంగళవారం లెక్కించారు. తూకాల్లో తేడాలుంటే సరిచేయాలని గోడౌన్ సిబ్బందికి ఆర్డీవో ఆదేశించారు.


మహిళలతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

టీడీపీ మహిళలను అభినందించిన మంత్రి

చీరాల, జూలై 2 : రాష్ట్రంలో సీఎం చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలని, చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎంఎం కొండయ్య గెలవాలని మొక్కుకున్న నేపథ్యంలో పలువురు చీరాల టీడీపీ మహిళలు మంగళవారం విజయవాడ కనకదుర్గమ్మ గుడికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్గమధ్యంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎమ్మెల్యే కొండయ్య స్టిక్కర్లతో కనిపించిన వాహనాలను చూచి తన కారును ఆపి అక్కడి మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారిని మంత్రి మనోహర్ అభినందించారు. అనంతరం చీరాల బయలుదేరి వచ్చారు.

ఘనంగా వీరబ్రహ్మంగారి సంబరాలు


పూజల్లో పాల్గొన్న మహేంద్రనాథ్

చీరాల, జూలై 2 :మండల పరిధిలోని బోయినవారిపాలెంలో మంగళవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చిన్న కుమారుడు మహేంద్రనాథ్ సంబరాల్లో పాల్గొన్నారు. గ్రామస్థులతో మాట్లాడారు. ఎవరికి ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తమ వంతు బాధ్యతగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో భక్తులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

ఎంఈవోకు మధ్యాహ్న భోజన సిబ్బంది వినతి



ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఆయాలు

చీరాలటౌన్, జూలై 2 : జగన్‌రెడ్డి పాలనలో పెండింగ్‌లో ఉన్న ఆరు మాసాల జీతాలను చెల్లించాలని మధ్యాహ్న భోజన ఆయాలు ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆయా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 108 ప్రకారం ఆయాలకు జీతభత్యాలు అందించాలన్నారు. ఆప్కాస్‌లో చేర్చి ఆదరించాలని కోరారు. ఏళ్లు గడుస్తున్నా ఐడీ కార్డులు, యూనిఫాం అందించడంలో వైసీపీ విఫలమైందని వివరించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బత్తుల శామ్యేల్, అచ్యుతుని బాబూరావు, సుజాత, భారతి, మేరీ కుమారి, ఇందిర ఝాన్సీ, కోటేశ్వరమ్మ, షాహీన్, ఖలీల్ బేగం, ముంతాజ్, సుజన, పలువురు ఆయాలు పాల్గొన్నారు.

నూరుశాతం పంపిణీ చేయాలి

మార్టూరు, జూలై 2 : మండలంలోని అన్నిగ్రామాలలో పింఛన్‌లను నూరుశాతం పంపిణీ చేయాలని ఆర్డీవో గంధం రవీందర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో నితిన్, రెవెన్యూ అధికారులతో ఆయన మాట్లాడారు. సోమ, మంగళవారం జరిగిన పింఛన్‌ల పంపిణీ వివరాలను ఆర్డీవో తెలుసుకున్నారు. అలాగే కౌలు రైతులకు గుర్తింపు కార్డులను పంపిణీపై తహసీల్దార్ శ్రీనును అడిగి తెలుసుకున్నారు.

పోలూరులో కౌలు రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ

యద్దనపూడి మండలంలోని పోలూరు గ్రామంలో మంగళవారం కౌలు రైతుల గుర్తింపు కార్డులను ఆర్డీవో గంధం రవీందర్ చేతులమీదగా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ రైతులతో మాట్లాడుతూ కౌలురైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలను పొందాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు వై.నాగరాజు, ఆర్ఐ విష్ణు పాల్గొన్నారు.

రేపు విద్యా సంస్థల బంద్

అద్దంకిటౌన్, జూలై 2 : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన జరిగే విద్యా సంస్థల బంద్‌ను విద్యార్థులు, కళాశాలల యాజమాన్యం సహరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం అద్దంకిలోని పలు ప్రభుత్వ ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలలను సందర్శించి ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు నోటీస్‌లను అందజేశారు. ఆయనవెంట ఎస్ఎఫ్ఐ నాయకులు బాజీ ఉన్నారు.

నేడు కానుకల లెక్కింపు

అద్దంకి, జూలై 2 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం లో హుండీల కానుకల లెక్కింపు బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని ఈవో, అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర తెలిపారు.

పర్చూరులో రోడ్లకు మహర్దశ

- అభివృద్ధికి రూ.200 కోట్లతో ప్రతిపాదనలు
- నిధులు మంజూరు చేయాలని ఆర్అండ్‌బీ మంత్రి జనార్దన్‌రెడ్డికి ఎమ్మెల్యే ఏలూరి వినతి


ఆర్అండ్‌బీ మంత్రి జనార్దన్‌రెడ్డికి వినతిని అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జూలై 2 : పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ పాలనలో రోడ్లు అధ్వానంగా మారాయి. టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో ఆ రోడ్లకు మహర్దశ పట్టనుంది. రోడ్ల మరమ్మతులపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఏలూరి మంగళవారం ఆర్అండ్‌బీ మంత్రి జనార్దన్‌రెడ్డిని కలిసి రూ.200 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్ల విస్తరణ, బీటీ రోడ్ల మరమ్మతులు, తారు రోడ్ల నిర్మాణం, జాతీయ రహదారుల నుంచి గ్రామీణ ప్రాంతాలను కలిపే లింక్ రోడ్ల ఏర్పాటుపై మంత్రికి ప్రతిపాదనలు అందజేశారు. వైసీపీ నిర్లక్ష్యం కారణంగా రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే రోడ్ల బాగుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఏలూరి విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఏలూరి తెలిపారు. అలాగే మార్టూరు, ఇంకొల్లు, చిన్నగంజాం మండల కేంద్రాలలో నూతన ఆర్అండ్‌బీ అతిథి గృహాలు నిర్మించాలని మంత్రిని ఏలూరి కోరారు. పర్చూరులో ఉన్న ఆర్అండ్‌బీ అతిథి గృహానికి మరమ్మతుల నిమిత్తం నిమిత్తం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.

అద్దంకిని ప్రకాశంలో కలపాలి

మంత్రి గొట్టిపాటికి విద్యార్థి జేఏసీ నాయకుల విజ్ఞప్తి

అద్దంకి, జూలై 2 : అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని విద్యార్థి జేఏసీ నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. అమరావతిలోని సచివాలయంలో మంగళవారం విద్యార్థి జేఏసీ నాయకులు రాయపాటి జగదీష్, కరుణాకర్, కార్తీక్, కృష్ణ, సాయి, తేజ తదితరులు మంత్రి గొట్టిపాటిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రకాశం జిల్లా అభివృద్ధి పథంలో నడిచే విధంగా చేయాలని, పరిశ్రమలను ఏర్పాటుకు కృషి చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.


మంత్రికి శుభాకాంక్షలు చెప్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

డెంగ్యూ నివారణలో భాగస్వాములు కావాలి


ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

చినగంజాం, జూలై 2 : డెంగ్యూ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, పీ.సాయిశ్రీచరణ్ పిలుపు నిచ్చారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది చినగంజాం గ్రామంలోని ప్రధాన రహదారులలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని వైద్యాధికారులు సూచించారు. శుక్రవారాలు డ్రై డేని పాటించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఝాన్సీ రాణి, సూపర్‌వైజర్లు ఎం.చిరంజీవి, ఉల్లా రాణి, పీహెచ్ఎన్ బేబి, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తం



పర్చూరు : డయేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ సుకన్య అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎక్కువ సార్లు వాంతులు, విరేచనాలు అయితే వెంటనే వైద్యుల ను సంప్రదించాలన్నారు. డయేరియా వలన మనిషి నీరసించి అపస్మారక స్థితిలోకి వెళ్లే ప్రమాదముందన్నారు. అశ్రద్ధ వహించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా, దోమలు లేకుండా చూడాలన్నారు. కాచి చల్లార్చిన నీరు, వేడి ఆహారాన్ని తీసుకోవాలని డాక్టర్ సుకన్య సూచించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఇంకొల్లు : డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండి అరికట్టేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అంజలి సూచించారు. మంగళవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, ఈగలు, చద్ది ఆహారాన్ని తినకూడదని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కోటేశ్వరరావు, పీహెచ్ఎన్ సహస్ర, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



శింగరకొండకు వచ్చిన కలవకూరు వాసులు

కాలినడకన శింగరకొండకు

అద్దంకి, జూలై 2 : టీడీపీ విజయం, ఎమ్మెల్యేగా గొట్టిపాటి గెలుపొందడంతో మంగళవారం కలవకూరు టీడీపీ శ్రేణులు మొక్కు తీర్చుకున్నారు. కలవకూరు నుంచి మాజీ సర్పంచ్ కఠారి పద్మాంజలి, టీడీపీ మండల అధ్యక్షుడు కఠారి నాగేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు శింగరకొండకు కాలినడకన వచ్చి మొక్కు తీర్చుకున్నారు.

తైక్వాండోలో సోహెల్‌కు బంగారు పతకం


బంగారు పతకం అందుకుంటున్న సోహెల్

ఈపూరుపాలెం (చీరాలటౌన్), జూలై 2 : బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ పురుగులపేటకు చెందిన షేక్ మొహమ్మద్ సోహెల్ (సోను) అంతర్జాతీయ తైక్వాండో సబ్ జూనియర్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. గత నెల 28-30 తేదీలలో యూత్ అండ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ నేపాల్ వారి ఆధ్వర్యంలో ఖాట్మండ్‌లో జరిగిన ఈ పోటీల్లో సోహెల్ ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. సోహెల్ చీరాలలోని ఓ ప్రయివేట్ స్కూల్ లో 6వ తరగతి చదువుతున్నాడు. సయ్యద్ సలావుద్దీన్, ప్రశాంత్‌బాబు కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు. చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ సోహెల్ ఉత్తమంగా రాణిస్తుంటాడని పలువురు అభినందిస్తున్నారు.


నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఎంపీడీవో మృతదేహానికి నివాళులు

చినగంజాం, జూలై 2 : వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన చినగంజాం ఎంపీడీవో యూబీ వరప్రసాద్(61) మృతదేహానికి అధికారులు, నాయకులు మంగళవారం నివాళులర్పించారు. బాపట్లలోని వరప్రసాద్ స్వగృహం వద్ద మృతదేహానికి టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, నాయకులు దేవతోటి నాగరాజు, తుమ్మలపెంట శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో, సీ.హనుమంతరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి, పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు దాసు, రాజశేఖర్, కార్తీక్, ఏపీఎం అంజిబాబు, ఏపీవో జి.లక్ష్మీదేవి, సచివాలయ ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జీవీ రాఘవరెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులు వరప్రసాద్ మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

నేడు సంతాప సభ

మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు మండల ఎంపీడీవోగా పని చేస్తూ మృతి చెందిన యూబీ వరప్రసాద్‌కు సంతాప సభను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి మంగళవారం ప్రకటనలో తెలిపారు. సంతాప సభకు ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు, మండల పరిధిలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు హాజరు కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో కోరారు.

వీధుల్లో బెంబేలెత్తిస్తున్న కుక్కలు..!

భీతిల్లుతున్న ప్రజలు

చీరాలటౌన్, జూలై 2 : చీరాల పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. వచ్చేపోయే వాహనాలు, ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయి. దీంతో వాహనదారులు, పాద చారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ఏరియా హాస్పిటల్ రోడ్డు, గ్రామీణంలో ఈపూరుపాలెం, తోటవారి పాలెం, జాతీయ రహదారిలోని ఏపి మోడల్ స్కూల్ వద్ద రాకపోకలు సాగిస్తున్న వారిపై ఒక్కసారిగా ఎగబడి దాడులకు యత్నించడం వీటికి నిత్యకృత్యంగా మారింది. ఈపూరుపాలెం ప్రధాన రహదారి, సీతారామపేట, మార్కెట్ సెంటర్‌లో మూకుమ్మడిగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులుగా మారుస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో నిత్యం ప్రజలు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈనేపథ్యంలో ఒక్కసారిగా వారిపై అమాంతంగా ఎగబడుతుండటంతో వాహనాలు పట్టుతప్పుతున్నాయి. విద్యార్థినీ, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. అంతేకాకుండా సుమారు 200 మీటర్లు మేర వాహనాలపై వెంటబడుతూ మొరాయిస్తున్నాయి. ఈక్రమంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. చిన్నారులు ట్యూషన్, పాఠశాలల నుంచి రాకపోకలు జరపాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే చీరాల ఏరియా వైద్యశాల రోడ్డులో కూడా నిత్యం వీధి కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. అధికారులు తమ గోడు పట్టించుకోవాలని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.


వాహన దారులను అడ్డగిస్తున్న వీధి కుక్కలు

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం



వీధి కుక్కల బెడద తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాము. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం. అలాగే సంతానం వృద్ధి కాకుండా పంచాయతీ అధికారులకు ముఖ్య సూచికలు జారీ చేస్తాం. వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం.

- శోభారాణి, ఎంపీడీవో చీరాల మండలం



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 2 : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య వైద్యులకు సూచించారు. ఐఎంఏ హాలులో డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు కనిపించే దైవాలన్నారు. వారు అంకితభావంతో పనిచేస్తేనే ప్రజల రుగ్మతలు తీరుతాయన్నారు. వైద్యులకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని చెప్పారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఐఎంఏ శాఖ బాధ్యులు డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ పేట శ్రీకాంత్ ఇతర వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత


విద్యార్థులకు నోట్స్‌లను అందజేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 2: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని రామాయపాలెం ప్రాథమిక పాఠశాలకు కుర్చీలు, విద్యార్థులకు నోట్ బుక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి కుమారుడు చక్రధర్ పుట్టిన రోజు సందర్భంగా వారి సహకారంతో పాఠశాలకు కుర్చీలు, రాత పుస్తకాలు, కలాలు, టీఎల్ఎం మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పుట్టంరాజు అందిస్తున్న చేయూతను పలువురు అభినందించారు. విద్యర్థులు చదువుతో పాటు మంచి అలవాట్లు నేర్చుకోవాలని, తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. అనంతరం దాత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, భార్య శైలజ దంపతులను రోటరీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు సత్కరించారు. హెచ్ఎం మలాది నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, మలాది శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ, సందిరెడ్డి శ్రీనివాసరావు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

99 శాతం పింఛన్ల పంపిణీ


పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి, సర్పంచ్

పంగులూరు, జూలై 2 : మండల పరధిలోని 21 గ్రామ పంచాయతీలలో 99 శాతం పింఛన్‌లను పంపిణీ చేశారు. మొత్తం 7,988 మందికి మంజూరుకాగా మంగళవారం సాయంత్రానికి 7,884 మందికి పింఛన్లను పంపిణీ చేశారు. రేణంగివరం గ్రామంలో 400 మందికి అందచేశారు. చిలకలూరిపేట ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న బీరంగుంట రంజాన్‌బీకి వెటర్నరీ అసిస్టెంట్ రాధిక, సర్పంచ్ నజీరున్ దంపతులు పింఛన్ అందించారు. ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న పంగులూరు మహిళకు, అద్దంకి చెవిటి, మూగ పాఠశాలలో ఉన్న భగవాన్‌రాజుపాలెం విద్యార్థికి సచివాలయ ఉద్యోగులు మంగళవారం పింఛన్ అందచేశారు. మిగిలి ఉన్న 104 మందిలో కొంతమంది మరణించిన వారు ఉన్నట్లు సమాచారం. లక్ష్యం మేరకు పింఛన్‌లు పంపిణీ చేసిన సిబ్బందిని అధికారులు అభినందించారు.

కార్యకర్త మృతికి ఏలూరి సంతాపం

మార్టూరు, జూలై 2 : మండలంలోని వలపర్ల గ్రామంలో పార్టీ కార్యకర్త జొన్నలగడ్డ రాజారత్నం (50) మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అతని మంగళవారం ప్రకటనలో సంతాపం తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో టీడీపీ కార్యకర్త రాజారత్నం గుండెపోటుతో మృతిచెందారు. దీనిపై ఏలూరి ఆ కుటుంబానికి ప్రగాఢసానుభూతిని తెలియచేశారు. ఆర్థిక సాయాన్ని గోనుగుంట్ల లీలా కృష్ణమూర్తి ద్వారా అందచేశారు. అనంతరం గ్రామంలోని టీడీపీ నాయకులు అతని మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంభంపాటి హనుమంతరావు, గుంటి వెంకటేశ్వర్లు, బూరగ వీరయ్య, బషీర్, వెలగా రామాంజనేయులు పాల్గొన్నారు.

రోటరీ అధ్యక్షునిగా కృష్ణమోహన్


రోటరీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణమోహన్

పర్చూరు, జూలై 2 : పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షునిగా పర్చూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన తోకల కృష్ణమోహన్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం రాత్రి రోటరీ భవనంలో ప్రస్తుత అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు అధ్యక్షతన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కార్యదర్శిగా కోమటి ఆంజనేయులు, కోశాధికారిగా పంబి సదానందరెడ్డి బాధ్యతలు చేపట్టారు. నూతన కమిటీ సభ్యులకు రోటరీ ప్రతినిధులు పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జాష్టి రంగారావు, రోటరీ ప్రముఖులు అన్నె రత్నప్రభాకర్, హరిహరప్రసాద్, ఎల్.రఘురామిరెడ్డి, దినేష్ రెడ్డి, ధినేష్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి విరాళం


విరాళాన్ని అందజేస్తున్న వేణు

పర్చూరు, జూలై 2 : పర్చూరు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి గ్రామానికి చెందిన ఆకుల వేణు, శాంతి దంపతులు మంగళవారం రూ.50 వేల విరాళాన్ని కమిటీ ప్రతినిధులకు అందజేశారు. శ్మశాన వాటికలో కనీస వసతులు లేకపోవడంతో దాతల సహాయంతో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. కార్యక్రమంలో కఠారి సురేంద్రబాబు, ఒగ్గిశెట్టి నరసింహం, మంగళగిరి కోటేశ్వరరావు, క్రిష్ణంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంతకంటే ఇంకేం కావాలయ్యా!

- ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచాడు
- పెద్ద కొడుకులా మమ్మల్ని చంద్రబాబు ఆదుకుంటున్నాడు
- 'ఆంధ్రజ్యోతి'తో పలువురు పింఛనుదారులు

'ఇంత పెద్ద మొత్తంలో పింఛను డబ్బు తీసుకోవడం చాలా ఆనందంగా ఉందయ్యా. వైద్యం, ఇతర ఖర్చులకు సరిపోతాయి. పెద్ద కొడుకులా చంద్రబాబు మమ్మల్ని ఆదుకున్నాడు. ఇంతకంటే ఇంకేం కావాలి. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం' అంటూ పింఛనుదారులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. 1వ తేదీ సోమవారం రోజు తొంబై శాతం మందికిపైగా పింఛను సొమ్ము అందజేయగా, మంగళవారం మిగిలిన వారికి సచివాలయ సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా పింఛను నగదు అందుకున్న లబ్ధిదారులు ఆంధ్రజ్యోతితో తమ మనోభావాలు పంచుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



ఈ చిత్రంలోని వృద్ధురాలు మధిర రమణమ్మ, మరో వృద్ధుడు జక్కల రత్నం. పొదలకూరులోని రామమం దిరం వద్ద నివసిస్తున్నారు. జక్కల రత్నం అవివాహితుడు. అక్క మధిర రమణమ్మతో కలిసి ఉంటున్నాడు. పెద్ద కుమారుడిలా సీఎం చంద్రబాబు పింఛను సొమ్ము ఒక్కొక్కరికి రూ.7వేలు అందజేశాడంటూ వారిద్దరూ ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ఈ నగదుతో నెలంతా హాయి గా గడిచిపోతుంది. చంద్రన్న చల్లని చూపుతో మేము హాయిగా కాలం వెళ్లదీస్తాం. మంచి ఆహారం, మందుల కొనుగోలుకు ఇబ్బందులు ఉండవు. అంటూ చెప్పుకొచ్చారు.



ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు..

సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తొలినెలలోనే పెండింగ్‌తో కలిపి రూ. 7వేలు పింఛన్ ఇచ్చారు. వీటితోపాటు రూపాయి బియ్యంతో మాకుటుంబ పోషణ సాగిపోతుంది. జగన్‌రెడ్డి అరాచకాలకు ప్రజలు స్వస్తి పలికి చంద్రబాబుకు పట్టంకట్టారు. ఆయన పాలనలో రాష్ట్రం బాగా అభివృద్ధి చెందుతుందని నమ్ముతున్నా.

- ఓలేటి సుబ్బయ్య, పెనుబల్లి, బుచ్చి మండలం



బాధలు అర్థం చేసుకున్న చంద్రన్న

మా బాధలను సీఎం చంద్రబాబు నాయుడు అర్థం చేసుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛను డబ్బు రూ.7 వేలు అందజేయడం సంతోషంగా ఉంది. నెలవారి మందులు, ఇతరత్రా ఖర్చులకు పింఛన్ సొమ్మే ఆధారం. నిరాధరణకు గురవుతున్న వారి పట్ల నిరంతరం పనిచేస్తూ పేదల పక్షపాతి అని మరోసారి చంద్రన్న నిరూపించుకున్నారు.

- గోపిదేశి వెంకటసుబ్బయ్య, దాసరిపల్లి, ఉదయగిరి



తిరుపతిలో ఆసుపత్రికి వచ్చి..

ఆరోగ్యం బాగోలేక కొన్నిరోజుల కిందట తిరుపతిలోని రూయా ఆసుపత్రిలో చేరాను. సచివాలయ సర్వేయర్ విజయ్ మంగళవారం తిరుపతికి వచ్చి నాకు రూ.6వేల పింఛన్ నగదు అందజేశారు. నమ్మలేక పోతున్నా. ఆపదలో తనను టీడీపీ ప్రభుత్వం ఆదుకోవడం సంతోషంగా ఉంది.

- కమతం బాబు, అనంతసాగరం



ఊహించలేకపోయా!

అనారోగ్యంతో పది రోజులుగా నారాయణ వైద్యశాలలో చికిత్స పొందుతున్నా. చేతిలో చిల్లిగవ్వలేదు. సీఎం చంద్రబాబునాయుడు పెంచిన పింఛన్ రూ.7వేలు ఇస్తున్నారని తెలిసింది. కానీ ఇంటికి వెళ్లలేని పరిస్థితి. టీడీపీ నాయకులు, బూత్ ఇన్‌చార్జ్ పోతకమూరి నరహింహారావు, సచివాలయ సిబ్బంది ఖాజా మస్తాన్‌ను వెంట పెట్టుకుని వైద్యశాలకు వచ్చి నాకు రూ.7 వేలు ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది. అసలు ఈ నెలలో పింఛన్ తీసుకుంటానని ఊహించలేదు. ఆపదలో ఉన్న నాకు చంద్రన్న ఇంటి పెద్ద కొడుకులా ఆదుకున్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటా.


- పర్వతాల పద్మ, జండాదిబ్బ, సంగం



నా జీవనానికి ఇది చాలు

70 ఏళ్ల వయసులో ఒంటరిగా ఉంటున్నా. నా జీవనానికి నెలకి రూ.4 వేలు చాలు. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం పెంచిన పింఛనుతోపాటు రూ.7 వేలు ఇచ్చింది. ఇంత మొత్తంగా పింఛను వస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు. ఒంటరిగా ఉన్న నాకు ప్రతినెలా రూ.4 వేలు పింఛను వస్తుందనే ధైర్యం వచ్చింది. చంద్రబాబు నాయుడు ఒక ముఖ్యమంత్రిగా కాదు... నా కుటుంబ సభ్యుడిగా ప్రతి నెలా కొడుకు ఇచ్చినట్టుగా నాకు డబ్బులు ఇచ్చి నన్ను ఆదుకుంటున్నట్టుగానే ఉంది.

- కోడి వెంకమ్మ, అల్లూరు



నిద్రలేపి ఇచ్చారయ్యా!

నేను దివ్యాంగుడిని. సచివాలయ సిబ్బంది నిన్న ఉదయాన్నే నిద్ర లేపి రూ.6వేలు పింఛన్ ఇచ్చారు. ఎంతో సంతోషమేసింది. చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్‌ను ఇంటి వద్దకే వచ్చి ఇవ్వడం గొప్ప విషయం. వలంటీర్ల ప్రమేయం లేకుండా సచివాలయ, పంచాయతీ సిబ్బందితో పింఛన్లు ఇంటికే చేర్చడం ఆనందం కలిగిస్తోంది. చంద్రబాబు రాష్ట్రానికి శాశ్వత సీఎంగా కొనసాగుతారు.

- తిరుదాకుల విజయకుమార్, కోవూరు



వైద్య ఖర్చులకు ఊతం

నా వైద్యఖర్చులకు ఊతం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా పింఛను అందింది. ఉదయాన్నే పింఛను రావడం సంతోషం కలిగించింది. మా అంగన్‌వాడీ కార్యకర్త నిద్రలేపి పింఛను ఇచ్చారు. నేను ఆశ్చర్యపోయా. అంత ఉదయాన్నే పింఛను పంపిణీకి చర్యలు తీసుకొన్న చంద్రబాబు పట్టుదలకు జై కొడుతున్నా.

- బొప్పూరు నాగేశ్వరరావు, విడవలూరు




పింఛన్ పెంచిన దేవుడాయన

మాలాంటోళ్ల బాధలు చూసి రూ.3 వేలు వచ్చే పింఛన్‌ను సీఎం చంద్రబాబు రూ.6వేలు చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇంతకుముందు రూ.3వేలే కదా ఇచ్చేది. రెండు నెలల డబ్బు ఒకసారి వస్తే కూరాకు, మాత్రలు, పిల్లకాయల ఖర్చులకు పనికొచ్చేయి. టీవీల్లో చెప్పినట్టే రూ. 6వేలు ఇస్తానన్నాడు. చెప్పినట్టే ఇచ్చాడు. ఆ దేవుడు ఇచ్చింది చాలు మాకు..!

- అద్దూరు రవి, దివ్యాంగుడు, కాగితాలపూరు, మనుబోలు

నూతన కలెక్టర్ ఆనంద్

- గతంలో గూడూరు సబ్ కలెక్టర్‌గా విధులు
- హరినారాయణన్ బదిలీ



నూతన కలెక్టర్ ఆనంద్

నెల్లూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నూతన కలెక్టర్‌గా ఓ ఆనంద్ నియమితులయ్యారు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం విశాఖపట్నంలో కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ప్రస్తుతం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం హరినారాయణన్‌ను బదిలీ చేస్తూ ఆయన స్థానంలో ఆనంద్‌ను నియమించింది. కేరళ రాష్ట్రానికి చెందిన ఆనంద్ ఇంజనీరింగ్ పట్టభద్రులు. పేద కుటుంబం నుంచి ఉన్నతస్థాయికి ఎదిగిన అధికారి. 2016 బ్యాచ్‌లో కేరళ నుంచి టాపర్‌గా నిలిచారు. తూర్పుగోదావరి జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత తొలి పోస్టింగ్‌ను గూడూరు సబ్ కలెక్టర్‌గా పొందారు. 2018-19 మధ్య కాలంలో గూడూరులో సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికల సమయంలో గూడూరు నియోజకవర్గ ఆర్‌వోగా సమర్థవంతంగా పని చేశారు. అనంతరం పలు చోట్ల విధులు నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, పార్వతీపురం ఐటీడీఏ పీవోగా పనిచేశారు. జిల్లాలోని భౌగోళిక పరిస్థితులపై నూతన కలెక్టర్‌కు అవగాహన ఉంది. కాగా, ఇప్పటి వరకూ పనిచేస్తున్న హరినారాయణన్ గతేడాది ఏప్రిల్‌లో కలెక్టర్‌గా జిల్లాలో బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

నడిరోడ్డుపై హాహాకారాలు



ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థులు

"అమ్మా.. వెళ్లొస్తా.."నంటూ టాటా చెప్పి స్కూలు బస్సు ఎక్కిన చిన్నారులు నిమిషాల వ్యవధిలోనే ప్రమాదం బారిన పడ్డారు. బిడ్డలు ఎక్కిన బస్సు బోల్తా పడిందని తెలుసుకుని కన్నపేగు తల్లడిల్లిపోయింది. చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుంటూ దుఃఖాన్ని దిగమింగుకుని పరుగున ఆసుపత్రులకు చేరారు. రక్తగాయాలతో మంచాలపై పడుకొని ఉన్న పిల్లల్ని చూసి కన్నీటిని ఆపుకోలేకపోయారు. ఇళ్ల వద్ద బయలుదేరిన బస్సు హైవేపై మలుపు తిరిగే క్రమంలో డివైడర్ మధ్యలో ఆగింది. అంతే వెనుక నుంచి ఓ మినీలారీ వేగంగా దూసుకొచ్చి బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు విద్యార్థులు గాయపడ్డారు. మంగళవారం ఉదయం కావలి సమీపంలో జరిగిన ఈ ప్రమాదం సంచలనంగా మారింది.



రోడ్డుపై క్లీనర్ చిన్నకొండయ్య మృతదేహం



మృతుడు చిన్న కొండయ్య (ఫైల్)

- హైవేపై మలుపు తిరుగుతున్న స్కూలు బస్సును ఢీకొన్న మినీలారీ
- రోడ్డుపైనే బోల్తా పడిన బస్సు
- ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో తప్పిన ఘోరం
- క్లీనర్ మృతి, పలువురు విద్యార్థులకు గాయాలు
- ఓ విద్యార్థి చెన్నైకి తరలింపు
- ప్రమాద విషయం తెలుసుకుని తల్లిదండ్రుల ఆందోళన



ప్రమాదానికి గురైన స్కూల్ బస్



ప్రమాదానికి కారణమైన మినీ లారీ

కావలి రూరల్, జూలై 2 : కావలి పట్టణం ముసునూరు టోల్‌ప్లాజా వద్ద మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్ నడుస్తోంది. మంగళవారం ఉదయం కావలిలోని పుల్లారెడ్డి నగర్, రామ్మూర్తిపేటకు చెందిన 29 మంది విద్యార్థులతో స్కూలు బస్సు బయలు దేరింది. టోల్‌గేట్ దాటాక స్కూల్ వైపు వెళ్లేందుకు జాతీయ రహదారి డివైడర్ దాటే క్రమంలో అవతల మార్గంలో ఎదురుగా ఓ లారీ రావటంతో డివైడర్ మధ్యలోనే డ్రైవర్ బస్సును ఆపేశాడు. అయితే, అదే సమయంలో ఓ మినీ లారీ వేగంగా వస్తూ వెనుకవైపు నుంచి స్కూలు బస్సును ఢీకొంది. దీంతో డివైడర్ మధ్యలో బస్సు బోల్తా పడటంతో డోర్‌లో నిలబడి ఉన్న క్లీనర్ దేవరాల చినకొండయ్య (72) బస్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇక బస్సులో ఉన్న విద్యార్థులు భయంతో కేకలు వేయడంతో వాహన చోదకులు, స్థానికులు హుటాహుటిన అక్కడకు చేరుకుని అందరినీ బయటకు తీశారు. బోల్తాపడిన బస్‌ను పైకి లేపారు. బస్సులో ఉన్న 29 మంది చిన్నారులను అదే పాఠశాలకు చెందిన బస్సులలో కావలిలోని రెండు ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు.

● 19 మందికి గాయాలు

విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనతో ఆసుపత్రులకు పరుగులు తీశారు. గాయాలతో చిన్నారుల ఏడుపులు, తల్లిదండ్రుల రోదనలతో ఆసుపత్రుల ప్రాంగణం గందరగోళంగా మారింది. పది మంది విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఇళ్లకు పంపారు. మరో 10 మందికి స్వల్పగాయాలవగా, మరో 9 మందికి మోస్తరు గాయాలు అయ్యాయి. వీరిలో అఖిలేష్ రెడ్డి అనే విద్యార్థిని మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. మృతుడి కుమారుడు దేవరాల వెంకయ్య ఫిర్యాదు మేరకు కావలి రూరల్ ఇన్‌చార్జి సీఐ కొండవీటి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రమాదం విషయం తెలిసిన వెంటనే జేసీ సేతుమాధవన్, ట్రాన్స్‌పోర్టు కమిషనర్ చంద్ర, అదనపు ఎస్పీ సౌజన్యలతో పాటు ఆర్డీవో వై.సుధాకర్ రెడ్డి, ఎంపీడీఓలు సుందర్‌రావు, కరుణాకర్, తహసీల్దారు నగేష్ తదితరులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. స్కూలు బస్సు 24 సీట్లకు మాత్రమే పరిమితి ఉండగా 29 మందిని తీసుకువెళ్తూ ప్రమాదానికి గురైనట్లు రవాణాశాఖ అధికారులు గుర్తించారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులను జేసీ, ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి, ఆర్డీవో శీనా నాయక్ పరామర్శించారు.

● కాగా, ఈ ఘటనపై నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే నెల్లూరు పార్లమెంట్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ కూడా బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మరో ప్రకటనలో తెలియచేశారు.



బాలుడితో మాట్లాడుతున్న జేసీ, ఆర్డీవో

అడ్డదారులతో ప్రమాదంలోకి నెట్టి!

కావలి : తమ పాఠశాలకు సమీప మార్గంలో వాహనాలు ప్రవేశించేందుకు ఏర్పాటు చేసుకున్న అడ్డదారే పిల్లల్ని ప్రమాదానికి గురి చేసింది. జాతీయ రహదారి మధ్యలో డివైడర్‌ను పగలకొట్టి అనధికారికంగా రోడ్డు క్రాసింగ్ ఏర్పాటు చేసుకున్నారు. దీనివలన ప్రమాదాలు జరుగుతాయని తెలిసినా అధికారులు పట్టించుకోలేదు. ఇది అనధికార దారి కావడంతో హైవేపై ఎలాంటి సూచిక బోర్డులు లేవు. వాహనాలు వేగంగా వస్తూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా గడిచిన పదేళ్ల ప్రతాప్‌కుమార్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉండటంతో అధికారులు కూడా నోరు మెదపలేదు.

● సిద్ధం సభకూ అంతే..

అలాగే సార్వత్రిక ఎన్నికలకు ముందు కావలి మద్దూరుపాడు బైపాస్‌రోడ్డు సమీపంలో జరిగిన 'సిద్ధం' సభకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ వచ్చారు. అప్పుడు కూడా జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను వైసీపీ నాయకులు పగలకొట్టి అనధికారికంగా దారి ఏర్పాటు చేసుకున్నారు. ఆ సభ అయిపోయి నెలలు గడిచినా, రాష్ట్రంలో ప్రభుత్వం మారినా డివైడర్ మధ్యలో ఉన్న దారిని మాత్రం మూయించలేదు. హైవేపై అనధికార మలుపులు తెలియక వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతా తెలిసి కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అనధికార మలుపు వద్ద మంగళవారం ఉదయం స్కూల్ బస్సు డివైడర్ దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన మినీ లారీ ఢీకొట్టింది. అదృష్టవశాత్తు బస్సు బోల్తా పడిన సమయంలో అటువైపు వాహనాలు ఏవీ రాకపోవడంతో ఘోరం తప్పింది. ఇప్పటికైనా హైవే అధికారులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జాతీయరహదారిపై అక్రమంగా ఏర్పాటు చేసిన దారులను మూసివేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

దారులు మూయమని లేఖ రాశాం

స్కూల్ బస్సు ప్రమాదానికి గురైన వెంటనే ముసునూరు, మద్దూరుపాడుల వద్ద డివైడర్‌లను పగలకొట్టి ఏర్పాటు చేసిన దారులు మూసివేయమని నేషనల్ హైవే పీడీకి లేఖ రాశాం. అప్పటి వరకు అక్కడ డివైడర్ మధ్యలో ట్రాఫిక్ స్టాపర్లను అడ్డుగా పెట్టాం. త్వరలో ఈ రెండుదారులు మూయిస్తాం.

- శీనానాయక్, కావలి ఆర్డీవో



హైవేపై డివైడర్‌ను తొలగించి ఆర్ఎస్సార్ స్కూల్లోకి ఏర్పాటు చేసిన ప్రవేశ మార్గం

రామలింగేశ్వరుడికి నందివాహన సేవ

- రామతీర్థం, దండిగుంట గ్రామాల్లో గ్రామోత్సవం



విడవలూరు, జూలై 2: రామతీర్థం బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి మహాశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన నందివాహన సేవను వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి శ్రీకాంత్‌శర్మ స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహవచన, మహాన్యాస రుద్రాభిషేకాలు, కుంకుమార్చనలు, నివేదన, బలిహరణ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం దండిగుంట గ్రామంలో స్వామివారికి గిన్నెభిక్ష కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి స్వామివారిని వివిధ రకాల పూలతో అలంక రించిన నంది వాహనంపై ఆశీనులను చేశారు. అనంతరం రామతీర్థం, దండిగుంట గ్రామాల్లో ఊరేగించారు.

● 13 ఏళ్లుగా స్వామివారి సేవలో..

రామచంద్రాపురానికి చెందిన బుచ్చింగారి తిరుపతి, ఆదిశేషమ్మ కుటుంబ సభ్యులు గత 13 ఏళ్లుగా స్వామి, అమ్మవార్లకి పూలంగిసేవ నిర్వహిస్తున్నారు. కర్ణాటకలోని మైసూర్, ఊటీల నుంచి ప్రత్యేకంగా పూలను తీసుకువచ్చి ఆలయ ముఖద్వారాన్ని, నందీశ్వరుడిని సుందరంగా అలకరింప చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామకృష్ణ, గుమస్తా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- 1, 2 తేదీల్లోనే జీతాలు, పెన్షన్లు
- ఆనందంలో ఉద్యోగులు, పెన్షనర్లు

నెల్లూరు (హరనాథపురం), జూలై 2 : రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఎన్డీఏ ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం 1, 2వ తేదీలకల్లా ఉద్యోగులు, పెన్షనర్ల ఖాతాల్లో వేతనాలు జమ చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ప్రభుత్వం ఉద్యోగుల జీతాల చెల్లింపులకు ప్రాధాన్య ఇచ్చింది. నిధులను సర్దుబాటు చేసి రెండో తేదీ సాయంత్రంలోగా జీతాలు, పెన్షన్ల చెల్లింపులకు పూనుకొంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జీతాలు, పెన్షన్ల కోసం ఉద్యోగులు, పెన్షనర్లు ఎదురుచూసేవారు. నెల మొదలై రెండు వారాలు గడిచినా చాలామంది ఖాతాల్లో వేతన సొమ్ము జమ అయ్యేది కాదు. దీంతో ఉద్యోగులు, పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులు పడేవారు. తెలుగుదేశం అధికారం చేపట్టిన తరువాత ప్రతినెలా ఒకటవ తేదీన జీతాలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఆర్థిక శాఖ నిధుల కొరత వల్ల రెండో తేదీన జీతాలు చెల్లిస్తామని ప్రకటించింది. చంద్రబాబు సూచనలతో ఒకటో తేదీన కొందరికి, 2వ తేదీన మిగిలిన వారికి జీతాలు చెల్లించారు. చంద్రబాబు సూచనలతో ఇకపై ప్రతి నెలా 30, 31 తేదీలలో జీతాలు ఉద్యోగుల అకౌంట్లలో జమ కానున్నాయి. కాగా, జిల్లాలో 25 వేల మంది ఉద్యోగులు ఉండగా ప్రతినెలా రూ.300 కోట్ల మేర జీతాలు చెల్లిస్తున్నారు. అలాగే, 20వేల మంది పెన్షనర్లు ఉండగా, రూ.200 కోట్లను పెన్షన్‌గా చెల్లిస్తున్నారు.

సచివాలయంలో చిత్రపటాల ఏర్పాటు



చిత్రపటాలు ఆవిష్కరించిన టీడీపీ నాయకులు

వరికుంటపాడు, జూలై 2: గణేశ్వరాపురం సచివాలయంలో మంగళవారం టీడీపీ యువ నాయకులు పేరం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఫొటోలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు బాధ్యతలు చేపట్టిన వెంటనే ఐదు ప్రధానాంశాలపై సంతకాలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సింగంరెడ్డి వీరరాఘవరెడ్డి, గంటా ఖాజావలి పాల్గొన్నారు.

ఏపీసీ పాఠశాలల ఆకస్మిక తనిఖీ



ఆహారాన్ని పరిశీలిస్తున్న ఏపీసీ ఉషారాణి

అనంతసాగరం, జూలై 2: గౌరవరం ప్రాథమికోన్నత, అనంతసాగరం, కామిరెడ్డిపాడు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను మంగళవారం సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఉషారాణి ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, ఆహారాన్ని పరిశీలించారు. నాడు-నేడు పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-1 జానకీరాం ఉన్నారు.

ఉదయగిరి: స్థానిక ప్రైవేటు పాఠశాలలను మంగళవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం హోంవర్క్ పుస్త కాలను ముద్రించి విక్రయిం చరాదన్నారు.

మండలంలోని పలు ప్రాంతాల్లో అటవీ, రెవెన్యూ భూముల్లో లభించే తెల్లరాయిని అక్రమంగా తవ్వి ఎల్లలు దాటిస్తున్నారు. లారీల్లో చెన్నైకి, అక్కడి నుంచి విదేశాలకు యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతోంది. పెద్దఎత్తున ప్రభుత్వ ఖజానాకి గండి కొడుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.



పోలినేనిచెరువులో అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న తెల్లరాయి

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఎల్లలు దాటుతున్న తెల్లరాయి!

- యథేచ్ఛగా అక్రమ రవాణా
- లారీల ద్వారా చెన్నైకి.. అక్కడి నుంచి విదేశాలకు..
- ప్రభుత్వ ఖజానాకు గండి.. పట్టించుకోని అధికారులు

వలేటివారిపాలెం, జూలై 2 : మండలంలోని పోలినేనిచెరువు, వలేటివారిపాలెం, చుండి, అయ్యవారిపల్లె, మాలకొండ, గరుకుపాలెం, అంకభూపాలపురం గ్రామాలలోని అటవీ, రెవెన్యూ భూముల్లో తెల్లరాయి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతోన్నాయి. అటవీ, రెవెన్యూ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా తెల్లరాయి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. నిత్యం టన్నుల కొద్దీ తెల్లరాయి తరలిపోతోంది. దీంతో ప్రభుత్వానికి రాయిల్టీ ఇతరత్రా రూపాల్లో రావల్సిన ఆదాయానికి గండి పడుతోంది. అక్రమార్కులు మాత్రం దండిగా సంపాదించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తి కూడా చూడక పోవడం వెనుక ముడుపులు ముట్టాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● ప్రభుత్వ ఆదాయానికి గండి

గత కొన్నేళుగా ఆయా గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న తెల్లరాయి వ్యాపారంతో ప్రభుత్వానికి గండి పడుతోంది. ఒక్కో లారీ తెల్లరాయి లక్షన్నర నుంచి 2 లక్షలు వరకు నాణ్యతను బట్టి ధర ఉంది. ఇలా వారానికి పదుల సంఖ్యలో తెల్లరాయి లారీలు, టిప్పర్ల ద్వారా రాత్రిళ్లు ఎల్లలు దాటిస్తున్నారు. మరికొన్ని చోట్ల తెల్లరాయి గుండ్లను ఎక్సకవేటర్లతో పెకిలించి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా రహస్య ప్రాంతానికి తరలించి అక్కడ చిన్న చిన్న సైజులుగా పగలగొట్టి లారీల ద్వారా తరలిస్తున్నారు. అటవీ, రెవెన్యూ భూములో, కొన్ని చోట్ల పట్టా భూములు, అసైన్‌మెంటు భూముల్లో లబ్ధిదారులకు తులమో, ఫలమో ముట్టజెప్పి తెల్లరాయి తవ్వకాలు చేస్తున్నారు.

● దాడులు శూన్యం

తెల్లరాయి తవ్వకాలు విచ్చలవిడిగా సాగుతున్నా అధికారులు దాడులు చేపట్టిన దాఖలాలు లేవు. అసైన్డ్‌భూముల్లో జరుగుతున్న తవ్వకాలు వలన భూములు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. సంబంధిత అధికారులకు తెలిసిన, ప్రజలు సమచారం ఇస్తున్నా వారు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు.

● అనుమతులు నిల్

ఎక్కడైనా తెల్లరాయి తవ్వకాలు జరపాలంటే రెవెన్యూశాఖకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. అనుమతులు పొందిన తరువాతనే తవ్వకాలు జరపాలి. అలాగే కూలీలకు లేబర్ చట్టం కింద కనీసం వేతనం చెల్లించడం తోపాటు 8 గంటలు పనిచేయించాలి. పనిచేసే చోట అన్ని సౌకర్యాలు కల్పించాలి. సేకరించిన తెల్లరాయిని తరలించాలన్నా అనుమతి తప్పనిసరి. ఇలాంటిదేమీ లేకుండా తెల్లరాయిని అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ తెల్లరాయి తవ్వకాలు నిలిపివేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్కూల్ బస్సు ప్రమాదం మనస్సు కలిచివేసింది

- ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి
- మృతుడి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం



విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జూలై 2: స్కూల్ బస్సు ప్రమాదానికి గురై చిన్నారులు గాయపడి బస్సు క్లీనర్ మృతి చెందిన సంఘటన తన మనస్సును కలిచి వేసిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆర్‌ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు మంగళవారం ఉదయం ప్రమాదానికి గురై వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న చిన్నారులను ఎమ్మెల్యే పరామర్శించి వారి తల్లిదండ్రులను ఓదార్చి మనోధైర్యం నింపారు. అలాగే డాక్టర్లను అడిగి చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన బస్సు క్లీనర్ చినకొండయ్య మృతదేహం కావలి ఏరియా వైద్యశాల మార్చురీలో ఉండటంతో అక్కడకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి రూ.50వేలు ఆర్థికసాయం ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ రహదారుల అధికారుల అలసత్వం, స్కూల్ యాజమాన్యం అనాలోచిత చర్యలతో డివైడర్‌లను పగుల కొట్టి దారి ఏర్పరుచుకోవటం వలన ఈ ప్రమాదం జరిగిందన్నారు. స్కూల్ యాజమాన్యం ఈ ప్రమాదానికి బాధ్యత వహించి చిన్నారుల వైద్య ఖర్చులను భరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ నగేష్, నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి

ముసునూరు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం జరిగిన ఆర్‌ఎస్సార్ స్కూల్ బస్సు ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరువాది భాస్కర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డివైడర్‌ను పగులకొట్టి దారి ఏర్పాటుకు కారకులైన నేషనల్ హైవే, స్కూల్ యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. ప్రమాదంలో మృతి చెందిన బస్సు క్లీనర్ చిన కొండయ్యకు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ అనధికార దారిని మూసి వేయాలని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



మొక్కలు నాటుతున్న బీజేపీ పట్టణాధ్యక్షుడు కరటంపాటి సుధాకర్

ఆత్మకూరు, జూలై 2: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు అమ్మకు ఒక మొక్క అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పార్టీ శేణులు పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహేశ్వరరెడ్డి, సమసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ ఏలూరు రామ్‌ప్రసాద్, జేపీ నేతలు వాయగుండ్ల ఉమా మహేశ్వరరావు, బాబురావు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ

సంగం, జూలై 2: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారి అశోక్ ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణ మాసోత్సవం సందర్భంగా మంగళవారం డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఫ్లెక్సీ చేతపట్టి డబ్బాలు, ప్లాస్టిక్, టైర్లపై నీటి నిల్వలను తొలిగిందాం, దోమలను అరికడదాం, డెంగ్యూ వ్యాధిని నివారిద్దాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సంగం, జూలై 2: అనసూయనగర్ సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం ఉదయం సెబ్ అధికారులు గుర్తించారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో వారు ఇసుక రీచ్ వద్దకు బయలుదేరగా దువ్వూరు మీదుగా బుచ్చిరెడ్డిపాళెంకు ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఎదురుపడింది. ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

అమర సైనికులకు నివాళి

ఆత్మకూరు, జూలై 2: భారత్, చైనా సరిహద్దులోని లడఖ్ ప్రాంతంలో ప్రమావశాత్తు అమరులైన భారతీయ సైనికులకు నివాళులర్పిస్తూ మంగళవారం రాత్రి ఆత్మకూరులో బీజేవైఎం నాయకులు కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక సత్రం సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఈ ర్యాలీని కొనసాగించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు చింతలపల్లి భరత్‌రెడ్డి, అల్లంపాటి సాంబశిరెడ్డి, జిల్లా నాయకులు తిరుమలనాయుడు, సుధాకర్, ఆళ్ల మధుసూధన్, కొల్లి మాధవనాయుడు, కాటా మహేశ్వరరెడ్డి, వాశిపల్లి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో 3 ఆవుల మృతి

కలువాయి, జూలై 2: కుల్లూరులో మంగళవారం ఉదయం విద్యుదాఘాతానికి గురై మూడు ఆవులు మృతి చెందాయి. గ్రామంలోని వెంకయ్యస్వామి ఆలయం సమీపంలో సోమవారం రాత్రి గాలులకు విద్యుత్ తీగ తెగిపడ్డాయి. ఉదయం అక్కడకు వెళ్లిన ఆవులు విద్యుత్ తీగ తగిలి చనిపోయాయి. ఈ సంఘటనపై బాధిత రైతులు విద్యుత్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

సీతారామపురం, జూలై 2: అనారోగ్యంతో మంచానికే పరిమితం అయిన పొలంగారిపల్లి చిట్టిబోయిన చెన్నయ్య కుటుంబానికి జనసేన నాయకులు పెనుబడి రాఘురాములు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ భోగినేని కాశీరావులు చేయూతనిచ్చారు. మంగళవారం వారు రెండునెలలకు కుటుంబ పోషణకు సరుకులు అందజేశారు.

పూడిక తీయండి సారూ..

ఉదయగిరి రూరల్, జూలై 2: పట్టణంలోని అగ్రహారంవీధి మురుగు కాలువలు పూడికతో నిండి మురుగునీరు పారే అవకాశం లేక రోడ్డుపై పారుతున్నాయి. ఈ సమస్యతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ అధికారులు పారిశ్శు సిబ్బంది ఎలాంటి పనులు చేపట్టక పోవడంతో చెత్తచెదారంతో నిండి దుర్వాసనతో వస్తుందని సమీప నివాసాల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పూడికతీత పనులు చేపట్టాలని కోరుతున్నారు.



పూడికతో నిండిన మురుగు కాలువ

రసాభాసగా ఉపాధి గ్రామసభ



నిధుల దుర్వినియోగంపై ప్రశ్నిస్తున్న స్థానికులు

అనంతసాగరం, జూలై 2: స్థానిక సచివాలయం-1 వద్ద మంగళవారం జరిగిన ఉపాధిహామీ గ్రామసభ రసాభసగా మారింది. ఏడాది పాటు గ్రామంలో జరిగిన ఉపాధి పనులపై ఆడిట్ సిబ్బంది కొన్ని రోజులుగా విచారణ చేశారు. చేసిన పనులు, పనికెళ్లిన వారి వివరాలను గ్రామసభలో వెల్లడించడంతో స్థానికులు అభ్యంతరం తెలిపారు. ఫీల్ట్, టెక్నికల్ అసిస్టెంట్లు పనికి వెళ్లని వారి పేర్లతో దొంగ మస్టర్లు నమోదు చేసి భారీగా నిధులు దుర్వినియోగం చేశారని, సమగ్రంగా విచారణ జరిపి నిధుల రికవరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఏపీవో దయాసాగర్‌తో కొందరు వాగ్వివాదం చేశారు. పనులపై విచారణ జరపకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభ, ఎంపీటీసీ రాపూరు సుజాతమ్మ, ఈవోపీఆర్డీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ పింఛన్ల పంపిణీ

సీతారామపురం, జూలై 2: మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం రెండవరోజు కొనసాగినట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. మొదటిరోజు 92శాతం పింఛన్లు పంపిణీ చేశామని, మిగిలిన 8శాతం పింఛన్లను మంగళవారం సచివాలయ, అంగ న్వాడీ సిబ్బందితో పంపిణీ చేయించామన్నారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ రమేష్ చంద్ర, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

కలువాయి: అనారోగ్యంతో నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కనుపూరుపల్లి గ్రామానికి చెందిన వాకాటి లక్ష్మమ్మకు మంగళవారం సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. అలాగే చింతలాత్మకూరుకు చెందిన నాగిరెడ్డి శంకరమ్మ అనే వృద్ధురాలు కడప జిల్లా పొద్దుటూరులోని కొవ్వూరు రామసుబ్బారెడ్డి వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతుంది. మంగళవారం సచివాలయ సిబ్బంది, గ్రామ సర్పంచుతో కలసి అక్కడకు వెళ్లి పింఛను నగదును అందజేశారు. ఇద్దరు వృద్ధులు ఆనందం వ్యక్తం చేసినట్లు పింఛను అందజేసిన సిబ్బంది తెలిపారు.

చెరువు అలుగు కాలువలను పరిరక్షించాలని వినతి



మంత్రి ఆనంకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు, జూలై 2: ఆక్రమణలోని ఆత్మకూరు చెరువు అలుగు కాలువలను పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్, ప్రముఖ న్యాయవాది కే వీ శేషారెడ్డి మంగళవారం రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆత్మకూరు స్పార్క్ సిటీ యాజమాన్యం చెరువు అలుగులను 3.82సెంట్లు ఆక్రమించినట్లు ఇరిగేషన్ ఉన్నతాధికారుల సర్వేలో తేలిందని విన్నవించారు. ఈ అలుగు ఆక్రమణతో వాశిలి, కుప్పురుపాడు చెరువులకు ఆత్మకూరు చెరువునకు మిగుల జలాలు అందకపోవడంతో సాగునీటికొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ విషయమై మూడేళ్లుగా కలెక్టర్, ఇరిగే షన్‌శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు.

పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యం

ఉదయగిరి రూరల్, జూలై 2: ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు శివకల్పన తెలిపారు. మంగళవారం డెంగ్యూ నివారణ మాసోత్సవాల్లో భాగంగా వైద్యఆరోగ్య సిబ్బంది పట్టణంలో నినాదాలతో కూడిన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు, పూలకుండీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కీటక జనితవ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా బారి నపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు

వరికుంటపాడు, జూలై 2: విరువూరు మారుతీనగర్‌లో నిర్వహించిన సీతారాముల ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలతో పాటు గ్రామోత్సవం, వసంతోత్సవం, పారువేట కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేశారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని బీసీకాలనీ సమీపంలో వెలసిన సంతానలక్ష్మి ఆలయ 16రోజుల పర్వదిన వేడుకలను ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు వేకువజాము నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నడింపల్లిలో..: గ్రామంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలు ముగిశాయి. నిర్వాహకులు వసంతోత్సవం, ఉట్టుకొట్టుట, పారువేట కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరిం చారు.

వరికుంటపాడు: విరువూరు మారుతీనగర్‌లో నిర్వహించిన సీతారాముల ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలతో పాటు గ్రామోత్సవం, వసంతోత్సవం, పారువేట కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేశారు.

పగిలిన ఆర్టీసీ బస్సు టైరు

ఉదయగిరి, జూలై 2: స్థానిక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు టైర్ మంగళవారం ఉదయం బస్టాండ్ సెంటర్‌లో పగిలిపోయింది. బస్సు తెల్లవారుజామున బద్వేల్‌కు వెళ్లింది. తిరిగి ఉదయగిరి చేరుకుంది. గండిపాళెం మార్గంలోని పెట్రోల్ బంకు వద్ద తిరిగి వెళుతుండగా ముందు వైపు టైరు పెద్ద శబ్దంతో పగిలింది. డ్రైవర్ గమనించి చాకచక్యంతో బస్సును నిలిపివేశాడు. లేకపోతే పక్కనే ఉన్న దుకాణాల్లోకి దూసుకెళ్లేది.

7న మాదిగల ఆత్మగౌరవ కవాతు

వింజమూరు, జూలై 2: జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ నెల 7న నిర్వహించనున్న మాదిగల ఆత్మగౌరవ కవాతు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సంఘం సభ్యులతో సమావేశమై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఏర్పడి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ కవాతును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగలు, వడ్లపల్లి కృష్ణయ్య, గోసాల సుధాకర్ మాదిగ, మల్లెల తిరుమలేష్ మాదిగ పాల్గొన్నారు.

ప్రజలకు దగ్గరగా ఉంటేనే సమస్యల పరిష్కారం

- విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే కాకర్ల



ఎమ్మెల్యే కాకర్లకు హారతులిస్తున్న మహిళలు

కొండాపురం, జూలై 2: ప్రజలకు దగ్గరగా ఉంటేనే సమస్యల పరిష్కారం సులభంగా ఉంటుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మొదటిసారిగా మడంలంలోని మర్రిగుంటలో మంగళవారం టీడీపీ నాయకులు చిట్టాబత్తిన మాచర్ల, చిట్టాబత్తిన బ్రహ్మయ్య, పామూరి తిరుపతిరెడ్డి, పర్రె మాలకొండరాయుడు, దార్ల గోవిందు ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవర్యాలీలో ఆయన పాల్గొన్నారు. మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు విన్న కాకర్ల త్వరలో అన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ కాలనీ వద్ద టీడీపీ జెండా ఆవిష్కరించారు. గతంలో కాకర్ల ట్రస్టు ద్వారా రూ.1 లక్ష విరాళంగా తీసుకుని పోతురాజు గుడి ప్రహరీ నిర్మించడంతో అక్కడకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని ప్రార్థించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఒక్క రోజులో దాదాపు 95 శాతం పింఛన్లను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయించామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిలేని పాలన అందించేందుకు కృషి చేస్తానన్నారు. కాగా ఎమ్మెల్యే పర్యటన ఉన్నప్పటికీ ఒక్క అధికారి కనిపించకపోవడంపై కాకర్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎం.ఓంకారం, నాయకులు పోలినేని రమేష్, దామా మహేశ్వర రావు, పీ.చంద్రబాబునాయుడు, డీ.అశోక్, ఎస్.శివన్నారాయణ, వల్లూరు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడుకు చేరిన అమరావతి రైతుల పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

ఉలవపాడు, జూలై 2 : రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడితే తిరుమలకు పాదయాత్ర చేస్తామన్న మొక్కును చెల్లించేందుకు అమరావతి రైతులు చేపట్టిన పాదయాత్ర మంగళవారం ఉలవపాడుకు చేరింది. ఈ పాదయాత్రలో ఉలవపాడు జాతీయ రహదారిపై తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొని అమరావతి రైతులతో కలిసి టీడీపీ మండల కార్యాలయం వరకు పాదయాత్ర చేసి సంఘీభావం తెలిపారు. పార్టీ కార్యాలయం వద్ద తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు ప్రభావతి అమరాతి రైతులకు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కందుకూరు, ఉలవపాడు మండలాల అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రాచగల్లు సుబ్బారావు, నేతలు పొడపాటి సుధాకర్, పొడపాటి మహేష్, దశరథ, మాల్యాద్రి, వెంకట్రావు, శివకుమార్, శ్రీను, కొండపనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ

అల్లూరు, జూలై 2 : ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు జీవితాలకు భరోసా ఇస్తుందని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. మండలంలో ఇస్కపల్లిలో మంగళవారం ఆయన లబ్దిదారు లకు పింఛను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు పాపనబోయిన రత్తయ్య, కార్యదర్శి తెనాలి మురళీకృష్ణ, సచివాయల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఆసుపత్రికి వెళ్లి పింఛను పంపిణీ

కందుకూరు : పింఛన్‌దారులు అందుబాటులో ఉన్నా ఏవో సాంకేతిక కారణాలు చూపి వారికి నగదు ఇవ్వకుండా ఇబ్బందులపాల్జేసిన గత ప్రభుత్వంలోని పరిస్థితులు మారిపోయాయి. కందుకూరు పట్టణంలోని జనార్దనకాలనీకి చెందిన వంగపాటి రాములమ్మ కేన్సర్‌తో బాధపడుతూ గుంటూరులోని ఒమేగా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా 1వ సచివాలయం అడ్మిన్ రాంబాబు మంగళవారం అక్కడికి వెళ్లి ఆ మహిళకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదు రూ.7వేల అందజేసి వచ్చారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక సరఫరా చేయాలి

బిట్రగుంట, జూలై 2: ఎన్నికల కోడ్‌తో నిలిపి వేసిన ఇసుక రవాణాను ప్రభుత్వ నిబంధనల మేరకు సరఫరా చేయాలని బోగోలు మండల సీపీఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సీఐటీయు మండల అధ్యక్షుడు చల్లా నరహరి, భవన కార్మిక సంఘ సభ్యులతో కలసి ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే.బాదుల్లా, టీ.శ్రీనివాసులు, వెంకయ్య, పీ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రసన్నుడికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట: బోగోలు మండలం కొండబిట్రగుంట నివాసి ప్రసన్న వేంకటేశ్వరస్వామిని ఆలయ మాజీ చైర్మన్ నగళ్ల కిరణ్‌కుమార్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కావలి మాజీ జట్పీడీసీ కందల శ్రీనివాస్, కావలి సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు నాగంగారి శ్రీనివాసులు, గద్దె వెంకటేశ్వర్లు, చల్లా రవి, మురళీ ఉన్నారు.

'టీఆర్‌ఆర్'లో ఆన్‌లైన్ ప్రవేశాల ప్రారంభం

కందుకూరు, జూలై 2: స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 10వ తేది వరకు గడువు పొడిగించినందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 5న కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన, 11నుంచి 15 వరకు కళాశాలలో కోర్సుల ఆప్షన్ల ఎంపిక, 19న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 8686368689, 9490300526ను సంప్రదించవచ్చునని తెలిపారు.

ఏపీ ఎన్జీవో 4వ తరగతి ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



4వ తరగతి ఉద్యోగుల కార్యవర్గంతో నాయకులు

కావలిటౌన్, జూలై 2: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన డివిజన్ స్థాయి సమావేశం ఏపీ ఎన్జీవో నాల్గవ తరగతి ఉద్యోగుల నూతన కార్గవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా చింతపూడి రవి, అసోసియేట్ అధ్యక్షుడుగా షేక్ గయాజ్, ఉపాధ్యక్షుడుగా రవి కుమార్, ప్రధాన కార్యదర్శిగా కనకాద్రి, అసోసియేట్ కార్యదర్శిగా జమీల, కోశాధికారిగా బట్టి శ్రీనాథ్, సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సందీప్ చక్రవర్తి, డివిజన్ అధ్యక్షుడు ఎస్ శివకుమార్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, ఏపీ ఎన్జీవో డివిజన్ ఉపాధ్యక్షుడు దీక్షితులు, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

కత్తితో దాడి : ఒకరికి గాయాలు

కావలి రూరల్, జూలై 2: కావలి మండలం రుద్రకోట ఆటోస్టాండ్ సమీపంలో టీ కొట్టు వద్ద మంగళవారం రాత్రి ఓ వ్యక్తి పాలకీర్తి దుర్గయ్యపై కత్తితో దాడి చేశాడు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పాత గొడవలు దృష్టిలో పెట్టుకుని పెదనాన్న కొడుకైన ఆదిశేషు మద్యం మత్తులో దాడికి పాల్పడగా స్థానికులు అడ్డుకోవడంతో అక్కడ నుంచి పారిపోయాడు. గాయపడిన దుర్గయ్యను చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

లింగసముద్రం, జూలై 2 : డయేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లింగసముద్రం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.రమేష్ చెప్పారు. మంగళవారం డయేరియాను ఆపండి, డెంగ్యూ మాసోత్సవాల కార్యక్రమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూరాధ, సీహెచ్‌ఓ జి.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం లింగసముద్రం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన జీ.అరుణను వైద్యులు, సిబ్బంది, తదితరులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

రక్తదానం

దగదర్తి(బిట్రగుంట), జూలై 2: రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పుట్టిన రోజు సందర్భంగా దగదర్తి మండలం దామవరంలోని బీఎంఆర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆవరణంలో మంగళవారం కంపెనీల మేనేజర్లు శంకర్ నారాయణ, సుకుమార్‌రెడ్డి, వీరాస్వామి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కావలి రెడ్‌క్రాస్ సౌజన్యంతో మేనేజర్ బ్రహ్మానందరెడ్డి, సెక్యూరిటీ ఎండీ డాక్టర్ శేషాద్రియాదవ్, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కావలి మున్సిపల్ మాజీ చైర్మన్ నగళ్ల కిరణ్‌కుమార్, కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రమణ్యం యాదవ్, అదనపు మేనేజర్లు కిషోర్, సురేష్, మోహిద్దీన్, వినోద్ పాల్గొన్నారు.

బస్సు క్లీనర్ మృతికి సంతాపం

బిట్రగుంట, జూలై 2: కావలి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోగోలు పంచాయతీ యాదవపాలెంకు చెందిన స్కూలు బస్సు క్లీనర్ దేవరాల చిన్నకొండయ్య (67) మృతి చెందారు. ఆయన మృతికి టీడీపీ, బీజేపీ మండల కన్వీనర్లు మాలేపాటి నాగేశ్వరావు, నూకసాని శ్రీనివాసులు యాదవ్, రాజ్యలక్ష్మీ, చిలకపాటి వెంకటేశ్వర్లు, పోతల శీనయ్య, దొడ్ల అంజయ్య, నేతిపిచ్చయ్య, గనిపిన్నేని నాగరాజు, సురేష్ సంతాపం తెలిపారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

కావలి, జూలై 2: దివ్యాంగుల పింఛన్ రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచటాన్ని హర్షిస్తూ టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మన్నవ వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం కావలి ఏరియా వైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివ్యాంగులు సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, నాయకులు నన్నూరి మాధవరావు, ప్రళయకావేరి రాజు, శ్రీను, వేణు, క్రిష్ణా, సోమయ్య, మరియమ్మ, పోలమ్మ, రావమ్మ తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

కందుకూరు, జూలై 2: పట్టణంలోని జనార్దనకాలనీ ప్రాథమిక పాఠశాలలోని నిరుపేద విద్యార్థులకు మోపాడుకు చెందిన తోకల వెంకటేశ్వర్లు మంగళవారం నోట్‌పుస్తకాలు, కేయాన్స్, పెన్నులు, ప్యాడ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి.రామలక్ష్మమ్మ, సీఆర్పీ పీఎస్ ప్రతిభ, ఉపాధ్యా యినిలు పి.శాంత కుమారి, బి.పద్మ, జి.రాధిక తదితరులు పాల్గొన్నారు.